# ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

22-11-50



# విషయానుక్రమణిక

## 22 నవంబరు 1950


**వ్యాసాలు:**

మన దేశం— 4
నేటిప్రపంచం— 8

**సీరియల్స్:**

పట్నవాసం—శ్రీ కొడవటిగంటి కుటుంబరావు 9

**కథలు:**

పరిణామం—శ్రీ ఆకుండి నారాయణమూర్తి 16
దాగిన రహస్యం—శ్రీ ఆర్. ఆర్. కృష్ణమూర్తి 24
ప్రణయ తపస్విని—శ్రీ యర్రమిల్లి చలపతిరావు (శ్రీవత్సవ) 19

**శ్రవ్యనాటిక:**

చెరువుగండి—శ్రీ జి. రామచంద్రరావు 13

**సినిమా:**


ప్రతిభావారి "స్వప్న సుందరి"—"ప్రేక్షకుడు" 27
శ్రీ నాగయ్యగారితో గోష్ఠి—
శ్రీ సూరిశెట్టి సాంబశివరావుబాబ్జీ 29

**బొమ్మరిల్లు:**

ఏడుగుర్రాల కథ—"చిత్రసేన" 33
టామ్‌సాయర్ (సీరియల్)—మార్క్ ట్వేన్ 35
ఎవరిని శిక్షించాలి?—శ్రీ నరహరిశెట్టి నరసింహారావు 39
దేవకన్య—శ్రీ ఆరికికేవుల రామశర్మారావు 40
తమాషా ప్రశ్నలు— 22

**గేయం:**

రావోయి, చందమామ!—రాజశ్రీ 32
శాంతిగీతం—శ్రీ రామమోహనరావు 22


# ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము
ప్రకటింపబడును
**Founder: K. NAGESWARA RAO**

సంపుటము **43**
సంచిక **11**

వికృతి సంవత్సర కార్తీక శుద్ధ త్రయోదశి బుధవారము




**సుముహూర్తం మళ్ళీ వాయిదా పడింది!**

నూత్న రాజ్యాంగం అనుసరించి శాసనసభలకు జరుగవలసిన ఎన్నికలు 1951 డిసెంబరుకు వాయిదాపడినట్లు అధ్యక్షుడు ప్రకటించాడు.

# మనదేశం

### ఎన్నికల వాయిదా

దేశంలో సర్వవ్యాప్త ఎన్నికలు మరోసంవత్సరానికి గాని జరగవు. ఈ విషయాన్ని అధ్యక్షుడు డాక్టరు రాజేంద్రప్రసాదు పార్లమెంటు తృతీయ సమావేశం ప్రారంభిస్తూ ఈ నెల 14 వ తేదీన తెలిపాడు.

నూతన రాజ్యాంగంకింద 17 లేక 18 కోట్ల వోటర్లు పాల్గొంటారు. ఇంత జనబాహుళ్యంమీద సర్వవ్యాప్త ఎన్నికలు జరగటం ప్రపంచంలో ఇదే మొదటిసారి అవుతుంది. రష్యాలోకూడా ఎన్నికలు బ్రహ్మాండంగానే జరుగుతాయిగాని అక్కడి వోటర్ల సంఖ్య 12 కోట్లకు లోపు. చైనాలో ఇంతవరకు వయోజనవోటింగుపద్ధతిపై సర్వవ్యాప్త ఎన్నికలు జరగలేదు. ఇంత పెద్ద ఎత్తున జరిగే ఎన్నికలకై కేంద్రముగూ, రాష్ట్రాలూకూడా చాలా కృషిచేయవలసి ఉన్నది. అనేక రాష్ట్రాలు తొలివోటర్ల జాబితాలను ప్రకటించిఉన్నవి. కాని అస్సాం, బీహారు, పశ్చిమబెంగాలు మొదలైన కొన్ని రాష్ట్రాలు ఇంకా సన్నాహాలు పూర్తిచేసినట్టు కనబడదు. ముఖ్యంగా అస్సాం ఇటీవలి భూకంపంనుంచి చాలా దెబ్బతిని ఇంకా ఏమాత్రమూ కోలుకోలేదు.


మొదట అనుకున్నప్రకారం 1951 ఏప్రిల్, మే మాసాలలోనే ఈ ఎన్నికలు జరగవలసిఉండెను. వాటిని వాయిదా వేయవలసిన అవసరం కూడా ఉండదని కొన్ని మాసాలక్రితం తెలుపబడింది. కాని ఇవి తొలి ఎన్నికలు కావడంవల్లా, అనుకోని అవాంతరాలు కలగడంవల్లా, ఏ ఒక రాష్ట్రం ఏకారణం చేతఎన్నికలకు సంసిద్ధం కాకపోయినా మిగిలిన రాష్ట్రాలు ఆగకతప్పదు కనుకా ఎన్నికలను ప్రభుత్వం 1951 నవంబరు, డిసెంబరు మాసాలకు వాయిదా వేసిఉండవచ్చు. ఈ వాయిదా ప్రభుత్వానికి ఇష్టం లేకపోయినప్పటికీ, రాగల ఏప్రిలు, మే మాసాలలో ఎన్నికలు జరపడంవల్ల దుష్ఫలితాలుంటవని పూర్తిగా గ్రహించి ఈ నిర్ణయం చేయబడిందని అధ్యక్షుడు తెలిపాడు. ఎన్నికల వాయిదా నెహ్రూకు కూడా ఇష్టంలేదనీ, అవి ఎంత శీఘ్రంగా జరిగితే ఇప్పటి అసందిగ్ధ అయోమయపరిస్థితి అంత బాగా తొలగిపోతుందని ఆయన భావిస్తున్నాడనీ తెలుస్తున్నది.

### ఎన్నికల సన్నాహాలు

జరగవలసిన ఎన్నికల సన్నాహాలలో నియోజక స్థానాల నిర్ణయం ఒకటిఉన్నది. దీనికి సంబంధించి అధ్యక్షుడు చేసే ఉత్తరువు పార్లమెంటు తృతీయ సమావేశంలో చర్చించే అవకాశం లేకపోవచ్చుననీ, ఉత్తరువు జారీకావడం ఆలస్యం కావచ్చుననీ చెబుతున్నారు. నియోజక స్థానాల నిర్ణయం గురించి వివిధరాష్ట్రాలనుండి పార్లమెంటరీ

(46-వ పేజీ చూడుడు)

[illegible]



కాంగ్రెసు కార్యవర్గంవారు కృపలానీగారి కాంగ్రెసు డెమొక్రాటిక్ ఫ్రంటును గురించి చర్చించారు. —(శంకర్స్ వీక్లీ)

# ఆరిపోయిన దివిటీ

### అంగారకుడు

కొన్నాళ్ల కిందట మా వూళ్లో సర్వజ్ఞ సింగభూపాల గ్రంథాలయం అని ఒకటి స్థాపించబడ్డది. పేషణీహనుమంత బిరుదాంకితులు శ్రీమంతు రాజా వజ్ర వైడూర్యమాణిక్యభూపాలునింగారు ప్రారంభోత్సవం జరిపారు. ఆ ఉత్సవ వివరాలను రిపోర్టుచేయటంకోసం విశ్వరూపం తరఫున విలేఖరిగా వెళ్ళటంవల్ల రాజావారి పరిచయభాగ్యం నాకు లభించింది.

సింగభూపాల గ్రంథాలయ కార్యదర్శిగారు తన ఉపన్యాసాన్ని కత్తిరించకుండా పూర్తిగా పత్రికలో వేయించే షరతుమీద, రాజావారితో ఇష్టాగోష్ఠి జరపటానికి అవకాశం కలిగించారు. శ్రీమంతు పేషణీ హనుమంతులుంగారు చూట్టానికి అపర జాంబవంతులల్లే ఉన్నారు కాని తెలివితేటలు అద్భుతంగా ఉన్నట్లుకనిపించింది.

* * * *

రాజావారి పూర్వీకుడు సింగభూపాలుడి దగ్గర దండనాథుడని ఎవరో చెప్పగా వినటంవల్ల, ఆయనమీదనే చర్చ ప్రారంభించాను.

"సింగభూపాలుడు నిజంగా సర్వజ్ఞుడే నండీ?" అన్నాను.

"ఆయన అట్లాంటివాడు, ఇట్లాంటివాడు అని మీటింగులో అంతా పాడిన పాటే పాడతారు గాని దేశానికి ఆయన చేసిన మేలు యెవళ్లూ చెప్పరు," అన్నాడు ఆయన.

"ఏవిషయంలో?"

"ఆయనవల్ల మన తెలుగుదేశంలో ద్రవిడస్థాన్ ఉద్యమం రాకుండాపోయింది."

"ఏం చేశాడాయన?"

"అసలు ద్రవిడస్థాన్‌వాదం ఎట్లా వచ్చిందంటారు? అరవదేశంలో బ్రాహ్మలకు అరవం దిశాయించ లేదు. బ్రాహ్మణేతరులు సంస్కృతం చదివితే తమ ద్రవిడ నాలుకలు మైల పడతయ్ అనుకున్నారు. దాంతో వాళ్లిద్దరూ వేరే వేరే జాతులు అయినట్టూ, సంస్కృతం పనికిరానిదైనట్టూ అభిప్రాయం ఏర్పడి, ద్రవిడస్థాన్ వాదం బయలుదేరింది. కాని తెలుగుదేశంలో అట్లా కాదు. తెలుగుకవిత్వం రాసినవాళ్లల్లో ముప్పాతిక భాగం బ్రాహ్మలే. బ్రాహ్మణేతరుల్లో సంస్కృత భాషలో హేమాహేమీలు ఎంతోమంది ఉన్నారు. సింగభూపాలుడు అటువంటి వాళ్లల్లో చాలా గొప్పవాడు."

"ఇంత ముఖ్యమైన విషయాన్ని ఇందాక మీటింగులో చెప్పలేదేమండీ? మొదటి పేజీలో స్ట్రీమర్ హెడ్‌లైన్ వేసి ఉండేవాళ్లం."

"అక్కడికి వచ్చినవాళ్లంతా సొంత డబ్బా వాయించుకోటానికి వ[illegible] వాళ్లే కాని నే చెప్పింది వినే దెవరండీ? ఇంక పోతే, నే నిచ్చే చందాకోసమే నన్ను పిలిచారు. అసలు ఈ 'బుద్ధి' జీవుల దృష్టిలో మేము కేవలం చందాలను పితికే ఆవులం మాత్రమే."

నేను నవ్వి, "వాళ్ల అభిప్రాయాన్ని బాగా కనిపెట్టేశారే," అన్నాను.

"అన్నీ తెలిసే ఉన్నప్పటికీ, యేమీ తోచకపోవటంవల్లనూ, చందాల కక్కుర్తికి వీళ్లు పట్టే కైవారాలు షోకు అనుభవించటంకోసమూ ఇస్తూ ఉంటామండీ."

"మీకు కూడా తోచకపోవట మేమిటండీ?"

"పని పాట లంటూ యేమీ లేకపోతే మరేం జరుగుతుంది? ప్రభువుల శకం ఉన్నంతకాలమూ మాకు క్షణం తీరిక ఉండేది కాదు. వీ లయినంతవరకూ ప్రతి పనిమీదనూ అజమాయిషీ చేసేవాళ్లం. ప్రతి రోజూ న్యాయస్థానం ఏర్పాటు చేసి, తప్పో, ఒప్పో తీర్పులు ఇస్తూ ఉండేవాళ్లం. సంగీతాలు, నాట్యాలు, కొలువు కూటాలు, ఇంకా ఓపిక ఉంటే మారు వేషాలతో ఊళ్లు తిరిగేవాళ్లం."

"మీ పరిపాలనలో న్యాయం జరిగే దంటారా?"

"ఇప్పటికన్నా మెరుగే. మాదాకా ఫిర్యాదులు రావటం కొంచం కష్టంగా ఉండేదేమో కాని, వస్తేమటుకు నిక్కచ్చిగా విచారణ జరిపేవాళ్ళం. అంతే కాని ఇప్పటివాళ్ల మోస్తరుగా, వాళ్లు మా పార్టీల వాళ్లనీ, వీళ్లు మా మురాల వాళ్లనీ, ఫిర్యాదుల్ని బుట్ట దాఖలు చేసే వాళ్ళం కాదు. మంత్రు లయేది, వాళ్ల తాత లయేది— నిక్కచ్చిగా విచారణ జరిగేది. అధికారులు అన్యాయాలు చేసినా, వెంటనే సర్దుబాటు చేసే వాళ్లం."

"అసలు అధికారులు అన్యాయాలు చేయకుండా నివారించలేకపోయినా రన్న మాటేగా?"

"నిజమే. అధికారులు అన్యాయాలు చేయకుండా చేయటం మా ప్రభువుల చేత కాలేదు. ఈ గుమాస్తాశకంలో అసలు దానికి అవకాశమే లేదు."

"గుమాస్తా శకం ఏమిటండీ?"

"అంటే ఇప్పుడు మీరు ప్రజాస్వామ్యం అనేదే."

"దానికి ఆపేరు పెట్టా రెందుకు?"

"మరి కాకపోతే యేమనమంటారు? మా కింద గుమాస్తాలుగా పని చేసినవాళ్లకి అంతా తామే కొట్టేద్దామని బుద్ధి పుట్టింది. మా దయాధర్మాలవల్ల గనులు తవ్వించటం, వ్యాపారం జరపటం నేర్చుకున్న మేనేజర్‌గాళ్లూ, మా చేతికింద జమీలు నిర్వహించటం నేర్చుకున్న గుమాస్తాగాళ్లూ, మా మోచేతి కింద గంజి తాగి బతికిన మోతుబరి కమతగాళ్లూ కలిసి మాకు సున్నా చుట్టి, చక్రం తిప్పుతున్నారు. అయితే మమ్మల్ని కిందికి లాగటానికి మాత్రం కింది జనాన్ని ఉపయోగించుకున్నారు."

"ఎందుకండీ అట్లా చెప్తారు? మిమ్మల్ని కిందికి లాగారన్న కోపంతో అట్లా అంటున్నారు కాని, అది ప్రజాస్వామ్యం కాకుండా ఎట్లా పోతుంది?"

"గుమాస్తాశకం అని మిమ్మల్ని కూడా అందులో చేర్చానన్న కోపంతో అట్లా అంటున్నారు కాని, నిజం మీకు తెలియదూ? స్వయంగా పొలం దున్నే రైతులూ, కోతలు కోసి కుప్పలు నూర్చే కూలీలూ, గనుల్లోనూ, ఫ్యాక్టరీల్లోనూ చచ్చేట్లు చాకిరి చేసే కార్మికులూ—వీళ్లల్లో ఒక్కరయినా అధికారంలో ఉన్నారటండీ? వందల ఎకరాల ఆసాములూ, ఫ్యాక్టరీలు, గనులు, కంపెనీలు, బాంకులు మొదలైనవాటిని నడిపే షావుకార్లూ, ఈ ఇద్దరికీ తాజీం ఇచ్చే

గుమస్తాగాళ్లా తప్ప అధికారంలో ఉన్నది యెవరండీ? పేరు పేరు వరసనా విప్పి చెప్పేదా?" అని ఆయన రెట్టించాడు.

ఆయన ఏం పంచాంగం విప్పుతాడో అన్న భయం వేసి," ఆఁ! ఆఁ! అక్కర్లేదు లెండి" అన్నాను.

"అసలు సంగతి చూశారో లేదో, ఈ గుమాస్తాగాళ్లున్నారే, వీళ్లు, అలగాజనం పేగు చెప్పుతారే, కాని, అసలు వాళ్లు పైకి రాకుండా అడ్డు పడేది వీళ్ళే."

"దానికి ఒప్పుకోనండీ,"

"అయితే వినండి-ఫ్రాన్సులో 1789 లో జనమంతా కలిసి రాజరికం మీద తిరుగుబాటు చేశారు. ఎక్కువ తక్కువ లెంత మాత్రమూ లేకుండా చేస్తామని గుమస్తా ప్రచారకులు చెప్పటంవల్ల అలగాజనం అందులో చేరి, ముందు నిలబడి, ఒక్క ఫ్రెంచి రాజరికాన్నే కాక, యావత్తు యూరప్‌నీ గడగడ లాడించారు. కాని ఏమయింది? అలగాజనం పైకొస్తారేమోనని భయపడి, గుమాస్తాగాళ్లంతా కలిసి మళ్ళీ నెపోలియన్‌ని తీసుకొచ్చి గద్దె యెక్కించారు."

"ఫ్రెంచి విప్లవపు ఉద్దేశాలకూ, కమ్యూనిస్టు విప్లవాశయాలకూ తేడా ఉన్నదండీ"

"అది ఆచరణలో మాత్రమే లెండి. సరే ఇంకో సంగతి చూడండి. మళ్లీ ఫ్రాన్సులో 1871 లో మామూలుజనం కమ్యూన్‌లను స్థాపించటానికి విప్లవం జరపగా, గుమస్తా మహాశయులు జర్మన్ ప్రధాని బిస్మార్క్‌తో కలిసి దానిని అణిచేశారు. జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చేటప్పుడు ఇట్లాగే జరిగింది. కమ్యూనిష్టులు చాలా బలం సంపాదించేటప్పటికి, గుమాస్తాలూ, షావుకార్లూ, అన్ని పార్టీల వాళ్లూ, ఏకమై, హిట్లర్ను గద్దె ఎక్కించారు."

"మీరెన్నయినా చెప్పండి. ప్రజాస్వామ్యాలవల్ల మధ్య తరగతి ప్రజలు జాతీయ సంస్కృతులను ఎంతో బలపరిచారని అంగీకరించక తప్పదు."

"ఆఁ! గుమాస్తాల సంస్కృతా?" అంటూ హాలు దద్దరిల్లిపోయేట్లుగా నవ్వారు మాణిక్య భూపాలునింగారు.

"ఏమిటండీ, అట్లా నవ్వుతారు?" అని అని అడిగాను ఆశ్చర్య పడుతూ.

"ప్రపంచంలో పరమ బేవార్సు విషయం ఏమయినా ఉన్నదంటే అది వాళ్ల సంస్కృతే నని ఢంకామీద దెబ్బ కొట్టి చెపుతాను. మా అలవాట్లనీ, అభిరుచులనూ అనుకరించపోతే, పులిని చూసి వాతలు పెట్టుకున్న నక్క మోస్తరుగా తయారయింది వాళ్ల సంస్కృతి. ఒక్క విషయం చూడండి. ఆత్మగౌరవం ఉన్నవాడెవడయినా సొంత డబ్బా కొట్టుకుంటాడా? ఛీ! ఛీ! ఈ గుమాస్తాజాతికి పొద్దున లేస్తే అదే పని గదా! ఎంత చవకపారుగా ఉంటుందండీ వాళ్ల దృష్టి!" అని ఎంతో చీదరించుకున్నాడు ఆయన.

"మన డబ్బా ఇతరులెవరూ కొట్టకపోతే, మనమే కొట్టుకోవాలి గదండీ!"

"పోనీ, యేదో యేడుస్తారనుకుందాం. కాని వాళ్ల అందానికి తోడు వాళ్లకి కూలీనాలీల పద్ధతిని చూస్తే యీసడింపు నిజానికి కూలి నాలి జనపు బతుకే కొంచెం నయం. అందులో జీవం, పటుత్వం అయినా ఉన్నవి.

"మీరు కమ్యూనిస్టు మోస్తరు మాట్లాడుతున్నారు."

"లేదు, బాబూ, ఇంకా రెండు దశలు గడిస్తే నేకాని మేం కమ్యూనిస్టులం కాము."

"ఏమి టవి?"

"ఒకటి పెట్టుబడిదారు దశ. రెండు గుమాస్తాదశ."

"అదెట్లా అవుతారు మీరు"

"సావధానంగా వినండి. గనులు, అడవులు మాకింద ఉంటే పెట్టుబడిదార్ల ఫాక్టరీలకు సరుకు బందుచేస్తామేమోనని వాటినీ, పెద్ద పొలాలు మాకింద ఉంటే పొట్టలు పెరిగిన ధనిక రైతుల పీకలు నొక్కేస్తామేమోనని వాటినీ తువరం చేస్తున్నారు. మాకు తువరం అయితే జరుగుతున్నది కాని జనానికి ఒరుగుతున్నదేమీ లేదు."

"ఒరక్కపోవట మేమిటి?"

"ఏం ఒరుగుతున్నది? ఒరక్కపోవటం వల్లనే సంస్థాన కాంగ్రెసు లన్నింట్లోనూ కొట్లాటలు ఎక్కువయినవి. దీనికి కారణం నాకు తెలుసు. మా మేనమామగారి సంస్థానంలో, వెనక ఆయన కింది రౌడీ ముఠానాయకుడు ఇప్పుడు అక్కడి ప్రజోద్యమంలో పెద్ద నాయకుడు. మా బావమరిది సంస్థానంలో, డిస్మిస్ అయిన దివాన్‌గారి తమ్ముడే నాయకుడు. మా అల్లుడుగారి సంస్థానంలో, సంస్థానం అంతటికీ పెద్ద భూస్వాములు నలుగురి చేతిలో ఉద్యమం నడుస్తున్నది."

"అయితే?"

"ఇప్పుడు షావుకార్లకూ, పెద్ద రైతులకీ తగాదా వొచ్చింది. గుమాస్తాలు ఎక్కువ మంది షావుకార్లపక్కన చేరారు. ఈ గుమస్తాలంతా కలిసి షావుకార్ల బలాన్ని పెంచటంకోసం, మమ్మల్ని కూడా షావుకార్లు చేయాలని పన్నాగం పన్నారు.

"ఏమి టది?"

"ఏముంది! పరిహారాలు ఇప్పించటం. ఈ పరిహారాల కింద ఇచ్చే డబ్బు ఎక్కువగా రైతులు చెల్లించే పన్నుల్లో నుంచేగా వచ్చేది!"

"ఓహో! అదా సంగతి?"

"అవును. మాకు డబ్బు ఇప్పించి, మమ్మల్ని కూడా పెట్టుబడిదార్లుగా మార్చేస్తే, వాళ్ళకి బలం కదూ!"

"ఒక వేళ పరిహారాలకి అడ్డం వస్తే?"

"భయం లేదు మొగ్గ మా వైపే ఉన్నది."

"మన దేశంలో గుమస్తారాజ్యం ఎప్పుడు బయలు దేరింది??"

"1857 విప్లవంలో జాతీయోద్యమ నాయకు లయిన ప్రభువులు దెబ్బ తిన్నప్పటి నుంచీ. "ఎంత గుమాస్తారాజ్యం అని మీరు ఎద్దేవా చేసినా, ప్రజాస్వామ్యం జాతీయ భావాలను బలపరించిందని అయినా ఒప్పుకుంటారా?"

"ఊఁహుఁ! జాతీయాశయాలను తమకు అనువుగా ఉపయోగించుకున్నది. అంతే. చెంగల్పట్ ఆర్కాట్ జిల్లాల తెలుగువాళ్లు తెలుగు చదువుకుంటే తమ కొంప మునుగుతుందనుకుంటారు అరవ జాతీయవాదులు. తిండికి లేక ఉద్యోగాలు చేసే అరవ వాళ్ళను చూసి యేడుస్తారు తెలుగు జాతీయ వాదులు. అసలు జాతీయవాదం మాలోనే ఉండేది."

"చాల చోద్యంగా చెపుతున్నారు."

"చోద్య మేముంది? మన దేశంలో జాతీయవాదాన్ని పడుములు విరగ్గొట్టటానికి బ్రిటిష్ వాళ్లు మొదట దెబ్బ తీసింది ప్రభువుల మీదనే. ఇప్పుడు ఫ్రెంచి వాళ్లు జాతీయవాదుల్ని కమ్యూనిస్టుల్లో నుంచి చీలదీయటానికి బావ్‌దాయ్ లాంటి వాళ్ళను ఉపయోగించటంలో కూడా ఉన్న అంతర్యం ఇదే.''

ఇంక ఆయనతో దబాయించి మాట్లాడటం అవసర మనుకున్నాను.

"మీ ప్రభువుల రోజుల్లో ఆశ్రిత పక్షపాతం ఎక్కువగా ఉండేది" అన్నాను.

"అబద్ధం. ఒక వేళ ఉన్నా, ఇప్పటి కన్నా మెరుగే. ఎంత నిరంకుశ ప్రభువైనా, సామర్థ్యం గలవాడు కనిపిస్తే చాలు! వాణ్ణి పైకి తీసుకొచ్చి, ఆదరించి, ఉపయోగించుకునేవాడు. ఈ సుగుణం వల్లనే ప్రభువుల యుగం రెండు మూడు వేల యేళ్లు సాగింది. అట్లా కాదు కనకనే గుమాస్తాల శకం మూడొందలు ఏళ్ళలో 33 పట్టీలు కొట్టింది. ఒక గుమస్తా రాజ్యంలో ఒక మంత్రిగారి మేనల్లుణ్ణి అతడి స్నేహితుడు "ఏమోయ్! మీ మామ

నీ కేదో ఉద్యోగం ఇప్పించాట్టగా?” అని అడిగాడట. “అవును. పక్షపాత నిర్మూలన శాఖకు హెడ్ గా వేశాడు,” అని మేనల్లుడు జవాబిచ్చాడట.” అని ఆయన పగలబడి నవ్వాడు.

నాకు మరీ కోపం ఎక్కువయింది.

“మీ రాజరికపు రోజుల్లో ఆడవాళ్లకు తెగ అవమానాలు జరిగేవట,” అన్నాను.

ఆయనకు కూడా కొంచెం కోపం వొచ్చింది. “ఎవరిలోనయినా మంచి వాళ్లు, చెడ్డవాళ్లు ఉంటారు. అయినా చూడండి. ఇప్పటిషాహుకార్లు డబ్బుతో వాళ్ళను చేరపట్టటం కన్నా, బలంతోనూ, సౌందర్యంతోనూ చేరపడితే, వాళ్లకు కొంచెం తృప్తిఅయినా ఉంటుంది.” అన్నాడాయన.

“అంటే ఏమీ లేదు. ఒక సామెత ఉన్నది చూడండి. రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూడగా, మొత్తబుద్ధి వేసిందట ఒక ఇల్లాలికి. అట్లాగే, ఆ షావుకార్ని చూసినప్పటినుంచీ ప్రాణం నిలవటం లేదనుకునే సెక్రటరీని కానీ, ‘అహా! ఆ జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారిని చూసినప్పటి నుంచీ, మొగుడు మొద్దులయినట్టే ఉన్నాడు’ అనే పంతులమ్మని కానీ చూపించండి” అన్నాడు ఆయన నవ్వుతూ.

“సినిమానాయకుల్ని చూసి అట్లా అనుకునేవాళ్లు ఉన్నారండోయ్” అన్నాను నేను కూడా నవ్వుతూ.

అయినా అంతటితో ఆయన్ని వదిలిపెట్టటం ఇష్టం లేక “మీ హయాంలో జనం బీదవాళ్లుగా ఉండేవాళ్లు,” అన్నాను.

“ఒప్పుకోను. మేము దివిటీలము—అయితే ఆరిపోతున్నాం అనుకోండి. గుమాస్తాలు దీపాలు. మేం వెలగటానికి కావలసిన చమురు అలగాజనపు చెమట, నెత్తుర్ల నుంచే రావాలి—అయితే రెండు దివిటీలు ఉండే చోట 40 దీపాలు వెలుగుతున్నవి. దివిటీల కన్నా ఎక్కువ చమురును దీపాలు పీలుస్తున్నవి.” అని ఆయన జవాబిచ్చాడు.

“మీ భవిష్యత్తు ఏమిటి?”

“ఏమీ లేదు. ఫాసిజం అన్నది ధనిక వాదానికి అంత్యదశ. అది రాగానే మా మహారాజులు, నవాబ్ జాదాలు, లార్డులు, సర్దార్లు మళ్లీ పైకి రావచ్చునేమో నని ఆశిస్తున్నాం. అదీ దగ్గిర కొస్తున్నది కాబట్టి మీరుకూడా మీ వంశవృక్షాలు తిరగేసి, ఒక ప్రభువంశానికి దగ్గరవాళ్లం అని ప్రకటించుకోండి. అది చేతకాకపోతే పెట్టుబడిదార్ల పక్షాన నిలబడండి. ఎందుకంటే మన దేశంలో గెలుస్తున్నది వాళ్ళే,” అని ఆయన నౌకర్ని పిలవటానికి బెల్ కొట్టాడు.

# నేటిప్రపంచం

## 38 వ అక్షాంశ రేఖ

1894 లో, కొరియాను తన చేజిక్కించుకోవడానికి జపాను చైనాతో యుద్ధం చేసింది. తాను ముందుగా కొరియాను స్వాధీనం చేసుకోకపోతే రష్యా చక్రవర్తి ట్రాన్స్ సైబీరియన్ రైల్వే నిర్మాణం పూర్తిచేసి, దూరప్రాచ్యంలో తిష్ఠవేస్తాడని జపానుకు భయం. 1896 లో జపాను రష్యాకు ఒక సూచన చేస్తే, కొరియా యావత్తూ తనకే లభిస్తుందనే ఆశతో రష్యా ఒప్పుకోలేదు. జపాను చేసిన సూచన ఏమంటే కొరియాను 38 వ అక్షాంశరేఖవద్ద విభజించి ఒకభాగం రష్యాకిందా, రెండవభాగం జపానుకిందా ఉంచాలని.

1904 లో రష్యా జపానుల మధ్యయుద్ధం జరిగింది 38 అక్షాంశ రేఖను జపాను వారెంతవరకు మన్నిస్తారో చూద్దామని రష్యాచక్రవర్తి రెండవ నికొలస్, జపాను నౌకాబలాలు కొరియా పశ్చిమతీరం వెంట 38 వ అక్షాంశరేఖను దాటి ముందుకువస్తే యుద్ధం చెయ్యమని తన దూరప్రాచ్య సేనానికి ఉత్తరు విచ్చాడు. జపాను నౌకాబలాలు 38 వ అక్షాంశరేఖను దాటివచ్చి పోర్ట్ ఆర్థర్ మీద ఫిరంగుల దాడిచేశాయి. ఆయుద్ధంలో రష్యాఓడిపోయింది. కొరియా యావత్తూ జపానుకిందికి వచ్చింది. 1910 లో జపాను కొరియాను కబళించి వేసింది.

తిరిగి 1945 ఆగస్టులో ఈ 38 వ అక్షాంశ రేఖకు పునర్జన్మ కలిగింది.

గత చరిత్రమాట ఏమైనా, ప్రస్తుతం కొరియా చరిత్రలో ఈ 38 వ అక్షాంశరేఖ అతి ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నది. ఈ రేఖకు దక్షిణంగా ఉండే ప్రాంతాన్ని అమెరికా సైనికబలాలూ, ఉత్తరంగాఉండే ప్రాంతాన్ని రష్యా బలాలూ ఆక్రమించిన నాడే కొరియా ఐక్యతకు పురుగు ముట్టింది. అక్షాంశరేఖకు రెండువైపులా రెండురకాల ప్రభుత్వాలూ, రెండురకాల ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాలూ, రెండురకాల సాంఘిక వ్యవస్థలూ నెలకొన్నాయి.

అయితే కొరియావిభజన కూడదని అన్నిపక్షాలవారూ ఒప్పుకున్నారు కొరియా ఐక్యతే మా ఆశయమని అమెరికా, రష్యా కూడా అన్నాయి. కాని ఆ ఆశయానికి 38 వ అక్షాంశరేఖ గొడ్డలిపెట్టుగా ఉండిపోయింది.

## ఐక్యతా ప్రదర్శనాలు

38 వ అక్షాంశరేఖ మీద యుద్ధం సురసురమంటూనే ఉన్నది. చిట్టచివరకు జూను 25 వ ఉత్తర కొరియాబలాలు 38 వ అక్షాంశరేఖను తుడిచిపెట్టి కొరియా ఐక్యతా ప్రదర్శనం ప్రారంభించాయి ఈ ఐక్యతా ప్రదర్శనాన్ని నిరోధించి 38 వ అక్షాంశరేఖయొక్క సార్థకతను సంరక్షించే శక్తి దక్షిణ కొరియా బలాలకు లేదని గ్రహించి అమెరికా తన బలాలతోనూ, భద్రతామండలి సర్టిఫికెటుతోనూ అట్టహాసంగా బయలుదేరి రంగంలోకి దూకి మరొక ఐక్యతా ప్రదర్శనం ఆరంభించింది కొరియా ఐక్యతే ఆశయంగాగల నెహ్రూ ప్రభుత్వంకూడా 38 వ అక్షాంశరేఖయొక్క ప్రాముఖ్యతను గుర్తించక తప్పిందికాదు అందుచేతనే అమెరికా, ఐక్యరాజ్యబలాలు ఉత్తరకొరియా బలాలను దక్షిణకొరియా నుంచి ఉత్తరంగా తరిమేటప్పుడు, ఐక్యరాజ్య బలాలు 38 వ అక్షాంశరేఖ దగ్గిర ఆగిపోవాలనీ, లేకపోతే చైనా తప్పక కొరియాలో ప్రవేశించి యుద్ధం చేస్తుందనీ నెహ్రూ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికి హితవు చెప్పింది. కాని ఈ హితవు ఐక్యరాజ్య సమితికి రుచించక, ఐక్యరాజ్య బలాలను అక్షాంశరేఖ దాటనివ్వమని జనరల్ డగ్లస్ మెకార్థర్‌కు అనుమతి ఇచ్చారు.

అమెరికన్ పత్రికలు చైనా గప్పాలు కొడుతున్నదన్నాయి చైనా పైత్యానికి కొంత నెహ్రూ పైత్యం జత అయిందన్నాయి. పైనుంచి కబుర్లుచెప్పే వారేమైనా చెప్పవచ్చు. ఈలోగా కొరియాలో ఘోరమైన యుద్ధం సాగుతున్నది. ఉభయపక్షాలజనం చస్తూనే ఉన్నారు చైనా సైనికులు - వాలంటీర్లని చైనా ప్రకటించింది - కొరియాలో యుద్ధం చేస్తున్నారు.

“కొరియాలో ఈ భాగం మేము జయించాం,” అని ఐక్యరాజ్యబలాలు చెప్పకునే ప్రాంతం ఉత్తరకొరియాలో కనబడదు. ఐక్యరాజ్యబలాలు ముందుకు పోయినా, వెనక్కు వద్దామన్నాకూడా గెరిల్లాలతోనూ, సైనిక బలాలతోనూ యుద్ధం చెయ్యవలసివస్తున్నది.

## “చైనా వైదొలగాలి”

కొరియా సమస్యతో సంబంధం ఉన్నవారేమిటి, లేనివారేమిటి అందరికీ కొరియా ఐక్యతలో నమ్మకం ఉండడం తోబాటు 38 వ అక్షాంశ రేఖలో కూడాఅపార విశ్వాసం ఉండటం వింతగా కనబడుతుంది. కొరియా ఐక్యత అన్నది



జనరల్ మెకార్థర్

ఉత్తర దక్షిణ కొరియాల మధ్య బలాబలాల ప్రదర్శనంతో నిర్ణయం కావడం సబబుకాదనీ, అమెరికా వగైరా దేశాల సైనిక బలప్రయోగంవల్లనే తేలాలని ఐక్యరాజ్యసమితి విశ్వసించడం మరొక వింతగా కనబడుతుంది. అమెరికను విమానాలు కొరియా ఐక్యతాసిద్ధికోసరం ఉత్తర కొరియాలోని పరిశ్రమలతోబాటు నగరాలనూ, గ్రామాలనూ, పారిపోతున్న స్త్రీలనూ, వృద్ధులనూ, పిల్లలనూ మారణహోమం చెయ్యడం మరొకవింతగా కనబడుతుంది

ఈ వింతలన్నిటికీ ఐక్యరాజ్యసమితిలో అమెరికా, బ్రిటను మొదలైనదేశాలు ఆరూ చేరి ఒక అనుబంధం తయారుచేశాయి. అదేమిటంటే చైనా బలాలు కొరియానుంచి తొలగాలనీ, లేకపోతే ప్రమాదపరిస్థితి ఏర్పడుతుందనీ. కాని పోర్మోజా

(43-వ పేజీ చూడండి)




శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

3

"నయమేనే, అమ్మాయ్! మంచి ఇల్లే సంపాదించావే మెటుకు?" అన్నాడు మామ, చెల్లెలి వెనకే ఆవరణలో ప్రవేశించి తలఎత్తి ఇంటికేసి చూస్తూ.

"ఏదో. ఫరవాలేదు కొత్త ఇల్లూ! లైట్లూ, కొళాయీ, మేం ఉండటానికి మంచి అటకా – కొయ్యదికాదు, సిమెంటుది – ఉన్నాయీ! చుట్టూ బోలెడంత ఆవరణా! పిల్లలు తిరగటానికీ, ఆడుకోవటానికీ మెట్లకింద చిన్న చీకటికొట్టూ! ఫరవాలేదు, అన్నది చెల్లెలు, తానున్న యింటిని తానే అట్టే పొగడుకోవటం భావ్యం కాదని.

"ఈ పట్నంలో కొన్ని ఇళ్లు చూశాను, చూడూ" – అని ప్రారంభించాడు మామ.

"ఇదేం, సులభంగా దొరికిందనుకున్నావా, అన్నయ్యా? పునాదులు తవ్విన రోజునుంచీ మా ఆయన రోజూ వచ్చి పని ఎంతవరకయిందీ చూసిపోలేక చచ్చాడనుకో. ఏం లేదు. తీరా ఏమరుపాటున ఉన్నామో, పుటుక్కున ఎవరోవచ్చి తిష్ఠ వేస్తారు. ఆ తరవాత ఏమనుకుని ఏం లాభం?... మరేం లేదులే – ఇంటాయన గురక పెడతాడు కాస్త. దా, ఇట్లా పోదాం. ఏమిటో చెబుతున్నా.. ఆఁ! ఇల్లు కట్టగానే ప్రవేశించామయ్యా, అంతటితో ఏమయిందీ? ఇల్లుకట్టిన ముండాకొడకు ఇంటోకి వచ్చెయ్యగూడదూ? రాలా! పోనీ ఇంకొకరికి ఇవ్వలా. ఇల్లు అద్దెకడిగిన వాళ్ళని, రెండువేలిస్తావా? రెండేండ్ల అద్దె అడ్వాన్సు ఇస్తావా? నల్లసొమ్మెంత ఇస్తావు? ఎంతకు రసీదిస్తావు? అని బేరాలు మొదలెట్టాడు. ఎన్నాళ్లకీ ఇంట్లోకెవరూ వచ్చారు కారు. పిల్లలూ మేమూ అల్లాడిపోయా మనుకో!"

"అదేమే?" అన్నాడు మామ, ఆశ్చర్యంతో.

"అట్లా అంటా వేమి టన్నయ్యా? మేం ఏం తిని బతికేట్టూ? ఇంకో ఇంటికి పోదామా అంటే ప్రతి కొంపలోనూ తొక్కిడే నయివాయె. అప్పటికే కొంతకాలం ఒక ఇరుకు కొంపలో ఉన్నాం. మాతోపాటుందులో ఇంకా పన్నెండు కాపురాలు. ఎవరికీ పొట్టనిండా తిండిలేదు. మాలో మేం పోట్లాడుకునేవాళ్ళం. మా పిల్లలేదన్నా తెచ్చుకుంటే ఇతరపిల్లలు ఎగబడటమూ, కొట్లాటలూ, శాపనార్థాలూనూ. చివరకు మాగుట్టు దాగిందికాదు. ఇంటివాళ్లు మా అలుసు కనిపెట్టి చుక్కలపిల్లినొకదాన్ని తెచ్చారు. అది కాస్తా నా మనవణ్ణి –" అంటూ చెల్లెలు కంట నీరు పెట్టుకుంది.

"ఊరుకో పిచ్చిదానా! నీ మచ్చలపిల్లి నిమిత్తమాత్రం. అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. నా ఆశ్చర్యమేమంటే ఈ మహాపట్నంలో మనవాళ్లు పరువు మర్యాదలతో పనిచేసుకుని ఎందుకు బతకలేరూ అని! ఇంతకుముందు మనవాళ్ళని కొందర్ని చూసి మాట్లాడాగదా, వాళ్లు దొంగతనం చేసి పొట్టపోసుకుంటారుట. ఇదేం ప్రారబ్ధం?" అన్నాడు మామ.

"నువ్వా పాత వేదాంతం చెప్పకన్నయ్యా. ఎవరు దొంగతనం చెయ్యంది? అంతా దొంగతనమే. ఇంటాయన ఇంటో అద్దెకున్నవాళ్ళను దోస్తాడు. అద్దెకున్న

వాళ్లు దుకాణం పెట్టి ఊళ్ళోవాళ్ళను దోస్తున్నారు. ఇక్కడ ఎవరిబతుకు వారు బతకటాని కున్న దనుకున్నావా ఏం? దొంగ తనానికే శ్రమపడాలి," అన్నది చెల్లెలు.

"అటువంటప్పుడీ పట్నవాసం చెయ్యక పోతే ఏమీ అని," అన్నాడు మామ - చాతయితే దానికి సమాధానం చెప్ప మన్నట్టుగా.

"అట్లా అనకులే, అన్నయ్యా. ఇక్కడున్న ఆనందం ఇక్కడుంది. ఇక్కడి జీవితం అర్థం చేసుకుంటే ఇందులోనూ తెలివితేటలూ, మెళుకువలూ లేకపోలేదు. ఇప్పుడీ ఇంట్లో మే ముంటున్నామంటే మాకు ఒక వానబాధ ఉందా, వరదబాధ ఉందా? పొలాలు దున్నటం, నీళ్లు పెట్టటం, ఈ అడావుడి అయిపొయ్యేదాకా మనం అక్కడా అక్కడా తలదాచు కోవటం - ఈ బాధ లేవీ లేవు. ఏడాది పొడుగూతా ఉన్నచోటినుంచి కదలక్కర్లేదు."

"అటువంటి జీవితం ఏం జీవితమూ అంటా! ఇవాళ్ళలేనే రేపూ అయితే అందులో విశేష మేమిటే? ఒకదాని వెనక ఒకటి చక్రంలాగా తిరిగివస్తుంటే ఆనందం గాని."

"ఇక్కడమాత్రం జీవితంలో మార్పు లేదనుకున్నావా? ఉంది. రోజుకో కొత్త వింత జరుగుతుంది. అదేమిటో ముందుగా మనకు తెలీదు, అంతా పావకాశంగా వింటే నీకే తెలుస్తుంది."

"అక్కడే నాకు పేచీ!" అన్నాడు మామ. "ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలీని బతు కేం బతుకూ? జన్మంతా నిద్దూరాలే అయితే ఎట్లాగూ అంటా!" ఆయన ఏవిధంగానూ పట్నవాసం ఒప్పుకోదలచ లేదని చెల్లెలు అర్థం చేసుకున్నది. స్వానుభవంవల్ల పట్నవాసంలోఉన్న గమ్మత్తు ఆయనకే తెలుస్తుంది గదా అనుకున్నది.

ఇద్దరూ ఒకరివెనక ఒకరు వంటఇంటి తూముద్వారా లోపల ప్రవేశించారు. మామ ఇంటిగోడను గోళ్లతోనూ, మునిపళ్లతోనూ పరీక్షించి, "అమ్మోమ్మ్, మా లావు గట్టిగా కట్టారే?" అన్నాడు.

"నే చెప్పలా? సిమెంటుతో కట్టారు. నల్లబజారులో సంపాదించిన డబ్బుతో నల్లబజారులో కొన్న సిమెంటుతో కట్టిన ఇల్లు," అన్నది చెల్లెలు.

"ఈ నల్లబజా రేమిటో తెలవటంలేదే?" అన్నాడు మామ.

"అది మీ బావ నడుగు. నాకాటె బాగా తెలీదు," అన్నది చెల్లెలు.

వంటింట్లో పొయిమీద నీళ్లు కాగుతున్నాయి. ఎవరూ లేరు. మామ అటూ ఇటూ తిరిగి బుట్టలో పెట్టిన కూరలు మూచూసి, "ఈ కూరలు ఎవరు తింటారబ్బా?" అన్నాడు.

"ఏం?" అన్నది చెల్లెలు.

"చెట్టునుంచి కోసి శొన్నాళ్ళయినట్టుం టేనూ?" అన్నాడు మామ.

"సరేలే. ఇక్కడ అప్పుడెప్పుడు కోసిన కూరలుకూడానా?" అన్నది చెల్లెలు.

"మీ జన్మ చెడా, ఈ కూరలా మీరు తింటున్నారు?" అంటూ మామ ఇంకో మూలకు పరిగెత్తి ఒక గిన్నెమీదపెట్టి ఉన్న మూత పడగొట్టాడు. లోపలికి తొంగిచూశాడు.

"ఇదేమిటే చూట్టానికి నెయ్యల్లే ఉంది, ఏ వాసనా లేదూ!" అన్నాడు మామ.

"అది వనస్పతిగామాలు. ఇప్పుడదే అందరూ తినే నెయ్యి."

"ఛా!" అన్నాడు మామ. ఆయన వెనక్కు తిరిగిచూసేటప్పటికి అక్కడ చెల్లెలు లేదు. ఇంతలో ఎటు పోయిందా అని చూస్తుండగానే ఎవరో వంటింటిలోకి వచ్చి కెవ్వున అరిచారు.

"ఒసే, లక్ష్మీ! ఎలికే! చంపవే! దీనొన్ముగుబడా! భయంలేకుండా ఎట్లా చూస్తోందో! నేతిగిన్నెమీద మూత పడేసింది! నీ పొగరు చితకా! లక్ష్మీ, లక్ష్మీ! దబ్బున రావే!"

మామకీ గావుకేక లేమీ అర్థంకాలేదు. ఆయన ప్రశాంతంగా తప్పేలాల వెనక్కు వెళ్లి అక్కడ దాక్కునిఉన్న తన చెల్లెల్ని కలుసుకున్నాడు.

"ఏమిటే గడబిడ? ఎందుకు పారిపోయినావు?" అన్నాడు మామ.

"ఇంకా నయం! అడుగుల చప్పుడు వినపళ్ళా? అక్కడే గుడ్లు మిటకరించుకు నిలబడతావేం?...పద, ఆ మనిషి వెళ్ళిపోయింది. ఇప్పుడప్పుడే మనం కదలటానికి లేదు, ఆ జాడీలచాటున దాక్కుందాం రా!"

ఇద్దరూ అలమారులోకి ఎగబాకి జాడీల చాటున దాక్కున్నారు. మామ ఇంకా ఆ నెయ్యిగురించే ఆశ్చర్యపడుతున్నాడు. పొలాలమీద అన్నాలు కట్టుకొచ్చేవాళ్లు తినగా మిగిలిన బాపతు అన్ని రకాల తినుబండారాలూ మామ రుచిచూసిఉన్నాడు. కమ్మని పేర్నెయ్యి, వెన్న, దంపుడు బియ్యం అన్నమూ, కూరలూ, పచ్చళ్లూ మామ ఎరుగును. చెట్టునకాచే వంగలూ, మిరపలూ, దోసలూ, గుమ్మళ్లూ, ఏ దశలో ఎటువంటి సువాసన కొడతాయో మామకు తెలుసు.

"ఇవేం కూరలూ! ఇదేం నెయ్యి!" అనుకున్నాడు మామ.

కేకలు పెట్టిన మనిషి తిరిగి వచ్చింది.

"అదుగో ఆ తప్పాలాలచాటున దాక్కుంది, చూడవే, లక్ష్మీ!" అన్నదా గొంతే.

"ఇక్కడ ఏం లేదమ్మగారూ. పైన ఆ జాడీలవెనక ఏమన్నా చేరిందేమో."

మామ తన చెల్లెలికేసి చూశాడు. ఆయన కళ్ళల్లో చెల్లెలి కేదో మందహాసం కనిపించింది. జాడీలు కదిలిస్తారేమో అని గుండె పిచపిచలాడే చెల్లెలికి అన్న ఆనందం అర్థం కాలేదు. కాని మామ తన చెల్లెలంత ప్రాణభీతి కలవాడు కాకపోవటంవల్ల లక్ష్మి తెలివితేటలు మెచ్చుకోగలిగాడు.

"చావనీ!...తరవాత నే చూస్తాలే. నువ్వువెళ్లి దబ్బున గ్లాసులు తోముకు రా. కాఫీ లందించాలి," అన్నది కేకలుపెట్టిన మనిషి. పనిమనిషి జాడీలు ముట్టుకోవటం ఆవిడ కిష్టంలేదు, తాను స్వయంగా నల్లగుర్లమామను ఎదుర్కోవటం అంతకన్నా ఇష్టంలేదు.

"ఆ వాసన ఏమిటబ్బా?" అన్నాడు మామ, జాడీల వెనకనుంచి మూతి ముందుకు పెట్టి, మీసాలు కదిలిస్తూ.

"అది కాఫీలే! నువ్వివతలికి రా. మేమూ పిల్లలూ రోజూ అంతో ఇంతో కాఫీ రుచి చూస్తూనేఉంటాం" చిన్నవెధవ కాఫీ పొడే కొట్టేస్తాడు, అన్నది చెల్లెలు.

"మా లావు ఘాటుగా ఉంది. జబ్బు చెయ్యదుగద?" అన్నాడు మామ.

మరి కాస్సేపటికి ఇంటావిడ వంటింట్లో నుంచి అవతలికి వెళ్లిపోయింది.

జాడీల వెనకనుంచి అన్నా చెల్లెళ్లు బయటికి వచ్చారు. కిందపడ్డ కాఫీ చెల్లెలు కొస్త తాగింది. మామకూడా కొంచెం రుచి చూశాడు, "ఎబ్బె!" అన్నాడు.

చెల్లెలు కిందపడ్డ కాఫీపొడుం చేత్తోతీసి మొహాన రుద్దుకుంది. ఇద్దరూకలిసి అటక మీదికి బయల్దేరారు.

## ౮

"ఓరీ, నువ్వట్రా, బైతుబావా! రా, రా! ఎప్పుడొచ్చావ్? ఏమిటి కథా? అంతా కులాసా? అనుఖ్య కురిసినవానలకు మీరంతా ఏమైనారో అని చాలా అనుకున్నాం," అన్నాడు పట్నం బావ.

"వానలసంగతి మీకూ తెలిసిందీ?" అన్నాడు మామ.

"ఆఁ మా యింటికి పత్రి కొస్తుందిగా! ఇంటివా రబ్బాయి చదివి తల్లికి చెబుతుంటే విన్నాం," అన్నాడు బావ.

పట్నంలో ఉండే సౌకర్యాలు కొన్ని లేకపోలేదని మామకు తట్టింది.

"అదీకాక, ఇంట్లో రేడియో ఉందాయె, చిట్టి విని చెప్పింది."

పిల్లలంతా ఒక మూలచేరి కొత్త బంధువును వింతగా చూస్తున్నారు.

ఒకపిల్ల మూతి చిట్లించి, "పట్టివాసన," అన్నది. మిగిలిన పిల్లలంతా ఒక్కసారి నవ్వి మళ్ళీ అంతలో మూ నేశారు.

"ఎందుకర్రా అట్లా చూస్తారూ? మీ పైతుమామయ్య.. అడుగోరా, ఆ ఆరుగురూ మా మనమలూ, మనమరాళ్ళూనూ. మిగిలినవాళ్లంతా మా పిల్లలు. ఈ ముగ్గురూ మా అల్లుళ్ళు, నాళ్లిద్దరూ కోడళ్ళూనూ. కోడళ్లిద్దరూ కొద్దిరోజులకిందే వచ్చారు. ఇంకా పిల్లా పీచూ లేదు. ఇట్లా ఉన్నాం," అన్నాడు బావ.


మెల్లి మెల్లిగా పిల్లలకు కొత్త తీరింది. వాళ్లు అటూ ఇటూ పరిగెత్తసాగారు. ఇద్దరు పిల్లలు మూల నున్న ఉల్లిపాయముక్క మీదికి పరిగెత్తుతూ ఒకరి నొకరు తోసుకున్నారు. ఒక పిల్లవాడుమాత్రం తల్లిదగ్గరికి వచ్చి మూతి నున్న కాఫీపొడరు నాకసాగాడు.

"ఉండరా గర్భ్రతుడా! మామయ్యతో కాస్సేపు మాట్లాడనీ... చూసిన్నయ్యా, పిల్లలందరూ వట్టి అల్లరివాళ్లు. వాళ్లీ బస్తీలో బాగా మెదిగి అతి తెలివితేటలు సంపాయించారు. మా చిట్టి ఉందా? అది ప్రతిరోజూ సినిమాకు పోతుంది. తెల్లారక ముందే పిల్లలంతా కాఫీహోటలుకు తయారు గదా! ఏ అపాయం వస్తుందోనన్న భయంగాని భక్తిగాని కొంచెమైనా లేదు. ఆ మాటని వాళ్లపొట్ట వాళ్లు పోసుకుంటాగా అంటే అదీ లేదు. రోజూ ఉల్లిపాయలు నే తెచ్చిపెట్టాలి. ఇంట్లోవాళ్లేదన్నా చేసుకుంటే మిట్టమధ్యాన్న మయేది, పట్టపగలయేది నే వెళ్లితెచ్చిందాకా చిందులేస్తారు. నానా అగచాట్లూ అనుకో, అన్నయ్యా!" అన్నది చెల్లెలు.

మామ కిదంతా ఏమీ బాగాలేదు. అందుచేత ఏమీ అనలేదు. తన అధికారంలో పిల్లలయేది పెద్దలయేది అందరూ చచ్చినట్టు కష్టపడి ఎవరితిండి వారు వెతుక్కోవలసిందే. సోమరితనమూ, లేనివి కావాలని మారాం చెయ్యటమూ ఆయన ఎంతమాత్రం సహించడు.

ఇంతలో ఎక్కడినుంచో టంగ్, టంగ్మని గంటలు వినపడ్డాయి. మామ ఈ మోతను ఆశ్చర్యంగా ఆలకించసాగాడు.

కాఫీపొడి ఇష్టమైనవాడు ఎగతాళిగా, "అదుగో, మామయ్యా దడుచుకున్నాడు! పల్లెటూరిమొహం! పైతుమామయ్య! బద్దుమామయ్య! గడియారం గంటలు



కాడితే, బైతుమామ భయపడ్డాడూ !" అని పాటగా పాడసాగాడు.

మామ వాడికేసి చాలా కోపంగా చూశాడు. కాని వాడు లక్ష్యపెట్టక, "నిజం చెప్పు, మామయ్యా ! నువ్వు భయపడ్డావా లేదా ? నీకు రాసాలు బందయినయ్యా లేదా?" అన్నాడు.

"అవునురా ! గుండె ఆగిపోయిందంటే నమ్ము!" అన్నాడు మామ వెటకారంగా.

"అట్లా ఒప్పుకో !" అన్నాడు బాలుడు గర్వంగా.

వాడట్లా మాటాడటంకంటె కూడా, వాణ్ణి తల్లీ తండ్రీ మందలించకపోవటం మామకు చాలా ఆశ్చర్యంగా కనిపించింది. పైపెచ్చు పట్నంబావ, కొడుకు ప్రజ్ఞకు మెచ్చుకుంటూ, విరగబడి నవ్వాడు, కళ్ల నీళ్లు కారేదాకా.

మామ సామాన్యుడు కాడు. రెండుసార్లు నాగుపాము నోట పడ్డంతపని అయి తప్పించుకున్నవాడు. ఒక్క పాముచే కాదు, ఏ ప్రమాదమైనా సరే అంతదూరాన ఉండగానే పసికట్టగల ప్రజ్ఞా, ఎంత ప్రమాదంలో కూడా తొణకకుండా కర్తవ్యం ఆలోచించే నిబ్బరమూ మామకుండబట్టే మామ తనవాళ్ళకు నాయకుడుగా వ్యవహరించగలుగుతున్నాడు. ఈ పట్నంలో ఎవరి చూరులోనో చేరి తన రక్త బంధువులే ఇంత వెకిలి వాళ్లయిపోవటం మామకు చాలా కష్టం వేసింది.

పట్నంబావ నవ్వు సంబాళించుకుని, "ఒసే, చిట్టీ! పిల్లి అరుపు మామయ్యకు వినిపించు... అచ్చుగా పిల్లి అనుకోవలిసిందేరా !" అన్నాడు.

మామ నిర్ఘాంతపోయినాడు. ఎలుకపుట్టక పుట్టి పిల్లిని అనుకరించటమేమిటో మామకు అర్థం కాలేదు. ఈ పట్నంబావ తన పిల్లలకు ఈపాటైనా జీవితపు విలువలు లేకుండా ఎట్లా చెయ్యగలిగాడో మామ ఊహించలేకపోయినాడు.

ఈలోగా చిట్టి, "మావ్, మావ్," మని అరవటం మొదలుపెట్టింది. మామకు వాంతి అయినంతపని అయింది. ఆయన మీసాలూ రోమాలూ నిక్కబొడుచుకున్నాయి. కళ్లు ఎర్రబడ్డాయి. ఇందులో మరో అభాసేమంటే చిట్టి అనుకరణ ఏమాత్రమూ సరిగా లేదు. పరమమూఢులు తప్ప అది పిల్లి అరుపనుకోలేరు. తన చెల్లెలి కుటుంబానికంతకీ పూర్తిగా మతులు పోయి ఉండాలి.

తన మేనగోడలు— సాక్షాత్తూ తన చెల్లెలు కడుపున పుట్టిన బిడ్డ— తనజాతికి గర్భశత్రువైన పిల్లిని అనుకరించడం చూసి మామకు కలిగిన ఆగ్రహానికి సాదృశ్యం ఒక్కటే ఉంది— ప్రహ్లాదుడు "హరి" అంటే హిరణ్యకశిపుడికి కలిగిన ఆగ్రహం.

"ఆపు ! చాలించు!" అని అరిచాడు మామ. మిగిలినవాళ్లు, చిట్టితోసహా, నివ్వెరపోయినారు. బాలుడుమాత్రం కేరింతాలు కొడుతూ, "మామ భయపడ్డాడే ! బైతుమామ భయపడ్డాడే! బైతుమామ భలే బాగా భయపడ్డాడే!" అని పాడుతూ నృత్యం చెయ్యసాగాడు.

"నువ్వు నోరుముయ్యరా, ఫుంఢాఖోర్," అన్నాడు మామ ఓర్పంతా నశించి.

"ఏం, బావా ? ఏమిటట్లా కంగారు పడ్డావు?" అన్నాడు పట్నంబావ.

"ఇంకా అడుగుతున్నావుట్రా? ఆ ముండకేం తెలుసు ? వీరు దేనికి హర్షిస్తే ఆపనిచేస్తుంది. పెద్దవాళ్లు, మీకెందుకు బుద్ధిలేదు? అనుకరించాలంటే పిల్లులా ? ఆ పాటి ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఉండక్కర్లా ? ఎబ్బే!" అన్నాడు మామ.

ఆ పైన చర్చ జరిగింది. పట్నంబావ అనుకరణ ఒక కళ అన్నాడు. కళకు ప్రతిబంధకాలూ, కళలో సంకుచితత్వమూ ఉండకూడదన్నాడు. జీవితపువిలువలు దానిపైన ఆరోపించరాదన్నాడు. కళ కోరకే కళ అనికూడా అన్నాడు. బైతుమామకు కళ అనే మాటే తెలీదు. పట్నంబావ చెప్పేదంతా నోరు తెరిచి విని, "అట్లా అయితే ఇటువంటి కళలు చాలా తుచ్ఛమైనవి. వాటిని ఖండించాలి," అన్నాడు.

ఈ వాదనలో బాలుడూ, వాడి తమ్ముడూ, చిట్టీకూడా ప్రవేశించారు.

"ఈ పట్నంలో మీ పాలాల పద్ధతులు సాగవు. ఇక్కడ పిల్లులు మాకు శత్రువులు కావు. పిల్లులు వొలకపోసిన వస్తువులు మాకు అందుతూ ఉంటాయి. వాటిని మేం శత్రువులుగా పరిగణించం," అన్నాడు బాలుడు.

వెంటనే వాడి తమ్ముడు అందుకు "పిల్లంటే మాకు భయమనుకున్నావా ఏం. నేనొక పిల్లిని బెదరగొట్టా. నన్ను చూసి ఆ తెల్లపిల్లి దడుచుకు పారిపోయింది. అమ్మ నడుగు కావలిస్తే," అన్నాడు.

ఈ వింతసంఘటనగురించి అందరూ ఒక్కసారి గోలగా మామకు చెప్పారు. ఇది నిజంగా జరిగిన సంఘటనే అని మామ గ్రహించి, బస్తీలో అటువంటి పిల్లులు కూడా ఉంటాయి కాబోలనుకున్నాడు.

కాని ఆయనకు తన చెల్లెలు చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. "నీ మనవడు సంగతి పిల్ల లెరగరా?" అన్నాడాయన చెల్లెలితో.


"ఎందుకు పిల్లల్ని భయపెట్టటమని చెప్పలేదు. ధైర్యసాహసాలు లేకపోతే పిల్లలు చెడతారని మీ బావ అంటాడు."

"మీ ధైర్యసాహసాలు మండా!" అన్నాడు మామ.

పెద్దవాళ్లు తమలో మాట్లాడుకుంటున్న సందడిలో పిల్లలందరూ చేరి పిల్లి ఆటలు ఆడుతూ, పిల్లి అరుపులు అరుస్తూ, పిల్లి మొగ్గలు వేస్తున్నారు. మామ ఇదంతా ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు.

(ఇంకా వుంది)

## శ్రవ్య నాటిక:




**శ్రీ జి. రామచంద్రరావు**

[కథ. పదహారో శతాబ్దపు చివరి భాగంలో విజయనగర సామ్రాజ్యంలోని కంభం చెరువు గండిపడినప్పుడు పెదకంబన్న, చిన కంబన్న అనే గొల్లకుర్రాళ్లు అన్నదమ్ములు– గండిలోకిదూకి గండిని పూడ్చటానికి తోడ్పడ్డారు. ఆ చెరువును మొదట వరదరాజమ్మ అనే రాయవంశీకురాలు తవ్వించటంవల్ల వరదరాజమ్మ సముద్రం అని పిలవబడేది. కంబన్న సోదరులు గండిని కాచినప్పటినుంచీ కంభం చెరువని పిలవబడుతున్నది.

(ఉశ్ ఉశ్ అని కేకలు, గొర్రెల మేకల అరుపులు. గాలి ఈడ్చికొడుతున్న శబ్దం. పల్లెపొలిమేరలో పెదకంబడు, చినకంబడు)

చినకంబడు: అరే పెద్దోడా. అమాస ఎప్పుర్రా?

పెదకంబడు: సుక్కురారం నాడని అన్నాడ్రా పంచాగం శాస్తుర్లు, యేం?

చిన: ఆఁ... అమాస ఎల్లిన మూడో నాడు అమ్మోర్లగుడికాడ కోటంరాజు కద చెబుతారంట, ఆ శేత్తిరికయినా రెండు మాపల్ని కూడబెట్టి సుగ్గులాయన కియ్యాల.

పెద: అన్నట్టు మరిసిపోయినా. అమాసనాటికి గండాలయ్య గుడిదీపానికి మంతెడు గొర్లనెయ్యి తీసుకుపోవాల,ఎట్టాకుదురుద్దో?

చిన: ఎట్టా కుదురుద్దో అంటే యెట్టా? ఎట్టాగో కుదర్సుకోవాల గాని గండాలయ్య దీపారాదన ఆగుద్దా?

పెద: నిజమేరా. ఆ సల్లని తండ్రి ఉండబట్టే గడిసిపోతుంది.

చిన: మరి కాకుంటే? మా తాతల్ల కిందటి గాలివానకు మనూరు నిలిసిందంటే ఆయన గారి సలవే.

పెద: ఆ గాలివానేంది? దాని అయ్యలాంటివరదలు ఈ శ్రావణమాసంలో వస్తయ్యంట. ఈ గాది నాడు పంచాంగం శాస్తుర్లు సెప్పాడు.

చిన: అంటే అమాస ఎళ్లగానే నన్నమాట. అదే గనక నిజమయితే నా సామి రంగా పంచాంగ శాస్తుర్లుకు బొజ్జనిండా పెరుగు పోయిస్తా.

పెద: అదే నిజమయితే నువ్ యాడుంటావో, నీ గొర్లు యేడుంటయ్యో, యామవుద్దో, యవరికి తెలుసుద్దిరా పిచ్చోడా.

చిన: యామవుద్దీ, యామైనా మనకు బయ్యంలేదు. ప్రాప్తం ఉంటే గొర్లూ ఉంటయ్, అన్నీ ఉంటయ్. లేకపోతే యేమీ ఉండదు.

పెద: అంతేలే, ప్రాప్తాన్ని బట్టే అన్నీ. మనం ఒకడికి బయపడేది లేదు. ఒకరిజోలి మన కక్కర్లా. కంబయ్యా, కొంచం సాయపడవయ్యా అని అడిగితే ఊనక్కొట్టేసేది లేదు. ఈ యిదంగా మన గటాలు గడిస్తే సాలు.

(ఉరుముల చప్పుడు)

చిన: అదిగో పెద్దోడా. ఉరుముతుంది. శాస్తుర్లపని పాటం అయేట్టే ఉంది.

పెద: అ... ఇయన్నీ తేలిపొయ్యే మబ్బుల్లే.

(మళ్ళీ ఇంకా పెద్దగా ఉరుములు)

చిన: తేలిపొయ్యేవి కాదులే. ఇంక మనం లెగుద్దాం. శానాదూరం పోవాల.

(గొంగళ్లు విదిలించి, కర్రలు నేలకు కొట్టిన చప్పుళ్లు. గొర్రెల మేకల అరుపులు.)

పెద: గొర్లన్నీ ఉన్నయ్యా?

చిన: ఉన్నట్టే ఉంది... అరే, అరే. పెద్దోడా, మొన్నయీనిన బోడిమేక కనబడదే? యెటుబోయిందో.

(చినుకులు పడుతున్న మోత)

పెద: అర్రే. వానకూడా మొదలయిందే. సిన్నోడా, నువ్వు మన బయిరవుణ్ణి

తీసుకొని బోడిమేకను వెతకలాడుకురా. పాపం చిన్నపిల్లకూడా ఉంది.

చిన : మరి నువ్వు?

పెద : నేను ఊరిమొదట్లో గుండాలయ్య గుడికాడ ఉంటా.

చిన : భైరవుడూ, దా. దా. ఉజ్జా...

(కుక్క ఒళ్లు విదిలించిన, మనిషి వెళ్లిపోతున్న చప్పుడు-వాన కురుస్తున్న శబ్దం, కొంతకాలం గడచిన సూచన.)

పెద : అబ్బబ్బ, యేం వాన, గుడికాడికి వచ్చేతలికే ముద్దముద్దయినాం, ఇంక నుట్ట ముట్టించాలిసిందే. చలికి నిలబడలేం.

(ఫెళా ఫెళా పిడుగు)

పెద : ఓయ్, ఇదుగో, యవరా పొయ్యే మడిసి?

కొత్తమనిషి : సింగారం నుంచి వొస్తున్నా.

పెద : యేం వాన్లో బయలెల్లావ్?

కొ : వానేంది వరదకూడా వచ్చింది.

పెద : యాడ?

కొ : తీగలేరు, తమ్మిలేరు, యొద్దువాగు, ఒక్కటేంటి? నల్లమల యేళ్లన్నిటికి వరదొచ్చింది.

పెద : ఆఁ.!

కొ : సింగారం పెబువుమల్లారెడ్డిగారి బవంతులకు తీగలేటి దెబ్బ తగిలేట్టుంది. కట్ట యేపించేందుకు మడుసులకోసం వచ్చా.

పెద : ఆయనమడుసులు యేమయినారు?

కొత్త : ఓరి పిచ్చోడా. ఆళ్లందర్నీ తీసుకుని రెడ్డిగారు రాయలోరితో కలిసి, నిజాం సామీదికి పొయ్యారుగా.

పెద : సరే అయితే నువ్వు సరాసరి అమ్మోరిమండపంకాడికి పో, అక్కడే కరణమయ్యా, మునసబయ్యా పుల్జూదం ఆడుతూ ఉంటారు.

కొత్త : నువ్వో?

పెద : మా సిన్నోడు మేకను యెతకలాడ బొయ్యాడు. ఆడు రావాల.

(కొత్తమనిషి వెడతాడు)

పెద : యేందో! యుద్ధాలు, సావులు, వానలు, వరదలు, ఈటికి అంతు లేనట్టుంది. ఇంకా సిన్నోడు రాలేదే?...

(స్వల్ప కాలవ్యవధి... కుక్క మొరిగిన చప్పుడు.)

పెద : అరె, అరే. భైరవు డొక్కడే వొస్తున్నాడు. చిన్నోడే మైనాడో... దా. దా. భైరవుడూ, చిన్నోడెక్కడ?

(కుక్క చిన్నగా మొరుగుతుంది.)

నన్ను రమ్మన్నాడా? వస్తుండా పద. పంచోడులు.

(మనిషి వెళ్లిన శబ్దం, కాసేపటికి ఊరినుంచి జనం వస్తున్న చప్పుడు)

కొత్త : యేడీ ఈ గొల్లాయన? యాడకు పొయ్యాడో?

రెండోవాడు : యాడకు పోతాడు? యేదో గొర్రె తప్పిపొయ్యుంటే యెతకపొయ్యుంటాడు.

కొ : యేమో. వాళ్లమ్మంట, అక్కడ ఒక ముసలామె యేడుస్తుంది.

రెం : ఆల్లిప్పుడే యింటికి పోరు. పదండి, పదండి, మనం పోదాం.

(జనం వెళ్ళిపోయినారు. వాన జోరుగా కురుస్తున్నది.)

ముసలిగొంతు : అరేయ్. పెద్దోడా, అరేయ్ చిన్నోడా, యాడున్నార్రా, ఆరేయ్ అబ్బాయిలూ... గండాలయ్యగుడికాడ గొర్లున్నయ్ కాని ఆళ్లేరీ...? చెరువు కట్టకేసిపోతే.

(కాలవ్యవధి. రంగం చెరువుకట్ట పక్కకు మారుతుంది.)

పెద : ఏందిరా సిన్నోడా గువ్వ కట్టమీ గుంటావ్.

చిన : కట్ట గండిపడేట్టుందిరా?

పెద : ఆఁ... గండా! యాడా?

చిన : యిదిగో, యిక్కడే, బోడిమేక కోసం యెతకలాడుతూ వచ్చేతలికి యీడ ఒక పగులు కూపించింది. దాంతో గుండె ఛేజారై భైరవుణ్ణి నీకాడికి తరిమా. దొరికిన రాళ్లు రప్పలు యేసి పగులు ఇప్పటికి పూడ్సినా. కాని యీ రేత్రి గడవాల్సిందే.

పెద : ఆ, ఈ రేత్రి గడవాల్సిందే... అయితే మరి ఊళ్లో యెవరూ లేరేమో? పిట్ట పురుగ్గూడా లేకుండా మల్లారెడ్డి బంటు తోలకపొయ్యుంటాడు.

చిన : యేంజేస్తాం? ఇయ్యాల మనిద్దరమే గండి కాయాల, గండాలయ్య దయ.

పెద : అయితే... చిన్నోడా, ఆడ అమ్మ మనకోసం గోల పెట్టుద్దేమో?

చిన : ఇప్పుడు మనం పొయ్యామంటే మూప్పయి ఊళ్లు తుడిసి పెట్టుకు పోతయ్. మూడు వేల జనం కొట్టుకుపోద్ది. లచ్చల మంది అమ్మలు గోలపెడతారు.

ముసలి : పెద్దోడా... చిన్నోడా...

పెద : అదిగో అమ్మ యీడకే వచ్చింది.

అమ్మా, అమ్మా, యీడ, యీడ వుండాం.

తల్లి : యేంరా. యింతవానలో చెరువు గట్టుమీ దుండారు? అక్కడ గుడికాడ గోర్లని వదిలి ఈడ ఆడుతుండారా?

పెద: లేదమ్మా. ఇయ్యాల వరదరాజమ్మ సముద్రం రాంభణాసురుడి సముద్రంలాగా నిండిపోయింది. కట్ట గండిపడుద్దేమో అని యిక్కడే కాసున్నాం.

తల్లి : అమ్మో, గండే! అయితే ఇక్కడెందుకురా మీరు? పారిపోదాం పదండి.

చిన : పారిపోతే ఊరంతా కొట్టుకుపోద్దమ్మా.

తల్లి : మీ రిక్కడేం జేత్తారు?

చిన: గండి పడితే అడ్డేస్తాం.

తల్లి . మీ యిద్దరివల్లా యేమవుద్దిరా?

చిన : అయినంతవరకే.

తల్లి : (ఏడుపు గొంతుతో) అదేందిరా, అట్టాఅంటావ్?

పెద: లేదులేగానీ అమ్మా ఊళ్లో యెవ్వరైనా ఉన్నారా?

తల్లి : ఉహూం, మల్లారెడ్డిబంటు తోల కెళ్లారు.

పెద: అయితే నువ్వు గండాలయ్య గుడికాడ కూచ్చుని యెవరైనా వొస్తే పంపించు. అల్లంతా వొస్తే యింక బయపడక్కర్లా.

తల్లి : సరే నే బోతున్నా గాని మీరు జాగర్తర్రోయ్. (తల్లి వెళ్ళిపోతుంది.)

చిన : చెరువు జూర్రా, యెంత నిండుగా ఉందో, సూస్తుంటే గుండె గుబగుబలాడుతుంది.

పెద : యెంత తెలివిగా కట్టించిందిరా ఈ చెరువును, వరదరాజమ్మతల్లి. దీన్ని నింపండే గుండ్లకమ్మ బయటికి పోదుకదా.

చిన : యెన్ని లచ్చలమంది ఆ తల్లి పేరు చెప్పుకుని దీపం పెట్టుకుంటుండారో? కాని మళ్లీ గుండ్లకమ్మ పొంగిందంటే, అసలే సముద్రంలాగా ఉన్న ఈ చెరువు కట్టలు తెంపేసిందే.

పెద : ఔను. గుండ్లకమ్మ నిలవనిచ్చేట్టు లేదు. నల్లమల కొండవాగులన్నీ పొంగి పార్లుతున్నయ్యని సింగారం బంటు చెప్పాడు. ఇక గుళ్లకమ్మేనా తక్కువ? ఒకూపు ఊపుద్దిలే. (జనం కలకలం. కంబన్నా అని కేకలు.)

చిన : ఆఁ. యీడ. కట్టదగ్గర.

మొదటి : వరదరాజమ్మ సముద్రమే గండి పడ్డదంటే ?

చిన : ఆఁ, యీడే. చిన్నగండి ఇందాక కనిపిస్తే యేదో పూడ్చినాం గాని యీరేత్రి గడవాల.

మొదటి : గుండ్లకమ్మ దయ. ఈ రేత్రంతా మనం కాపలా గాయాల్సిందే.

పెద: ఏమయ్యోవ్. కొందరు ఊళ్లోకి పోయి, బాజాలు, బందులు, పారలు, పలుగులు, గోతాలు, తాళ్లు అన్నీ యెత్తక రాండి. (కొందరు జనం, పదండిరా, అని అరుచుకుంటూ వెడతారు.)

మొదటి : అల్లొచ్చిందాకా మనం యేం జేత్తాం ? కాసేపు గుళ్లకమ్మతల్లి బజన చేసుకుందాం.

(మొదటివాడు మొదటి పాదం చెపుతూ ఉంటే జనం ఓ గుళ్ళకమ్మా అని వంత పాడుతారు)

అమ్మ, మాయమ్మా ఓ గుండ్లకమ్మా
మమ్మ గాయమ్మా ఓ గుండ్లకమ్మా
నీవె దిక్కమ్మా ,,
పిల్లాల జెల్లాల ,,
ముసిలోళ్ల ముతకోళ్ల ,,
దయసూపవమ్మా ,, ||అమ్మ||
నోరులేని జీవాల ,,
దిక్కులేని జనాల ,,
కాపాడవమ్మా ,,
నీరుపోసి బువ్వ పెట్టి ,,
సాకావు తల్లాలె ,,
సంపాకు యముడల్లె ,,

(కొంతసేపు భజన సాగుతుంది. ఇంతలో ఫెళఫెళ మని పిడుగుచప్పుడు. భజన చప్పున ఆగిపోతుంది. వాన జోరున కురిసి కొంచెం తెరిపి ఇచ్చింది)

చిన : పెద్దోడా, వాన కొంచం తెరిపి ఇచ్చింది. కట్టెక్కి చూద్దాం పదండి.

మొ : ఓరి నాయనో, యెన్ని నీళ్లు. యెన్ని నీళ్లు! కట్ట తెగి ఇది ఊళ్ళమీద బడితే పెళయమే.

పెద: అప్పుడీ జనాన్ని రచ్చించాలంటే నారాయణమూర్తి మచ్చావతారం ఎత్తాల్సిందే.

మొద. ఆ నారాయణమూర్తి యేం జేస్తాడో?

పాట

శ్రీహరీ నారాయ...ణాదినా...

చిన : అరే, ఆగాగు. యేందో మోత వినబడుతుంది; కొండశిలవ భుసకొట్టినట్టు. (నీటి ప్రవాహపు హోరు వినబడుతుంది)

జనం అంతా : హోరి. గుండ్లకమ్మ రానే వచ్చింది. (హోరు క్రమంగా హెచ్చి, నెమ్మదిగా తగ్గిపోతుంది)

మొదటి: ఇంక కట్టబలం సూడాల. నీల్లు కోత్తయ్యేమో జాగర్తగా సూడండి.

చిన: సామాన్లకోసం పోయినోళ్లు ఇంకా రాలేదే?

పెద : ఈపాటికి వస్తుంటారు.

చిన : అరే పెద్దోడా. నీ కాళ్లకిందుగా సూడు నీళ్లూరుతున్నయ్.

తల్లి : అరేయ్ నాయినా. ఇవతలికి దూకరా. గడ్డ ఊగిపోతూంది.

పెద : అమ్మబాబో, (ఇవతలకు దూకినట్లూ జనం గల్లంతు చేస్తున్నట్లూ శబ్దం.)

మొదటి : అరేయ్ కన్నం పడ్డదిరా. (నీళ్లు కారుతున్న శబ్దం.)

౨వ గొంతు : రాళ్లతో బిగ్గొట్టండి.

౩వ గొంతు : రాళ్లెత్తక రండ్రా.

పెద : రాళ్లేం నిలవటంలేదే.

చిన : పెద్దవి పెట్టండ్రా.

రెండో : అరేయ్ సామాన్లకోసం యెల్లినోళ్లని కూత పెట్టండ్రా. డొంక మలుపు తిరుగుతుండారు.

మూడో : ఓయ్ మనసబయ్యోవ్. లగెత్తండి. లగెత్తండి. ముంచకొస్తుంది.

జనం : (దూరాన్నుంచి) ఆఁ. ఆఁ. వస్తుండాం. (నీళ్లధార పెద్దదయిన చప్పుడు)

చిన : కన్నం పెద్దదయిపోతోంది. గోతాల్లో మట్టిపోసి అడ్డుపెట్టండి. (దభేలుమని చప్పుడు.)

రెండో : అయ్యో. అంత యిరిగి పడ్డది.

పెద : అరేయ్ వాసాలక్కడ దింపెయ్యండి. (పారల పలుగుల చప్పుడు) ఆటిముందు గోతాలు రాళ్లు పేర్చండి.

మొ : ఇదిగో ఆ పెద్ద రాళ్ళను దొర్లించుకురండ్రా, (రాళ్లు దొర్లుతున్న శబ్దం.)

తల్లి : పెద్దోడా. అడ్డం లేరా.

పెద : ఆఁ. అక్కడే అక్కడే. రాయిని తొయ్యండ్రా.

జన : హో. హో. రాయి జారిపోయింది. (రాయి జరజరా దొర్లి నీళ్ళలో పడ్డ శబ్దం. నీళ్ళమోత ఇంకా పెరుగుతుంది)

చిన : పెద్దోడా, వాసాల పాదుల్ని నీళ్లు కోసేస్తుండయ్. వాసాలు ఊగిపోతుండయ్.

మొదటి : అట్టాగే వాటిని పట్టి ఉంచండ్రా.

(23-వ పేజీ చూడండి)

# పరిణామం

నానా బాధా పడి ఉదయం పదిగంటలకు తనే స్వయంగా వండుకొని తిన్న అన్నం— తిన్నాడన్న మాటే గానీ ఏమీ సహించకపోవడంచేత ఎంగిలి పడ్డ చేతినిమాత్రం కడుక్కున్నాడు. అంతే!... మధ్యాహ్నం కాఫీ కూడా త్రాగలేదు. మరి అలా ఆఫీసులో ఆకలితో కూర్చోడం కష్టమనిపించింది రామానికి.

ఫైల్సు అన్నీ అరలలో సర్దేసి ఆఫీసరు నడిగి శెలవు తీసుకొని బయలుదేరే డింటికి. సమంగా గంటస్తంభందగ్గర కొచ్చేసరికి నాలుగు గంటలయింది. ప్రక్కనే ఉన్న కాఫీ హోటలులోంచి 'గమ్' అని దోశ వాసన వేసింది. తనకు సహజంగా కలిగిన ఆకలికి మరింత దోహదం అయిం దాదోశ వాసన. జేబు తడిమి చూచుకున్నాడు. రెండణాలు చేతికి తగిలేయి.... రెండణాలూ ఇచ్చి దోశ తినేస్తే, మరి కాఫీకి డబ్బులో?—పోనీ కాఫీ ఎలానూ ఇంటిదగ్గర త్రాగుతాడుగనక, ఆ బేడ ఇచ్చి దోశ తినేస్తేనో!... అన్నట్టుగ ఇంటిదగ్గర తన అర్ధాంగి అరుణ, కాఫీ పెడుతుందన్న ఏమిటి నిశ్చయం? ఉదయం అన్నమే వండనిది కాఫీ ఎందుకు పెడుతుంది? అదీకాక ఆమె ఇవాళ ఉదయం నుంచీ నిరసనవ్రతం చేయసంకల్పించుకున్నట్లుంది! ఆఖరికి తనొండి తినమని చెప్పినా మౌనం వహించింది. నులకమంచం మధ్యని మఠం వేసి కూర్చొం దో తపస్వినిలా!... ఇక అలాంటి పరిస్థితిలో ఉన్న తన భార్య, తను ఇంటికి వెళ్ళేసరికి కాఫీ ఇచ్చి గౌరవిస్తుందని ఏమిటా నమ్మకం?—ఏమయినా దానికి పతిభక్తి రవ్వంతయినా లేదనుకున్నాడు. సావిత్రి, అనసూయ, పార్వతి మొదలయిన సినీమాలన్నీ చూపెట్టేడు. పతిభక్తి వాళ్లను చూచయినా అలవరచుకుంటుందేమోనని!... ఊహూ... అబ్బే! అవేవీ తలకెక్కినట్లు లేవు—

ఇంతకీ ఆరోజున ఆమెకు వచ్చిన కోపం ఏమిటి? దొడ్లో అంట్లుతోమే కాపదాన్ని మానిపించేయమంటుంది భార్య అరుణ!... దాన్ని మానిపించేయడానికి రామం ఒప్పుకోలేదు!—పైకి చాలా చిన్నదిగా కనిపించినా, వాళ్లిద్దర మధ్యా కల్లోలాన్ని లేవదియ్యడమే కాకుండా మంచి విచిత్రమయిన మరో పరిణామాన్ని కూడా కలుగజేసింది.

అరుణ, అలా కాపదాన్ని మానిపించేయమనడంలో కొంత సబబువుంది. లేకపోతే ఇంట్లో జీతానికి పనిచేసే కాపదాని కంత గర్వమేం?.... ఏరోజూ సమంగా అంట్లు తోమడానికి వచ్చేదే కాదు. ఒకవేళ వచ్చినా మసయినా వదిలకుండా ఏదో వెట్టికి తోమిచ్చేసేది. జీతం తీసుకుంటూ అలా ప్రవర్తిస్తే ఎవరొప్పుకుంటారు? "ఇదేమిటే ఇలా తోముతున్నావు, ఏదో వెట్టిచాకిరీ చేస్తున్నట్లు—ఇలా అయితే నిన్ను మానిపించేస్తాను తెలుసా!" అంది అరుణ మరి సహించలేక.

మానిపించేస్తానన్న మాట అరుణ నోటంట వచ్చిందో, లేదో, ఇంకేం!

**************************

## శ్రీ ఆకుండి నారాయణమూర్తి

**************************

'గంయ్' మంటూ గొంతుక విప్పేసింది కాపది. "ఏటి మానిపించేస్తావమ్మ— మానిపించేయడానికి నువ్వెవురివమ్మ! 'పైడం'టే ఏటో తెలీనిదనుకుంటున్నావేటి? నువ్వు మానిపించేసినప్పుడు మానుకుంటాను... నా తమాసా తెలుద్ది!" అందతి గర్వంతో పైడి.

అంతలా తనని ఏకవచనప్రయోగం చేసంటుందని అనుకోలేదరుణ. ఒక కాపదానిముందు తన మాట నెగ్గకపోడమనేది చాలా హేయమని భావించుకుంది. దాన్ని తప్పకుండా మానిపించేస్తేనే తను గెల్చినట్లు! అదీకాక అంత పోత్రం గల కాపదాన్ని ఇంట్లో ఉంచడం కూడా మంచిది కాదనుకొని, మానిపించేయాలని సంకల్పించుకుంది—"నీపోత్రం కట్టిస్తానుండు. బాబు రానీ." అంది అరుణ.

"బాబొచ్చి ఏటి చేస్తాడు? నువ్వన్న పాటే అననేడులే!" అంది పైడి ఇంకొంచెం గర్వంతో.

అరుణ నివ్వెరపోయింది దాని ధైర్యాన్ని చూచి. దానితో పోరుపెట్టుకుంటే అట్టే లాభం లేదనుకుంది. వట్టి కల్లుముచ్చుముండని అనుకుంది.

భర్త ఆఫీసునుంచి వచ్చేక జరిగిన సంగతంతా చెప్పింది. దాన్ని తక్షణం మానిపించేయాలని చెప్పింది.

—"ఏదో, లోకజ్ఞానంలేని కాపముండ అలా అందని అంత పట్టింపెందుకు?... దాన్నిప్పుడు మానిపించేస్తే, నువ్వే ఇక అంట్లు తోముకోవలసి వస్తుంది తెలుసా! ఇంతకన్నా మంచి కాపవాళ్లు మరెవ్వరూ ఈ ఊళ్లో దొరకరు," అన్నాడు రామం.

భర్త అలా తనమాటకు వ్యతిరేకంగా అంటాడని అనుకోలేదు అరుణ. ఆమెకెంతో కోపంవచ్చింది. "మరెవ్వరూ అంట్లు తోమక్కర్లేదు. నేనే తోముకుంటాను!... రేపణ్ణుంచీ అది ఈ గుమ్మం త్రొక్కడానికి వీల్లేదు," అంది అరుణ.

"నీఇష్టం ఏమిటి మధ్యని?—నా ఇష్టం! నేను దానికి జీతం ఇచ్చేవాడిని. దాన్ని మానిపించను," అన్నాడు రామం. అలా అనేసినతరువాత, తను చాలా తెలివితక్కువ తనంగా మాట్లాడినట్లు గ్రహించాడు. మాట నోటిని దాటిన తరువాత విచారించి ఏంలాభం?...

అరుణముఖం అరుణవర్ణాన్ని దాల్చింది. —"ఔను! అంతా మీ ఇష్టమే! మీ ఇష్టప్రకారమే, అది నన్ను ఎదిరించిందని కూడా తెలుసుకున్నాను. ఇక కొన్ని రోజులలో అది నన్నీ ఇంట్లోంచి తగిలేసి అదే నా స్థానాన్ని ఆక్రమించుకుంటుందని కూడా ఇప్పుడే తెలుసుకున్నాను. ఈ విషయం ఇన్నాళ్లయి తెలుసుకోలేకపోయాను. ఇంతకీ ఇదంతా నా...." అని, కళ్లంట నీరుకారుస్తూ గదిలోకి వెళిపోయింది. అప్పటినుంచీ మొదలుపెట్టింది నిరశనవ్రతం. కాపదాన్ని మానిపించేస్తేనే గానీ తను ఏపనీ చెయ్యకపోడమే కాకుండా, అన్నం తిననని కూడా పంతం పట్టింది.

ఏం?... అలా లేని పోని అపోహలు స్వయంగా కలుగజేసుకొని, భార్యఆగ్రహానికి, అనుమానానికి పాత్రుడు అయే కన్నా చక్కా దాన్ని మానిపించ

కూడదూ? అంత పాత్రంగల కోపదాన్ని మానిపించేస్తే వచ్చిన నష్టమేమిటి?—...

దాన్ని మానిపించేయడము రామానికీ ఇష్టమే!...కానీ, ఆ...ఒక్క లోసుగూ ఉండబట్టే దాన్ని మానిపించడానికి దడ దడం!—యౌవనమదంలో కామానికి లోబడి, ఆ వీధిలోనే ఉన్న కామయ్య కూతురు లక్ష్మి, తనూ ఒకప్పుడు కామ పాశంతో బంధింపబడిన రోజు లుండేవి. ఒకరోజున లక్ష్మి తన కౌగిట్లో ఉన్నప్పుడు పైడి చూచింది!... ఆ విషయం లోకానికి తెలుబడి చేయవద్దని పైడిని బ్రతిమాలు కున్నాడు. దానికి కొంత డబ్బు కూడా ఇచ్చేడు. లక్ష్మిని పెళ్లిచేసుకుందామనే మొదట అనుకున్నాడుగానీ, కులవిష యమై సంఘానికి దడిసి ఆమెను వివాహం చేసుకోలేదు. తరువాత తనకీ వివాహ మయింది, లక్ష్మికికూడా వివాహం జరిగింది. ఆ యిద్దరూ హిందీసినీమాలు అట్టే చూడ లేదు కాబోలు! తమ ప్రేమ విఫలమయి నందుకు ప్రాణత్యాగం ఏ ఒక్కరూ చెయ్యలేదు. తను తనభార్య అరుణతో హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు; లక్ష్మి ఆమె భర్తతో హాయిగా కలక్షేపం చేస్తు న్నాది పూర్వవిషయాలను మరచి. తను ఒకవేళ పైడిని మానిపించినట్లయితే అనేక విచిత్రమయిన పరిణామాలు కలుగుతాయి! ప్రశాంతంగా ఉన్న లక్ష్మి కాపురంలో తుపాను చెలరేగుతుంది—అరుణకి తనమీద ప్రేమ సన్నగిల్లడమేకాకుండా, ఇంట్లో అశాంతపరిస్థితి ఏర్పడుతుంది. కానీ... పైడిని మానిపించకపోతే ఒక చిక్కు! మానిపిస్తే ఓ చిక్కు!! ఎలా మరి?...అవాళ సుదయంనుంచీ అరుణ ఏపనీ చెయ్యడం మానేసింది. పైగా అన్నం తనొండి తిన మని చెప్పినా తినలేదు—

—ఇక అలాంటి సంతంలో ఉన్నది మధ్యాహ్నం తను ఇంటికెళ్ళేసరికి కాఫీ ఎలానూ పెట్టదు!... అంచేత ఆ కాఫీ హోటల్లోకి దూరి, గొంతుకలో ఆ కాస్తా కాఫీనీళ్లు పోసుకొని బయట పడ్డాడు.

ఆ సమస్య నెలా సాల్వు చెయ్యడమనే ఆలోచనలో పడ్డాడు. ఆలోచిద్దామనే అభిప్రాయంతో ఉన్నాడేకానీ, తీరా ఇంటిగుమ్మంలో కాలుపెట్టినప్పటికీ, ఏమీ ఆలోచించలేకపోయేడు.

నట్టింటిలో నులకమంచంమీద తల విరగ బోసుకొని బోర్లా పడుకొన్ని ఉంది తన అర్ధాంగి!...ఏ పురాణకథ చదవడం వల్లనో ఎలా అలగాలో నేర్చుకుందను కున్నాడు. నయం!... గాజు పెంకులతో బుక్కరుకోలేదు. ఏమయినా అలకలో కొంత 'మాడిఫికేషను' వచ్చిం దనుకు న్నాడు ఓ అనుమానం కూడా కలిగింది. తను ఆఫీసుకు వెళ్ళిపోయినతరువాత వండుంచిన అన్నం తినేసి తిననట్టుగ నటి స్తున్నాదేమో!... అందుకే అనుమానం తీరేనిమిత్తం వంటింటిలోకి వెళ్ళి చూచేడు. ఆమెకోసం అట్టే ఉంచిన అన్నం అలానే ఉంది. అన్నం తినకుండా ఆకలితో ఎలా ఉండగలిగిందో అని చాలా జాలిపడ్డాడు. ఆ కోపముండ మాటాత్తుగా చచ్చిపోయినా బాగుండు ననుకున్నాడు. కానీ, అదంత తేగిరంగా చస్తుందీ?...అంతా అగమ్య గోచరమయిందతనికి!...

—"ఏమిటూ వెధవఅలకా నువ్వూను? ...ఆ అన్నం అలా పాడయిపోతున్నాది. తినేయి!... ఈ కరువుగోజుల్లో అన్నం ఇలా తగలెట్టేస్తే ఎలా? బుద్ధిలేకపోతే సరి!" అన్నాడు రామం. అంత కఠినంగా అనడం రామానికి అసలిష్టంలేదు. ఆమెను బ్రతిమాలుకోవాలనే ఉద్దేశం మనస్సులో ఉంది. కానీ అలా బ్రతిమాలుతే ఆమెదగ్గర తను ఓడిపోయినట్లే అవుతుందని, అలా అన్నాడు!

నిజానికి అరుణకి ఆకలేస్తున్నాది. అన్నంతినాలనీ ఉంది. ఆ క్షణంలో భర్త తన్ని బ్రతిమాలుకున్నట్లయితే, ఓ మరతు మీద అన్నం తినేసేఉండేది. కానీ భర్త తనని బ్రతిమాలందే తినేస్తే తను ఓడిపోయి నట్లేగా మరి! మనస్సులో ఎంతో వుడు క్కుందామె. ఆఖరికి తెగించి అంది.— "ఆ పైడే తినేస్తుంది. ఇక అదే వండేస్తుంది. ఏమయినా మీరు దానిపక్షంగా," అంది వెక్కుతూ.

"పారబడుతున్నావు." అని రామం గబగబా మళ్లీ పీధులోకి వెళిపోయేడు. అనవ సరంగా అనేక అపోహాలు బయలుదేర తున్నందుకు ఎంతో బాధపడ్డాడు. ఏం చెయ్యడం?... పైడిని బ్రతిమాలుకొని, దానినెలా అయినా ఒప్పించి మానిపించేయ డమే ఉత్తమం. తిన్నగా దానింటి కెళ్ళేడు.



"పైడీ, ఈవిషయమై నిన్ను అడుక్కోవలసివచ్చింది. నెల నెలకీ నీకిస్తూఉన్న జీతం ఇచ్చేస్తూఉంటాను. నువ్వుమాత్రం మా ఇంటికి రావడం మానీయాలి. మా ఆవిడ పోరు భరించలేకుండాఉన్నాను." అని, అన్నాడు రామం.

"ఏటంటారు ?... మీ రిచ్చే డబ్బు నాకు నచ్చమనుకున్నా రేటి ? నా మాట నెగ్గాల!... ఆ యమ్మ నన్నెలా మానిపించేస్తుందో చూత్తానుగా!" అంది పైడి.

"నిన్ను బ్రతిమాలుకుంటాను పైడీ!... మానీవూ ? ప్రస్తుతం నీకు ఏభైరూపాయలు కూడా ఇచ్చుకుంటాను." అన్నాడు మళ్లీ.

"మీడబ్బు ఎవురికొ్కావాలని ఎన్నిసార్లు చెప్పేను ? నామాట నెగ్గాల !" అంది మొండిగా.

పైడిమీద ఎంతో కోపం వచ్చింది రామానికి- "అంత మొండితన మేమిటి ? తల్చుకుంటే నిన్ను నిలువునా కాల్పించేస్తాను తెలుసా !" అన్నాడు రామం కోపం ఆపుకోలేక.

"ఆ ! ఏటి చేస్తావు ?... నిన్నే కాల్పించేస్తాను. నీసంగ తెవురికి తెలీదనుకున్నావు ?......మహా నీతిమంతుడిలా మాట్లాడుతున్నావు !......" అంటూ తనకున్న గొంతుకనంతా వినియోగించి పూర్వ విషయాలన్నీ గోల చెయ్యడం మొదలుపెట్టింది. దాని గొంతుక విని నలుగురూ చుట్టూ మూగేరు. రామానికి లక్ష్మికీ గల సంబంధాన్ని అంతా ఏకరువు పెట్టేసింది. అందరూ ముక్కులమీద వ్రేళ్ళేసుకున్నారు. రామం అక్కడ ఇంకా నిలబడలేకపోయేడు. తలవంచుకొని అక్కడినుంచి వెళ్లిపోయేడు. అలా సముద్రపొడ్డున చాలా దూరం వెళిపోయేడు. మనుష్యులెవరూ అగుపించనిదగ్గరకు పోయి కూర్చున్నాడు. లక్ష్మిభర్త కూడా అక్కడికి వచ్చేస్తే !... వట్టి మూర్ఖుడు, అనుమానపు మనిషి !! ఇక లక్ష్మి బ్రతుకేం కావాలి ?... తన భార్య అరుణకు కూడా ఈ విషయమై తెలుస్తుంది. తనమీద నమ్మకం ఆమెకు పోతుంది. పైగా తనని చూచి అసహ్యించుకుంటుంది కూడా ! తను మళ్లీ ఏముఖంపెట్టుకొని ఊళ్లోకి వెళ్లగలడు ? ఊళ్లోవారు తనని వ్రేలెట్టి మాపుతారే ?... అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అలా ఎంతసేపుకూర్చున్నాడో అతనికి తెలియలేదు.

పొరిగింటి కామయ్యగారూ, ఇంకొందరూ వచ్చి "ఇక్కడిలా కూర్చున్నావేం ?... నీకోసం ఊరంతా గాలించేస్తున్నాము ?... పోలీసులకు కూడా తెలుబడి చేసేము ! ఔనుగానీ, ఆ కోపముండ నోటి కొచ్చినట్లు కూసిందని ఇంతలా విచారించాలా ? దాని మాటలు మేం నమ్మేస్తామనుకున్నావేమిటి ?!......పద ఇంటికి." అంటూ కామయ్యగారు పీపుతట్టి లేపేవరకూ వాస్తవిక జగత్తులోకి రాలేకపోయేడు రామం. అడుగులు బరువుగా వేస్తూ క్రుంగిపోయిన హృదయంతో వాళ్లతో వెళ్ళేడింటికి.

ఆందోళనతో గుమ్మంలో కాచుకు కూర్చొనుంది అరుణ. భర్తని చూడడంతోనే ఆమెముఖంలో ఆందోళన మాయమయింది......"ఔనుగానీ ఇంత రాత్రి వరకూ ఎక్కడికి వెళిపోయేరు. ఆ వెధవముండ ఎలాంటిదో చూచేరా ? మిమ్మల్నే నానామాటలూ అంది. లేనిపోనివన్నీ కల్పించింది. ఏమయినా రాక్షసిముండది. అదలా అబద్ధకల్పనలు చేసి, లక్ష్మితో మీకు సంబంధం ఉందంటే నమ్మేస్తాననుకుంది కాబోలు !... ఇంతకీ అదలా మిమ్మల్ని అందని ఇంటికే రావడం మానీసేరేం ?... ఇంతవరకూ ఎంత భయపడ్డానో తెలుసా ? అమ్మయ్య ఇప్పటికి నా మనస్సు స్థిమితపడింది." అంది అరుణతొందర తొందరగా మాటల్ని సగంమింగేస్తూ.

రామం మరేమీ మాట్లాడలేదు. తిన్నగా ఇంట్లోకి వెళ్లిపోయేడు.

రామం భోజనం చేస్తున్నప్పుడు అంది అరుణ—"మిమ్మల్ని అనవసరంగా అపార్థం చేసుకున్నాను, కాపదానితో మీకు సంబంధం ఉన్నాదని...క్షమించరూ ?" అంది అరుణ దీనంగా.

"ఒక్కొక్కప్పుడు, ఇలాంటి చిన్న విషయాలలో అనేక అపార్థాలు వస్తూ ఉంటాయి !... దానికేంలే !" అన్నాడు రామం చెయ్యి కడుక్కుంటూ !

ఆ రాత్రి రామానికి సరిగ్గా నిద్రపట్టలేదు. ఎన్నో పాడుకలలొచ్చేయి. లక్ష్మి భర్త ఆమెను కొరడాతో కొడుతున్నట్లు, 'రంకులాడీ, నీభరతం పడతానుండు' అన్నట్లు పీక పిసుకుతున్నట్లు, అన్నంపెట్టకుండా నానా బాధలూ పెడుతున్నట్లు. ఆఖరికి ఆ బాధలు పడలేక లక్ష్మి నూతులో పడి చనిపోయినట్లూ,—ఈరకంగా పాడుకల ఓటివచ్చింది. ఎంతో భయపడ్డాడా రాత్రి రామం.

కన్నకల నిజమయేరోజు వచ్చింది. లక్ష్మి శవాన్ని ఆసిస్పత్రికి తీసుకపోయేరు. కన్నీరు కార్చడం తప్ప వేరేమీ చేయలేకపోయేడు రామం.

ఎప్పుడో మాటుగా జరిగిన విషయం, బయటకు వచ్చి అలాంటి విచిత్రపరిణామాన్ని తీసుకొస్తుందని అనుకోలేదు రామం.

# ప్రణయ తపస్విని



## శ్రీ యర్రమిల్లి చలపతిరావు (శ్రీవత్సవ)

"నీ రాకకోసమని నే, నిశ లెన్నో, నిలచిచూచీ, వెన్నెలరాత్రులన్నీ, కన్నీటగడపుచుంటి." "ఎక్కడనుంచో అవ్యక్త మధురగానసుధాతరంగాలు ? సన్నని వాయుతరంగాల్లో కలసి శ్రవణానందకరంగా, మనోహరంగా, హృదయాన్నీ, మెదడునూకూడా కదిలించి పరవశం చేసినయ్ - ఒక్కసారి కొద్దిగా తెలివి వచ్చి మగత నిద్దట్లో, మళ్లీ పడిపోయా నిద్దట్లో. ఎంతో బద్ధకంగా నిస్సత్తువగా ఉంది. ఆలోచిస్తున్నా, చిన్న కునుకులో...మళ్ళీ అదేపాట. కమ్మగా, తియ్యగా - ఏవో మధుర స్మృతులు రేపుతూ, ఏదో లోకంలోకి తీసుకుపోయింది—కలతనిద్దట్లో అకస్మాత్తుగా తెలివివచ్చి కళ్లు నులుపుకుంటూ లేచా. కిటికీ ఊచల సందుల్లోంచి తెల్లటి వెన్నెల కిరణాలు సూటిగా మంచంమీద పడుతున్నాయి. టేబుల్ మీది హరికేన్ లాంతరు కొద్దిగా తగ్గించివుంది. అంతా నిశ్శబ్దం— ప్రకృతియావత్తూ నిద్రాదేవత ఒడిలో గాఢ సుషుప్తిలో మునిగివుంది— విపరీతమయిన దాహం - మంచం క్రింది మర చెంబులో నీళ్లు గ్లాసెడు త్రాగి, మళ్లీ మంచంమీద మేను వాల్చాను. శరీరం ఏదో లోకంలోకి తేలిపోతోంది.

మళ్లీ కళ్లు మూతలు పడుతున్నాయ్ - శరీరం నా స్వాధీనంలో లేదు. మళ్ళీ ఒళ్లు తెలియని మైకంలో మగత క్రమ్మింది... మళ్లీ అదేపాట-? కలతనిద్దట్లో. ఏమిటా మధురగీతం? వేయి గంధర్వకిన్నెరలు ఒక్కసారి మీటినట్లు - ఘూవలగాన్నే మంత్రముగ్ధంగా చేసి జోకొడుతోన్న ఆ మధుర సంగీతరవళి ? మళ్లీ వాస్తవప్రపంచంలోకొచ్చాను. పడుకున్నవాణ్ణి లేచి మంచం మీద కూర్చున్నాను. ఒక్కసారి కళ్ళు నులుపుకొని, కిటికీలోంచి చూశాను. ...నాటి పుచ్చపువ్వులా, పిండి ఆరబోసినట్లు వెన్నెల. వెన్నెలవెలుగులో పెరట్లోని చెట్లన్నీ మిలమిల మెరిసిపోతున్నాయి. అప్పుడప్పుడు వీచే సన్నని వేసవిపిల్లగాలి రొదలో కొబ్బరాకులు శృతి మేళవించి సన్నని సంగీతం పాడుతుంటున్నాయి. అభ్రవీధిలో చకోరాలు అమితోత్సాహంతో ఎగిరిపోతున్నాయి, జంటజంటలుగా ఎక్కడికో ! విరియగాచే వెన్నెల వీధిలో, తళ తళ మెరిసే తారల ధగధగల్లో విశ్వసుందరి ఉత్సవం చేసుకుంటూంది. పెరట్లో గుత్తులు గుత్తులుగా విరగబూసిన నైట్ క్వీన్ పొద పిల్లగాలితాకిడికి వయ్యారంగా కదుల్తూ, తన సౌరభాన్ని విరజిమ్ముతోంది. ఒక్కసారి గట్టిగా ఊపిరి తీసుకుని మంచంమీదినుంచి లేచా - మెల్లిగా అడుగులు వేస్తూ గదితలుపు తీశాను... మెట్లు దిగి తోటలో నడుస్తున్నా. అంతా సుధామధుర శరద్రాత్రి - మళ్ళీ అదే పాట - హృదయం పరవశం అయేటట్లుగా - ఎక్కడనుంచి చెప్మా ఈ పాట వినవస్తూంట ? చుట్టు ప్రక్కల ఎవరైనా రేడియో పెట్టారా ? అనుకున్నాను. టైము చూస్తే, ఒంటిగంటన్నర! వాచీ ఆగిపోయిందా అని సందేహం కలిగి చెవిదగ్గర పెట్టుకుని చూశాను. టిక్కు టిక్కుమంటూనే వుంది. బయల్దేరా పాట వినవచ్చిన దిక్కుగా...నడుస్తున్నా.



చాలా దూరం నడిచాను. పాట మళ్లీ ఆగిపోయింది. కొంతసేపు నిలబడ్డాను, ఎటు వెళ్లడానికీ తోచక. మళ్లీ వినవస్తోంది పాట. మళ్లీ బయల్దేరాను...నడుస్తున్నాను. మార్గంలో ఒక చిన్న పిట్టగోడలాంటిది అడ్డంవచ్చింది. గోడ ఎక్కి అమాంతం అవతలికి దాటేశాను. సుందరనందనోద్యానంలాంటి గార్డెన్, అన్నీ పూల మొక్కలే. పుష్పసౌరభం మత్తెక్కింది... వడివడిగా నడుస్తున్నాను. ఈతోట ఎవరిది చెప్మా? ఇంతకు ముందెప్పుడూ చూడలేదే? క్రమంగా చాల దూరం నడిచాను. వాచీ చూస్తే మూడున్నర. టైమునిబట్టి అప్పుడే రెండున్నరగంటలకాలం నడచాననిపించింది. నడుస్తున్నకొద్దీ ఒత్తుగా ఎదిగిన చెట్లు, పొదలు, గుట్టలు, అంతా అదొకలోకం! క్రమంగా దట్టంగా ఎదిగిన మావిచెట్లు, పోకచెట్లు, పొగడచెట్లు — చిన్న సెలయేరు గలగలమంటూ ప్రవహిస్తోంది. దాన్ని అనుసరించే తూర్పుగా విశాలమైన సరస్సు...బృందావనం గాదు కదా? అనుకున్నాను...పాట వినిపిస్తోంది దగ్గరగా...సరోవరతీరాన్నే నడుస్తున్నా. తీరానికి ఇరుప్రక్కలా, దట్టంగా ఉన్న చెంగల్వబోదెలు...కొన్ని వేల చెంగల్వలు తెల్లగా విరిసి వెన్నెల్లో కమ్మని వాసనల్ని వెదజల్లుతున్నాయి...పాట చాలా దగ్గర్నుంచే వినపడుతోంది. సందేహం లేదు. ఇక్కడే ఎవరో పాడుతున్నారు అనుకున్నాను. వడివడిగా నడిచాను. ఎదురుగా తెల్లగా పాలమీగడలాంటి స్ఫటిక శిలామండపం! మండపానికి ఎదురుగా, ఒక శిలా వేదిక వెన్నెల్లో. ఆ వేదికమీద కూర్చొని ఉందొక స్త్రీమూర్తి. కొద్దిగా జేరబడి...ఆశ్చర్యానికి అంతులేదు. ఎవరీ స్త్రీమూర్తి ఇంత రాత్రప్పుడు? ఒంటరిగా ఈ అరణ్యంలో ఇలా కూర్చుంది? దగ్గరసా వెళ్లాను భయపడుతూ. సన్నని ఉల్లిపొరలాంటి వస్త్రం ధరించిన ఆ స్త్రీమూర్తి వెక్కి వెక్కి ఏడుస్తూంది. మధ్య, మధ్య, ఆ ఏడుపే సన్నగా పాటలా వినవస్తోంది. ఏమిటీ స్త్రీమూర్తి? ఎందుకిలా ఒంటరిగా ఏడుస్తోంది.—గుణసుందరి సినీమాలో యక్షకన్య కాదు. కదా? అలాంటిదే అయివుండొచ్చు, ఏమిటో, ఈమె దుఃఖానికి కారణం? తెలుసుకోవాలి. పాపం ఎవ్వడో ఈమెను మోసంచేసి ఉండాలి. ఈమె దుఃఖానికి కారణం ఏమిటో తెలుసుకుని తన్నివారణోపాయం ఆలోచించి, నా జర్నలిజం బుర్రతో, ఉత్తమమైన సలహా ఈమెకు ఇయ్యాలి. మాట్లాడిద్దాం అనుకున్నా. కాని ముచ్చెమటలు పోశాయి. గొంతుక కాస్త సవరించుకుని దగ్గరసా వెళ్ళి చిన్నగా దగ్గాను. ఆమె కొంచెం ఉలికిపడి వెనక్కి తిరిగి చూసింది. ఎంత అందమైన ముఖం? ఎక్కడో చూచినట్లు కూడా జ్ఞాపకం! రవికకూడా లేదు. అర్ధనగ్నంగా ఉన్న ఆమె పాలపొంగులాంటి శరీరపు యౌవ్వనంయొక్క ఒంపులు చూస్తూంటే మతి చలించి పిచ్చివాణ్ణయి పోయి అలానే చూస్తూ నిలబడ్డాను.

ఆమె చరాలున లేచి నిలబడి పయ్యెద కొంగు వక్షంమీదుగా లాక్కొని, ఎవర్రా నువ్వు? అంది కోపంగా, విచారంగా, ఏడుస్తూ...

నేనా? నేను...నేనే! అన్నాను...తడబడుతూ. తప్పకుండా ఈమె గుణసుందరిలోలాంటి యక్షిణే! అదేపాటం! అదే ఏడుపు? అదే డ్రెస్సు, కాని కనకం గాదు, ముఖం మరొకటి! ఎక్కడో చూచినట్లు జ్ఞాపకం...

ఆమె గట్టిగా యేడుస్తూ, ఉండుండి ఆగుతూ, అయ్యో! నేనేమిట్రా? నువ్వంటే, ఊరూ పేరూ లేదట్రా? ఇక్కడకూడా తగులడుతున్నార్రా. మీ మగాళ్లు? చెప్తావా? లేదా? ఎవరు నువ్వు, అంటూ దగ్గరసా వచ్చిందా స్త్రీమూర్తి...నా కాళ్లు గడగడలాడి పోయాయి. నేనా! నేను రచయితని, పత్రికలకి కథలూ అవీ రాస్తూంటాను. ఈవూరే. అదిగో! అటువైపుంది. రాత్రి అన్నంతిని అలా మంచంమీద నడుం వాల్చాను. హృదయాన్నీ, మెదడునూ కూడా కదిలించి పరవశంచేసే అమరగంధర్వగానం ఎక్కడనుంచో అలలు అలలుగా వచ్చి నన్ను మేల్కొలిపింది—లేచి పాట వినవచ్చిన దిక్కుగా బయల్దేరాను—నడచి నడచి ఇక్కడకు చేరుకున్నాను. నిజంగా మీ గానం, మరువలేని అమరానుభూతి! ఆహా! ఏమి తియ్యదనం? రాళ్లనుకూడా కరిగించగల జీవనది. మీ సంగీతశక్తి... అన్నాను...

ఆమె ఒక్కసారి హుంకరించింది... నేను పొగిడిన పొగడ్తలకి ఆమె ఉబ్బి తబ్బిబ్బయిపోతుంది అనుకున్నా. కాని ఆమె, అలా అవలేదే? రచయితవా? ఛీ,ఛీ, నీ మొఖం చూడకూడదు. రచయితలు! ఛీ, పయోముఖ విషకుంభాలు! తేనెపూసిన కత్తులు! వంచకులు, ద్రోహులు—ఈలోకంలోనయినా ప్రశాంతంగా బ్రతుకుదాం అనుకుంటే యిక్కడకూడా దాపరించార్రా రచయితలూ? అయ్యో, అంటూ ఆమె గట్టిగా ఏడ్వసాగింది. నాకేం అర్థం కాలేదు. రచయితలంటే యెందుకీమెకు ఈద్వేషం? ఏమో?

అహ! అది కాదు. రచయితలంటేనే మీకంత కోపం యెందుకు? రచయితలు స్తవనీయులు; విశాలదృష్టిగలవాళ్లు. సంఘానికీ, సమాజానికీ, రచయితలు ఎంతో సేవ చేస్తూ, మరమ్మత్ చేస్తూ, ఉత్తమ సమాజ నిర్మాణానికి పాటుపడుతూంటారు. రచయితలు పయోముఖవిషకుంభాలా? ఏం ఇలా మాట్లాడతారు. ఏదో కారణం ఉంది. చెప్పండి వింటాను. విని చేతనయిన సహాయం ఉంటే తప్పకుండా చేస్తాను, అన్నాను...ఆమె బాధగా ఒక్క వేడి నిట్టూర్పు విడిచి అలా కూర్చొంది... చెప్తాను...అంది...నేను కూర్చున్నాను. ఆమె క్షణం ఆలోచించి మొదలు పెట్టింది. రచయితలంటే నాకూ మొదటినుంచీ గొప్ప గౌరవభావం, ప్రేమా ఉండేవి. నా దృష్టిలో రచయితకంటె గొప్ప దేశకల్యాణకారు లెవ్వరూ లేరు ఒకానొకప్పుడు... కానీ, ఏ రచయితని నేను మనస్ఫూర్తిగా నమ్మానో, ఏరచయితను నేను దైవంకంటె కూడా యెక్కువగా, ఆరాధించానో, ఆ రచయితే హృదయంలేని రాక్షసుడనీ, సంకుచితదృష్టిగల స్వార్థపరుడనీ, ఆ రచయితే, పయోముఖవిషకుంభం అనీ, అనుభవంమూలంగా తెలుసుకొన్నాను. అన్నీ తెలిసిన ఆ రచయితయే, నమ్మించి, స్వార్థంతో, నా జీవితాన్ని ఇలా నాశనం చేశాడు. దుర్మార్గుడు! నాలాంటి అభాగినుల జీవితాలింకా ఎన్నో ఇలా అడివిని గాచిన వెన్నెలలై శాశ్వతంగా తీరని కోరికలతో అభాగ్యజీవితాలైపోయి కాలగర్భంలో కలసిపోతే! అంటూ ఆమె ఒక్కసారి బాధగా దుఃఖంలోనే ఒక్క వేడి నిట్టూర్పును దిగమింగింది...

ఏమిటి? అసలు విషయం చెప్పండి? విచారించి ఏం లాభం అన్నా...ఆమె మొదలు పెట్టింది. లోకజ్ఞానం వచ్చీ రావటంతోనే నా చిన్నతనంలో కట్టబెట్టబడిన భర్త మరణించాడు. నేను మంచి యౌవ్వనవతినయి, ప్రపంచాన్నీ, జీవితాన్నీ అర్థం చేసుకొనే పరిణతికి వచ్చేసరికి, నేను బాలవితంతువు ననీ, పురుషవాసన నాకు తగలకూడదనీ, నేను ఒకపూట చప్పిడి తిని, నాలుగుగోడలమధ్యా, ఏ గోవింద నామాలో జపిస్తూ పడివుండాలనీ అర్థమైపోయింది.

మంచి యౌవనంలో ప్రకృతిసిద్ధమయిన, పరమేశ్వర కల్పితమయిన దాంపత్య

జీవితానికి శాశ్వతంగా ఎడబాటయి, పురుష సంపర్కం పొందకూడదని, కనీసం పురుష వాసన సోకకూడదని జీవచ్ఛవంగా, మన హిందూసంఘం చే శాసించబడ్డాను. అలాగే ఆరని కోరికలతో, ఏపుస్తకం తోనో, ఆ నాలుగు గోడలమధ్యా జీవితాన్ని గడపేదాన్ని అప్పట్లో. మా ఇంటి కెదురుగానే లాయర్ శాస్త్రిగారి ఇల్లు. వారి అబ్బాయి ప్రకాష్ అప్పట్లో ఇంటర్ చదువుతూ, వేసవిశలవుల్లో వచ్చాడు.

అతడు మంచి రచయిత. అతడు వ్రాసిన అనేక కథలు నేను అంతకుముందే అనేక పత్రికల్లో చదివాను. పత్రికల్లోని అతను వ్రాసే రచనల్ని బట్టి చూస్తే అతని దెంతో విశాలమైన హృదయమనీ, అతను మన సంఘంలోని దురాచారాల్ని, మూఢవిశ్వాసాల్ని, స్వార్థాన్నీ, ఖండించి, సంస్కరించే ఉత్తమ సంస్కర్త అని నాకు తోచేది. అతడు ముఖ్యంగా, హిందూస్త్రీపునర్వివాహ విషయంమీద అనేక కథలు వ్రాసి, పత్రికాప్రపంచంలో ఒక అద్భుతమైన సంచలనం కలిగించాడు. అతన్ని చాలా మంది మంచి సంస్కర్త అనీ, ఉన్నత భావాలు కలవాడనీ, స్తుతించడం, గౌరవించడం నేనెరుగుదును. ఆ కారణంగానే నాకు అతనంటే అనేకవిధమైన పూజ్యభావం కల్గి క్రమంగా అదే ప్రేమగా మారింది. అతను వ్రాసే వ్రాతలవల్ల అతని హృదయం యొక్క విశాలత్వం నాకు అర్థంఅయిందను కున్నాను. అతని వ్యక్తిత్వానికీ, మంచి చెష్టలకీ, విశాలదృష్టికీ, అతని వ్రాతలనే నిదర్శనంగా తీసుకుని నా హృదయంలో నే అతన్ని ఆరాధించసాగాను. క్రమంగా నాకతని మీద అవ్యాజమైన శాశ్వతమైన నిర్మల ప్రేమ ఏర్పడిపోయింది. ఒకనాడు ఏకాంతంగా, అతన్నికలుసుకుని మాట్లాడాను— నాజీవితాన్ని కాపాడుతాననీ, సంఘాన్నీ, ప్రపంచాన్నీ ఎదిరించి అయినా సరే, నడుంకట్టి నిలబడి, నాజీవితంలో లేత వెన్నెల వెలుగులు విరజిమ్ముతాననీ, నమ్మించాడు. నన్ను పెళ్లిచేసుకోడానికి తనకు ఏమీ అభ్యంతరం లేదన్నాడు. ఇద్దరం పెళ్లి చేసుకుని, ఎక్కడికో పోయి, యీ సంఘానికి దూరంగా, హాయిగా జీవిస్తూ,యీ భూలోకంలోనే అమరసుఖం పొందుదామని ధైర్యం చెప్పాడు. అతని మాటలకు నేను మోసపోవడంలో ఆశ్చర్యం యేముంది? అతను చెప్పినదంతా అక్షరాలా చేయగల సంస్కర్తయేననీ, తప్పకుండా నావిషయంలో తను త్యాగం చేసి నా జీవితాన్ని ఉద్ధరిస్తాడనీ, అనుకున్నాను- కాని కొంతకాలం వన్ను నేను నిగ్రహించుకుని ఆ మాటలు ఎంతవరకు యథార్థములో తెలుసుకోవలసింది- కాని, నా శరీరం నా ఆత్మను జయించింది - ప్రకృతిసిద్ధమైన శరీరావసరంముందు సాంప్రదాయమాత్రమైన మనోనిగ్రహం నిలబడలేక పోయింది. పురుషపరిష్వంగ సౌఖ్యంకోసం నాశరీరంలోని ప్రతి రక్తబిందువూ తహతహలాడింది. నా అమాయకత్వాన్నే అంగీకారంగా గ్రహించిన ఆతుచ్ఛుడుఅమాంతం నన్ను తన బాహువుల్లో బంధించివేశాడు. ఏదో తెలియని మైకంలో కళ్లు మూతలు పడగా, అతని హృదయంమీదే వ్రాలిపోయాను మగతలో, అమరానుభూతిలో.

జీవితంలో యెన్నడూ ఎరుగని, రుచి చూడని తియ్యని ప్రథమానుభవం, స్వర్గంలోకి గానీ తేలిపోతున్నానా? అనిపించింది. అలా కొంతకాలం, అతనితో ఆనందంగా గడిపాను; ముందు జీవితం ఊహించుకుంటూ, భవిష్యత్తులో, స్వర్గానికి నిచ్చెనలు వేశాను. అతను తప్పకుండా నన్ను పెళ్లి చేసుకుంటాడనే ఆశించాను. ఆరోజు కోసరం ఎదురుచూశాను అలానే.

అతనికి వేసవిశలవులైపోయి వెళ్లిపోయాడు పట్నానికి. అతని ఉత్తరంకోసం ఎదురుచూస్తుండంలోనే, ఆరు నెల్లు గడచాయి. ఈలోపునే, మీతోగనక చెప్తున్నాను...

పాపం పండినట్లు నాశరీరం పండింది. నా గర్భంలో ఒక శిశువు ప్రవేశించాడని అచిరకాలంలోనే గ్రహించాను. అయితే చేసే దేముంది? తొందరపడ్డందుకు ప్రతిఫలం?

అతనికి ఎన్నో ఉత్తరాలు వ్రాశాను. జవాబు లేదు. కొన్నాళ్లకి అతను చదువు మానేసినట్టూ, ఎక్కడో ఉద్యోగం చేస్తున్నట్టూ, సంబంధంకూడా నిశ్చయం అయిపోయినట్టూ విన్నాను.

ఇంక నారహస్యం ఎంతోకాలం దాగదు! ఆగుట్టు కాస్తా బయటపడి సంఘంలో నేనొక పతితననీ, కులటననీ, గుర్తించబడకముందే స్వార్థపూరితమైన మానవలోకం విడిచిపెట్టి శాశ్వతమైన, అమరలోకం చేరుకుందామనుకున్నాను.

ఆరాత్రే పెరట్లోని, బైలునూతిలో దూకేశాను. అనంతరం నా కళేబరానికి అంత్యక్రియలన్నీ యథావిధిగా జరిగాయి. కడుపునొప్పివల్ల నూతిలో పడిపోయానని, లోకం చెప్పుకుని తృప్తిపడింది- అనంతరం చిరశాంతిమయమైన ఈ గంధర్వ లోకంలో ఇలా బ్రతుకుతున్నాను. ఇంకా నాకు కోరికలమీదా, జీవితంమీదా ఆశ పోలేదు. వెన్నెలరాత్రులు వచ్చినప్పుడల్లా, ఇలాగే విడుస్తూ మనస్సుకి కొంత ఊరట కల్పించుకుంటూఉన్నాను. పురుషజాతి మీదా, అందులో, సంఘానికి ఉపకారం చేస్తున్నాం, విశ్వకల్యాణానికి మంగళగీతాలు పాడుతున్నాం, సమాజాన్ని మరమ్మత్ చేస్తున్నాం అని డబ్బాకొట్టుకుంటూ, పైకి శ్రీరంగనీతులు చెపుతూ, లోకాన్ని మోసగించి లోలోపల జీవితాలు జీవితాలే నాశనంచేసే, యీ స్వార్థపూరిత వంచకసంస్కర్తల మీదా నాకు మహాకోపం-హృదయశాంతికోసం మీకీ కథ చెప్పాను. ఆ పాపాత్ముడింకా బాగానే ఉన్నాడు. పెళ్ళి చేసుకున్నాడు కూడా, వేలుకట్నం పుచ్చుకుని. భార్య పురిటికి వెళ్లిందిట?... అందామె...నా శరీరం అంతా నిలువునా ఎవరో పెట్రోల్ పోసి తగులబెడుతున్నట్లయింది... అలాగా? అబ్బే! ఎంతపని చేశాడు మోసగాడు? ఇంతకీ మీపేరు చెప్పారుకారు అన్నా... నాపేరా? పేరెందుకులే. నీమీదా నాకు నమ్మకంలేదు. అయినా చెప్తున్నా. నా పేరు రమ. చేతనయితే ఈ యథార్థం లోకానికి బుజావుపర్చు! ఆతుచ్ఛుడు బ్రనాలుస్తాడు నలుగురిలో... లేకపోతే అంతే—కాలగర్భంలో లీనమయిపోయిన అనేక సంఘటనల్లో ఇదొకటి? అంది ఆమె...రమా? రమ! ఎక్కడిదీ పేరు? ఆరు సంవత్సరాలు

ఒక్కసారి నామనోనేత్రంలో గిరగిర తిరిగినయి-ఏమిటి రమా? నన్ను క్షమించు. ఆ హృదయశూన్యుణ్ణి నేనే - నీకు క్షమార్హంకాని ద్రోహంచేసి, ద్రోహినై, రచయిత అనే ముసుగుతో ఇప్పటికీ గౌరవంగా సంఘంలో బ్రతుకున్న పాపిని, వంచకుణ్ణి నేనే! అంటూ ఒక్క వెర్రి కేకపెట్టాను.

అబ్బ! ప్రకాష్! నువ్వా! ద్రోహీ! నీముఖం చూడకూడదు. నువ్వే నా, ఎవరో అనుకున్నాను. ఇక్కడకూడా నన్ను ప్రశాంతంగా జీవించనియ్యడానికి నీహృదయం ఒప్పుకోవడంలేదా? ఎప్పటికయినా.నిన్ను నేను మరిచిపోలేను. నా హృదయంలో, కనపడని గాయానివి నువ్వు :- నిష్ఠురుడా? అంటూ ఆమె అమాంతంగా నామీద పడి పీక గట్టిగా పట్టుకొని నొక్కెయ్యసాగింది. "అమ్మబాబోయ్" అంటూ ఒక్క వెర్రికేక పెట్టాను. కళ్లు తెరచి చూసేటప్పటికి, నేను మంచంక్రింద దొర్లుతున్నా. కిటికీలోంచి వచ్చటి సూర్యకిరణాలు మంచంమీద పడుతున్నాయి. మంచంక్రింద, రాత్రి నేను సగంరాసిన ప్రణయతపస్విని అన్న కాపీ చిందరవందరగా పడి ఉంది. ఏమిట్రా! పలవరిస్తున్నావ్. ఇంత పొద్దెక్కి? అంటూ వచ్చింది లోపల్నుంచి మా అమ్మ.

# ★ శాంతిగీతం ★

శాంతి! శాంతి!
లోకానికి శాంతి!
నాగరికతకు శాంతి!
నరజాతికి శాంతి!

బంగారం పండినమా
వరిపైర్లకు శాంతి!
చరిత్ర ఇక పండించే
పైర్లన్నిటికీ శాంతి!
ఉదయించని ఉషః
శాంతులకు శాంతి!

గర్భస్థులు భావిపౌర
కోటి కొరకు శాంతి!

నే పీల్చే ఊపిరిలో
ప్రణయవాయువుకు శాంతి!
యురేనియం అణువుల్లో
న్యూక్లియస్‌కు శాంతి!

శాంతి! శాంతి!
మనకందరికీ శాంతి!

ఏ దేవుడు కరుణించడు
లోకానికి శాంతి.

నింగినుండి వెన్నెలవలె
కురవబోను శాంతి.
ద్వేషమనే క్షేత్రంలో
పండబోదు శాంతి.

మల్లెతీగపై విరిసే
మల్లెపువ్వు శాంతి.

మావికొమ్మపై పండే
మావి పండు శాంతి.
ప్రగతిశీల నవజీవన
చైతన్యం శాంతి.

నూర్చిన వరికళ్లం వలె
కృషి జన్యం శాంతి.
కోటికోట్ల జనకంఠో
ద్గతరుతమే శాంతి.
మృతవీరుల చితాభస్మ
సందేశం శాంతి.
శాంతి! శాంతి!
లోకానికి శాంతి!

---

# తమాషా ప్రశ్నలు

(1) ఒకడు రెండు గూళ్లలో కొన్ని పావురాలను పెంచుతు న్నాడు. మొదటి గూటిలోని పావురాలలో ఒకటి రెండో గూటిలోనికి వెడితే రెండు గూళ్ల పావురాలు సమానంగా వుంటాయి. రెండో గూటిలోని పావురాలలో ఒకటి మొదటి గూటిలోనికి వెడితే మొదటి గూటి పావురాలు రెండో గూటి పావురాలకి రెట్టింపు ఉంటాయి. అసలు ఏ గూటిలో ఎన్ని పావురాలున్నాయో చెప్పండి.

(2) రాముని తండ్రి కిప్పుడు 30 సంవత్సరాలు. రామునివయస్సు 10 సం॥ లు. తండ్రి వయస్సు ఇప్పటికి మూడురెట్లు ఉన్నప్పుడు రాముని వయస్సు ఇప్పటి కెన్నిరెట్లు వుంటుంది?

(జవాబులు మరొక పేజీలో)

# చెరువు గండి

(15-వ పేజీ తరవాయి)

మూడో : బాబోయ్ కొాళ్లు జారి పోతున్నయ్. (దభేలు మన్న మోత)

జనం : అరెరె. జారిపడ్డాడే.

తల్లి : ఇంకో నయ్యం. కట్టకు ఇటు పక్క నే పడ్డాడు అదుష్టమంతుడు.

పెద : యేం జేసినా లాబం లేకుండా ఉందే.

రెండో : గండి దొంకలో నడుం లోతు నీళ్లు పొంగుతున్నయ్.

జనం : యెట్టా ? యెట్టా ? యేం కొయ్యాల ?

చిన అరే పెద్దోడా, దీని కిటుకు యేకే ఉందిరా.

జనం : యేందది ? యేందది ?

చిన : కట్టకు లోతట్టున పడ్డ గండికి అడ్డేస్తే సరి.

మొదటి : యెట్టా ? యేది పెడితే నిలుసుద్ది ?

చిన : గేలం తీసుకుని మడిసి లోపలకు దిగి కట్టను కరిసిపెట్టుకుని కూర్చోవాల.

జనం : ఆఁ.

చిన : యేరే దారి లేదు. యేదేసినా కొట్టకపోవాల్సిందే. మడి సయితే ఇవతల పూడిసేవరకూ నిలపొచ్చు. గేలం ఇట్టా ఇయ్యండి.

తల్లి : అయ్యో నాయనో నా కడుపున చిచ్చు పెడతావంట్రా. (ఏడుపు)

చిన : యేడవబోకే.

జనం : వొద్దొద్దు చిన్నోడా. ఆ పని చెయ్యొద్దు.

చిన : యేందయ్యా, అంతా తెలిసినోళ్లు. మరి గండి మూసే దెట్టాగో సెప్పండి.

జనం : (మౌనం)

పెద : అంతేనయ్యా, గండికి లోతట్టున నేనూ, బయట మా చిన్నోడూ దూరి దారను నిలుపుతాం. మీరంతా మట్టీ, రాళ్ళూ యేసి పూడ్సండి.

తల్లి : ఇదేం అగాయిత్యంరోయ్. (ఏడుపు)

జనం : అయ్యో. జీవసమాది సెయమంటారంట్రా కుర్రాళ్లని ?

చిన: లేకుంటే గండెట్టా పూడుద్దయ్యా?

జనం : ముసలమ్మోవ్. నువ్వన్నా చెప్పమ్మా, కుర్రోళ్లకి.

తల్లి : (ఏడుస్తూ) నాయనోవ్. నన్ను నంపేసి మీరేవయినా సెయ్యండ్రా. కొానక కొానక కన్న బిడ్డలు. గొడ్డాలయినా రాలేదు. జీవసమాది ఎందుకురా. (ఏడుపు.)

పెద : అమ్మా ఈ మాటిను. మేం జీవసమాది కాకపోతే మూడు వేలగడప జనం జలసమాది కావాల్సిందే.

తల్లి : అయితే అందరితోపాటే సమాదవుదాం. మీ యిద్దరే యెందుకు సావాల్రా ?

చిన: యిటు సూడమ్మా. అర్ధరేత్రప్పుడు కట్టతెగి ఊళ్ళమీద పడితే పసిగాయలూ, బాలింతలూ, మాలింతలూ, ముసిలోళ్లూ, గుడ్డోళ్లూ, చెవిటోళ్లూ, అంతా అలో లక్షణా అని పోవాల్సిందె గదా. మేం పోతే రెండు పాణాలే. పోతే పోతాం. ఊరిని నిలపటానికి పోతాం.

తల్లి : ఇంత పరాగ్యాలు యెందుకురా అప్పుడే. (ఏడుపు)

పెద : మిగిలినోళ్లు దూకారంటే ఆళ్ల ముసిలోళ్లే కాకుండా పెళ్ళాం బిడ్డలు కూడా యేడుస్తారమ్మా.

తల్లి : నన్ను మీ సేతులమీద దాటేసి తల్లిరుణం తీర్చుకోండ్రా.

చిన : వరదరాజమ్మతల్లి ఋణం నువ్వు ముందు తీర్చుకో అమ్మా.

తల్లి : అయ్యో, వాయి నోక్కేస్తున్నారు కదరా. (ఏడుపు)

పెద : ఏమయ్యోవ్ పెద్దమడుసులూ మీరింక యిట్టా ఊరుకుంటే ఈ సీమ యావత్తూ గంగపాలే ? మీరు సిద్దంగాండి మేము దూకుతాం.

చిన : లోపల దూకేది నేనన్నోవ్.

పెద : అరేయ్ నేను పెద్దోణ్ణి.

మొదట: (గద్గద కంఠంతో) కంబన్నా! మేం మిమ్మల్ని సమాది సెయ్యలేంగా.

చిన : చెయ్యకపోతే మూడు వేల గడపను చేస్తావంటయ్యా ?

(పెద్ద ఉరుముమోత. నీళ్లజోరు పెద్దదవుతుంది.)

పెద : ఇదుగో నరసయ్యోవ్. ఈ తడవు వానొచ్చిందంటే ఇంకొట్టిదే. అంతా సిద్దంగా నిలవండి. సిన్నోడా ?

చిన : ఆ సిద్దమే.

పెద : అమ్మా పోతుండాం. మునసబయ్యా మా అమ్మను కనిపెట్టుండు.

చిన: శ్రీశైలం మల్లన్నా, త్రిపురాంతకం కంబయ్యా మా అమ్మని రచ్చించండి. (గభాలున దూకుతారు. కేకలు. రాళ్లూ మట్టీ విసురుతున్న మోత.)

జనం : దార తగ్గిపోతుంది)

(నీళ్లు పడే శబ్దం క్రమంగా తగ్గిపోయి పూర్తిగా ఆగిపోతుంది)

మొదటి : (డగ్గుత్తికతో) పిల్లోళ్లా. యంతపని చేశార్రా. (అంతా ఏడుస్తారు. తల్లి మరీ)

రెండో : అమ్మా, నిన్ను మేం కనిపెట్టి ఉంటాం. అడిగినచోట మాన్యం ఇప్పిత్తాం.

తల్లి : నాయనా, నాకు మాన్యాలెందుకురా నా బంగారుకొండలు పొయ్యింతరవాతా. (ఏడుపు)

మొదటి: నీ పిల్లల పేర్లు శాశ్వతంగా ఉండేట్టు సేస్తాం. ఈ వరదరాజమ్మ సముద్రాన్ని ఇయ్యాలనుంచీ కంబం సెరువని పిలుస్తాం.

తల్లి : నా బిడ్డలు పొయ్యింతరవాత ఇది సముద్రమయితే నేం, సెరువయితే నేం ? అయ్యో పెద్దోడా, సిన్నోడా?

మొదటి : ముసిల్ది యాడికి పోతుంది ?

రెండో : దూకే ముందు పెద్దోడు నిలబడ్డ బండను ముద్దెట్టుకుంటుంది.

జనం : అయ్యయ్యో బండేస్తుకుని సెర్లో దూకింది. ఇక నేముంది. బండ అడుక్కి లాగేసింది.

మొదటి : (విచారంగా) పోనియ్. ఆ జలమకి ఇక సుకం లేదుగదా. (అంతా వెడుతూ పాట. మొదటివాడు చరణాలు పాడుతుంటే మిగిలినవాళ్లు కోరస్ పాడతారు)

పాట

కంబన్నా, చిన కంబన్నా,
పెదకంబన్నా, చినకంబన్నా,
కంబన్నా....
సదువూ సందెలు లేవండీ.
బక్తీ సిగ్గులు లేవండీ.
సీకూ సింతా లేవండీ
పూానీ గీచీ లేవండీ.
అర్బకులండీ అర్బకులూ....పెద
జాలి గుండెలే కలవండీ
సిరికికండలే లేవండీ
కష్టం చూపెనె లేరండీ
సీమను నిలబొగారండీ
మహాత్ములండీ మహాత్ములూ...పెద
కంబన్నా, చిన కంబన్నా,
పెద కంబన్నా, చినకంబన్నా....

# దాగిన రహస్యం

ఆశాలత భుక్తి గడవడంకోసము ఏదైనా నౌకరీ చేయాలని తాపత్రయ పడుతుంది. 'అవిడే అక్కయ్యకు ఇది సుతరామూ ఇష్టం లేదు. అయినా చేతులు ముడుచుకొని కూర్చోవడం ఆమెకు మనస్కరించడము లేదు. ఆశకు జీవనోపాధికొరకు కలకత్తా వెళ్లాలని ఉంది కాని చేతిలో పైసా కూడా లేదు. కనీసపు ఖర్చులకైనా డబ్బు సంపాదించాలని కోరికగా ఉండడంవల్లనే రాయ్ బహదూర్ హరినారాయణగారింట్లో వంటమనిషిగా కుదరడానికి యిష్టపడింది. కాని ఆవిడ అక్కయ్య చివరకు గుణుస్తూనైతే నేమి ఒప్పుకోక తప్పిందికాదు.

ఆశాలతస్వస్థలం అసలు ఢాకానగరం. తండ్రి పేరు పొందిన పెద్ద వకీలు. మతదురహంకారుల చేతిలో దుర్మరణం పొందాడు. తల్లికూడా అదే కారణంగా బలి అయింది. ప్రాణం, మానం గుప్పిట్లో పెట్టుకొని తానూ చెల్లెలూ భారతదేశానికి బయల్దేరారు. సరిహద్దు దాటి ఘూవలకు వచ్చేసరికి మిగిలినదల్లా తనొక్కతే. చాందినీపూర్‌లో నున్న తన పెద్దమ్మ కూతురింటి[illegible]చ్చే[illegible] చదువుకు [illegible]గావడం తన భవిష్యత్తునుగురించి ఆశ ఉంది.

[illegible]నీపూర్‌లో రాయ్ బహదూర్ హరినారాయణ జమీందారు. ఇప్పుడు కోటలో ఉన్నవాళ్లా ముగ్గురు స్త్రీలు మాత్రమే. హరినారాయణ భార్య, కూతురు, తలచెడిన చెల్లెలు నళిని. నెలజీతానికి ఆశాలత పనిమనిషిగా కుదిరింది. కోట చాలపెద్దది గావడంవల్ల క్రిందిభాగం మాత్రమే ఉపయోగించుకుంటున్నారు.

ఆశాలత ఉండేందుకు రెండవ అంతస్థులో ఒక గది యిచ్చారు. గదిలో ఒక కుర్చీ ఒక డ్రాయరు దుమ్ముకొట్టుకొని ఉన్నాయి. తాను రాత్రిళ్లు చదువుకొంటానికి చాల వీలుగా ఉన్నదని సంతోషించింది. కోటలో చేయవలసిన పనికూడా చాల తక్కువే.

ఆ వేళ సాయంకాలము ఆశాలత చిల్లర సరకులు తేవడానికి దుకాణానికి వెళ్లింది. సరుకులు కొనుక్కొని తిరిగి వస్తుండగా ఒక యువకుడు వెంబడించి రావడం

ఆర్. ఆర్. క్రిష్ణమూర్తి

చూచింది. మొదట్లో పట్టించుకోకుండా వెళ్తున్నది. కాని తాను వెళ్లిన బజారుకు తిరిగిన గొందికి వెంబడించిరావడంవల్ల అనుమానం భయం కలిగినయి. ఇంతలో అతను దగ్గరగా వచ్చి "మీరు జమీందారు గారి కోటలో పని చేస్తున్నారా?" అని ప్రశ్నించాడు.

"అవును," అంది.

"మీ పేరు ఆశాలత కాదూ?" అన్నాడు పాత చుట్టంలా.

తిరిగి, "అవును." అంది.

"నెలజీతంమీద పని చేస్తున్నారా?" అని అడిగాడు.

"అవును," అంది ఆశ.

"పదిహేను రోజులక్రితం కోటలో పనిచేసే అమ్మాయి చనిపోయినవిషయం మీకు తెలుసునా?"

"తెలియదు."

అతడు ఆశ్చర్యపడ్డాడు.

"నిజంగా! మీరు, తెలియకనే పనిలో ప్రవేశించే రన్నమాట. తెలిసుంటే రాకుండాఉండేవారేమో!" అన్నాడతను.

"ఎందుకు?" అని ప్రశ్నించింది ఆశ.

"ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది," అన్నాడు.

"ఓస్! ఇందులో నేను పనిమానుకునేటంత విశేషము ఏమీ లేదే!" అంది.

"ఉంది. అది అసలు ఆత్మహత్యా లేక హత్యా అని అనుమానించవలసి వస్తుంది," అన్నాడు.

"ఇప్పుడు మీరే అన్నారు గదూ ఆత్మహత్యని," అని అడిగింది.

"నేను అనడంగాదు ప్రధానం, వారన్నారు."

"ఎవరు?"

"కోటలోనివారు."

"నాతో మీకేమైనా పని ఉందా? ఉంటే చెప్పండి. నేను త్వరగా వెళ్లాలి," అంది ఆశాలత.

"ఉంది. నేను గవర్నమెంటు సి.ఐ.డి.ని. పనిచేసే అమ్మాయి ఆత్మహత్య చేసుకొని ఉండదని నా అనుమానం."

వారు చెప్పడం ఆ అమ్మాయికి మూర్ఛరోగం ఉందనిన్నీ, బాధపడలేక ఆత్మహత్య చేసుకుందనిన్నీ. కాని నేను నమ్మలేకున్నాను. తప్పకుండా ఇది హత్యకు

సంబంధించి ఉంటుంది. మీ సహాయం ఉంటే తప్పకుండా ఈ రహస్యాన్ని బయటికి లాగొచ్చు. ఈ విషయం రహస్యంగా ఉంచాలి సుమా! ఏమంటారు?"

"అలాగే," అంది ఆశ.

"తప్పకుండా రేపు కలిసికొందాము." అన్నాడు.

"మీ పేరు?"

"శశిభూషణ్," అని చెప్పాడు.

ఇంతలో వారు కోటసమీపానికి రావడంవల్ల చీలిపోయారు. ఆలస్యంగా వచ్చినందుకు నళిని కేసుకు ఆమె కోపం వచ్చింది. "ఎక్కడ పెత్తనాలు చేస్తున్నారండీ?" అని సాగదీసి వ్యంగ్యంగా అడిగింది. ఆశ మౌనంగా నిలబడింది. జమీందారిణి వచ్చి నళినిని చీవాట్లు వేసింది. ఆశను తొందరగా వంటచేయమని పురమాయించింది. చలికాలం గావడంవల్ల భోజనాలు కాగానే ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లారు.

ఆశమనస్సు ఎందుకనో దిక్కు దిక్కుమంటున్నది. లైటు ఆర్పేసి పండుకుంది. పైగదినుంచి ఎవరో వస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది. వాళ్లంతా క్రింది భాగంలో పండుకొన్నారు. తనకు తెలిసినంతవరకు ఎవ్వరూ పైభాగంలో లేరు. ఎప్పుడూ పాడుపెట్టే ఉంటుంది. అడుగుల చప్పుడు ఎక్కువయింది. ఇంకా ఎక్కువయింది. ఎవరో తన గదిపైకే వస్తున్నట్లు అనుమానించి లాంతరు తిరిగి వెలిగించి తలుపు తీసి చూచింది. ఎవ్వరూ లేరు. అంతా నిశ్శబ్దం. తిరిగి వచ్చి పడుకుంది. స్పష్టంగా తిరిగి అడుగుల చప్పుడు వినిపిస్తోంది. సాయంకాలము శశిభూషణ్ చెప్పిన సంగతి చప్పున జ్ఞాపకం వచ్చింది. ఆ పనిచేసే అమ్మాయి యీ గదిలోనే ఉండేది కామోసు. ఈ గదిలో ఆత్మహత్య చేసుకుందేమో. ఈ కుర్చీ, ఈ డ్రాయరు, అన్నీ ఆ అమ్మాయి ఉపయోగించినవే కదూ? అని ప్రశ్నించుకుంది. పైన అడుగుల చప్పుడు ఏమీ తగ్గలేదు. గుండెలు పీచు పీచు మంటున్నాయి. ఆ అమ్మాయే! తప్పకుండా ఆ అమ్మాయే దెయ్యమయిందేమో. క్రిందికి వెళ్ళి జమీందారిణితో చెప్పితే? ఛా! నవ్వుతుంది, అనుకుని ముసుగు తన్ని ఆలోచిస్తూ నిద్రపోయింది. రాత్రి సరిగ్గా నిద్రలేకపోవడంవల్ల కళ్లు ఎర్రగా ఉన్నాయి. మొహం పీక్కుపోయింది. తూలు తూ పని చేస్తుంటే జమీందారిణి అడిగింది. "ఏం? వంట్లో బాగుండలేదా?" అని. రాత్రి జరిగిన సంగతి చెప్పితే బాగుండదేమో ననుకుంటూనే, చెప్పేసింది. జమీందారిణి నవ్వుతూ, పైభాగం పాడుపెట్టడంవల్ల ఎలుకలు చేరేయి. బహుశా వాటి చప్పుడు విని భ్రాంతిపడి ఉంటావ్, అంది. ఆ సమాధానం ఏమంత తృప్తికరంగా లేనప్పటికీ ఔనన్నట్లు తల ఎగరేసి ఊరుకొంది.

ఆ వేళ సాయంకాలం తిరిగి శశిభూషణ్‌ని కలిసికోవడం తటస్థించింది. రాత్రి జరిగిన విషయం అతనితో చెప్పింది.

"ఒకసారి కోటఅంతా పరిశీలించగలిగితే విషయం తేలిపోతుంది," అన్నాడు.

"ఏవిధంగా సాధ్యపడుతుంది?" అంది ఆశ. "వాళ్లు ఛస్తే క్రొత్తవాళ్ళను లోనికి రానివ్వరు."

"రాత్రి 12 గంటలకు వస్తాను. వాళ్ళకి తెలియకుండా గేటు తీసివుంచావంటే అసలు రహస్యమంతా తేలిపోతుంది," అన్నాడు శశిభూషణ్.

సాయంకాలం వచ్చేసింది ఆశాలత. జమీందారిణి కోటదగ్గర నిలబడి ఇటే చూస్తోంది. ఆశాలత రాగానే, పరాయి మగవాడితో స్నేహం తమకు చాలా తప్పని, అక్రమము, అగౌరవం, అని చెడామడా తిట్టేసింది. తాము ఇప్పుడైతే ఈవిధంగా ఉన్నా తమ జమీందారుగారి హయాంలో ఎంతో హోదాగా, దాబు దర్పంగా ఉండేవాళ్ళ మని పొగుడుకుంది. తమ కోటకు పెద్దపెద్ద అధికారులు, ఫాయిదా గలవాళ్ళు వస్తుండే వారని, ఇకముందు మళ్ళీ వాళ్ళతో సన్నిహితంగా మాటాడినా విన్నా నౌకరీ లోనించి తప్పుకోవలసివస్తుందనీ, హెచ్చరించింది.

తాను మాట్లాడక నడుస్తూ మనస్సులో కాసేపు ఆ కాలంలో కూడా యింతే ప్రక్క వాడేనని ఉన్నట్టి సంగతులు చెప్తుంటే వింటున్నానని గదిలోకి వెళ్ళింది ఆశ.



రాత్రి భోజనాలయేసరికి 10 గంటలు అయింది. ఎప్పటిలాగే తన గదిలోకి వెళ్ళింది. మనస్సంతా శశిభూషణ్ మీదే ఉంది. త్వరగా వస్తే బాగుండు ననుకుంటున్నది. ఏమీ తోచడంలా. ఇంకా రెండు గంటల వ్యవధి ఉంది. శశిభూషణ్ని పెండ్లిచేసుకుంటే, అనే ఆలోచన వచ్చింది. తన ఆలోచనకు తనకే సిగ్గయింది. లాంతరు వెలుగుతోనే ఉంది. లాంతరు ముందు కూర్చొని ఆలోచిస్తున్నది. మెల్లిగా వెనుకనుండి ఎవరో వస్తున్నట్లనిపించింది. వెనుకకు తిరిగి చూచింది. ఎవరూ లేరు. రాత్రిలాగు అడుగుల చప్పుడు వినిపిస్తోంది. ఛ్ఛ- ఎలుకల చప్పుడు కానేగాదు. స్పష్టంగా మనిషి నడుస్తున్న చప్పుడే! భయంవేసింది. లాంతరు ఆర్పేసి పండుకుందామను కొంది. కాని శశిభూషణ్ వస్తానని చెప్పాడు. క్రింది గడియారం పదకొండు గంటలు కొట్టింది. ఇంకో గంటలో అతను వస్తాడు. గుండెలు భయంతో దడదడ లాడుతున్నాయి. అయినా తప్పదు. ఇంతలో అరగంట కొట్టింది. లాంతరు వెలుగు తగ్గించి తలుపు దగ్గరగా వేసింది. బయటఅంతా కటికచీకటి. కన్ను పొడుచుకున్నా దారి కానరావడం లేదు. మెల్లగా తడుముకుంటూ మెట్లమీదినుంచి దిగి క్రిందికి వచ్చింది. తలుపు చప్పుడు కాకుండా తీసి ఆవరణలోనికి వచ్చింది. బయట కూడా చీకటిగా ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంది.

ప్రక్కనే నిద్రగన్నేరుచెట్టుక్రింద మెల్లగా మసుగుఆకారాన్ని చూడగానే, అసలే భయంగా ఉండడంవల్ల, ఉలిక్కి పడింది.

శశిభూషణ్ సంగతి జ్ఞాపకం రాగానే మనస్సు కుదురు పరచుకుంది. శశిభూషణ్ మీది గుప్పటి తొలగించి

"జడుసుకున్నావే," అంటూ దగ్గరగా వచ్చి, మృదువుగా భుజంమీద తట్టాడు. ఆశాలత సిగ్గుతో తలవంచుకొంది.

* * * *

వారు కాసేపు మాట్లాడుకునేసరికి గాలితీవ్రత హెచ్చింది. కోట కిటికీతలుపులు టపటప కొట్టుకుంటున్నాయి. గాలి తీవ్రత తగ్గి వర్షం హెచ్చింది. కోటలోని వాళ్లు మేలుకుంటే చెడ్డప్రమాదం జరుగుతుందని శశిభూషణ్ని పంపించి తాను తిరిగి లోనికి వెళ్లింది. అదృష్టవశాత్తు కోటలోనివాళ్లెవరూ బయటికి రాలేదు. తన గదిలోనికి వెళ్లి లాంతరు హెచ్చించి డ్రాయరు ముందు కుర్చీలో కూర్చున్నది. ఆపైన అడుగుల చప్పుడు ఆగి ఆగి వినబడుతున్నది. పైన ఎవరో పచార్లుచేస్తున్నట్లనిపించింది. కోటలోనుంచి త్వరలో బయటపడాలనుకుంది. ఏమీ తోచక డ్రాయరు సొరుగు లాగింది. ఏదో తబుక్కున క్రింద పడింది. ఆశ ఎగిరిపడింది. నిదానించి చూస్తే క్రింద పడింది ఒకపుస్తకము. చేత్తో తీసి చూచింది. అది ఒక డైరీ. ఇది కోటలో తనకుముందు పనిచేసిన అమ్మాయిదయి ఉంటుంది. డైరీమీద 'ప్రసన్న' అని ఉంది. ఆపేరు గలవాళ్లు కోటలో ఎవరూ లేరు. తప్పక డైరీ చనిపోయిన అమ్మాయిదయి ఉంటుంది. డైరీలు చదవడం తప్పన్న సంగతి ఆమెకు తెలుసుగాని ఆవిడ మరణాన్నిగురించిన భోగట్టా ఏమైనా తెలుస్తుందేమోనని చదవ మొదలెట్టింది. మొదట్లో ఏమంత విశేషం లేదు గాని చివరకు చదవడం అవసరమని తోచింది.

జూన్ 24:- ఈ వేళ ఎందుకనో కోటలోని వారంతా విచారంగా ఉన్నట్టున్నారు. నన్ను కలిసికొన్నప్పుడు మాత్రం సంతోషంగానే ఉన్నట్లుగా ప్రయత్నించేవారు. నాకేమీ అర్థంకాకుండా ఉంది.

జులై 2:. మతకలహాలు ఎక్కువవుతున్నాయి. చాలమంది హిందూ మహమ్మదీయులు అరెస్టు చేయబడుతున్నారు. జూన్ 23 న చంపబడిన నజ్రుల్లాఖాన్ హత్యతో సంబంధం ఉన్నదనే కారణంగా రాయ్ బహదూర్ అరెస్టు చేయబడ్డాడు.

జులై 17: రాయ్‌బహదూర్‌కి శిక్ష తప్పనట్లుందని పుకారుగా వుంది. ఈవేళ్లా ఇంట్లోవాళ్ళంతా ఏడుస్తూనే వున్నారు.

జులై 21 : "ఆనంద బజార్" పత్రికలో హరినారాయణవిషయమై వార్త పడింది. చదువబోతుండగా నళిని వచ్చి గదమాయించి లాక్కు వెళ్లింది. వార్త విషయమై కుతూహలంగా ఉంది.

జులై 22: రాత్రల్లా నిద్రపట్టలా. మేడగదిమీద ఎవరో నడుస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపిస్తోంది. మనిషి పచార్లు చేస్తున్నట్లనిపించింది. భయంగా ఉండడం వల్ల జమీందారిణితో చెప్పాను.

మరేంగాదు ఎలుకల చప్పుడని చెప్పింది.

జులై 27 : నాకు అనుమానంగా ఉంది. ఇంట్లోవాళ్లంతా నన్నేదో పరీక్ష చేస్తున్నట్లనిపించింది. దాదాపు వారంరోజుల నుంచి కోటదాటి బయటికి వెళ్ళలేకపోయాను. అడుగుల చప్పుడు వింటూంటే ఏమిటో భీతిగా ఉంది.

ఇంతటితో డైరీ పూర్తి అయింది. దీనివల్ల రహస్యం కొంతగాకపోతే కొంతైనా బయటపడవచ్చు ననుకొంది. మరునాడు ఉదయమే శశిభూషణ్‌కి జాగ్రతగా డైరీ అందించింది.

సాయంకాలం ఆశాలత దుకాణానికి సరుకులకోసం వెళ్ళినప్పుడు శశిభూషణ్ తటస్థపడ్డాడు. చాందినీపూర్‌లో ఉండడం యిద్దరికీ ప్రమాదమన్నాడు. వివరాలు తరువాత చెపుతానన్నాడు. ఇద్దరూ కలకత్తా ఉడాయించారు.

రైలుబండిలో కూర్చున్నతర్వాత శశిభూషణ్ ఈవిధంగా చెప్పాడు.

"నీవు యిచ్చిన డైరి చదివినతర్వాత జులై 21 'ఆనంద బజార్' పత్రిక కోసం వెతికాను. లైబ్రరీలో దొరికింది. అందులో వార్త మరేమీ లేదు. అరెస్టు కాబడ్డ హరినారాయణ జైలునుంచి పారిపోయాడని ఉంది."

"ఇంతకీ ఆవిడ మరణంవిషయం అడుగుల చప్పుడు ఏమిటంటావు?" అని అడిగింది ఆశ.

"మరేమీ కాదు. జైలునుంచి తప్పించుకొని పోయిన హరినారాయణ కోటపైభాగంలో అంటే మూడో అంతస్థులో మకాం పెట్టాడు. నీవు విన్నది అంతకు ముందున్న పనిమనిషి విన్నదీ అతని అడుగుల చప్పుడే. ఈ రహస్యం పనిమనిషికి తెలుసుంటుందని ఆవిణ్ణి చంపేశారు. పనిమనిషికి మూర్ఛలరోగముందని బాధపడలేక ఆత్మహత్య చేసుకుందని నాటక మాడారు. నీవు నిజంగా అదృష్టవంతురాలివి. నిన్ను యింకా వాళ్లు అనుమానించలా. లేకపోతే నీకూ ఆగతే పట్టేది" అన్నాడు శశిభూషణ్.

మరునాడు 'ఆనంద బజార్' పత్రికలో వొక వార్త పడింది. అందులో "జులై 21 న జైలునుంచి తప్పించుకొనిపోయిన హరినారాయణ స్వంతయింట్లోనే పట్టుబడ్డాడు. ఆగస్టు 28 న ఆత్మహత్య చేసుకుందన్న వంటమనిషిమరణం హత్యకుసంబంధించినదిగా అనుమానించి స్త్రీలనుగూడ అరెస్టు చేశారు." అని వుంది.

---

22-11-50

చిత్రసమీక్ష:

# ★ ప్రతిభావారి "స్వప్నసుందరి" ★

"ప్రేక్షకుడు"

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రతిభావారి "స్వప్నసుందరి" దీపావళికి విడుదలయి ఆశాభంగం కలిగించింది

ప్రభు అనే యువకుడు తన స్నేహితుడు అబ్బితో ప్రపంచపర్యటనచేస్తూ సుందరిని స్వప్నంలో చూస్తాడు తరవాత అతనికి రాణి అనే కొండసాని తటస్థపడి అతన్ని ప్రేమిస్తుంది ప్రభు ఆమెప్రేమను త్రోసి కరించి వెళ్ళిపోయి స్వప్నసుందరిని ప్రత్యక్షంగా కలుసుకుని ఆమెలోకానికి పోతాడు మానవుణ్ణి ప్రేమించిన సుందరికి వాళ్ళ రాజు భూలోకవాసం ఆదేశిస్తాడు ప్రభూ, సుందరీ భూలోకవాసం అనుభవిస్తుండగా మాంత్రికుడొకడు సుందరిని చూసి మోహించి చెరపడతాడు ప్రభు ఆమెను రక్షించటానికి వచ్చి మంత్రగాడి చేత నానాహింసలూ పడతాడు తీరా అతను మాంత్రికుడి మర్మం కనుక్కొని అతనితో సమంగా యుద్ధం చేసే సమయంలో కొండసాని వచ్చి మాంత్రికుడి చేతిలో చనిపోతుంది ప్రభూ, సుందరీ సుఖంగా ఉంటారు

ఈ కథకు బోలెడన్ని నృత్యాలూ, పాటలూ తగిలించినా, అసందర్భపు చెత్త ఇంకా ఎంతో తగిలిస్తేగాని చిత్రం 16 వేల అగుగుల దరిదాపుకు చేరుకోలేక పోయింది

ప్రభు, అబ్బి, రాణి, సుందరి, మాంత్రికుడు—ఇవే కథలో ప్రధానపాత్రలు కథ రాసుకోవటం చాతకాని కారణం చేత ఈ అయిదు పాత్రల్లో ఒక్కటికూడా సరిగా కథకు ఉపయోగించ బడలేదు అసలు కథ ప్రభు సుందరుల ప్రణయకథ దీనికి ఒక అవాంతరం రాణీ, మరొక అవాంతరం మాంత్రికుడూ అని మొదటి నుంచీ అల్లుకురావచ్చు తరువాత కథా పరిణామంలో ఈ అవాంతరాలు ఒకదాన్నొకటి ప్రతిఘటించేటట్టు చేసుకున్నట్టయితే కథ చాలా రక్తికి వచ్చి ఉండేది ఇప్పుడున్న చిత్రంలో రాణి ప్రణయానికీ సుందరి ప్రణయానికీ నిజమైన సంఘర్షణ లేదు సుందరి అనేది ఒకతె ఉన్నదని రాణికి చచ్చే సమయంలో నే తెలుస్తుంది

సుందరి భూలోకంలో స్థిరనివాసం ఏర్పరచుకుని ప్రభుతో ంచేసే దాకా మాంత్రికుడు కథలోకి రాడు ప్రభు మాంత్రికుణ్ణి నిర్వీర్యం చేసినదాకా రాణి ప్రభుసహాయానికి రాదు ఏదో విధంగా ఆమె చచ్చిపోవటానికి మాంత్రికుడిదగ్గిరికి వచ్చినట్టు కనిపిస్తుంది తనపని ఈవిధంగా సులువు చేసినందుకు కథకుడు రాణికి పర్లీగ్గా ధన్యవాదాలు అర్పించవలసి ఉన్నది

కథలోని ప్రధానపాత్రల సృష్టి ఈ విధంగా అఘోరించగా ఇతర కల్పన దీనికి



ప్రతిభావారి "స్వప్నసుందరి"లో మాంత్రికుడు (ముక్కామల)

అనుగుణంగానే ఉన్నది. ప్రభు సుందరిని కలలో చూడటం కథకు ఉపక్రమణిక. ఈ సంఘటనకు గాను పాత్రలను గాని, ప్రేక్షకులను గాని సంసిద్ధులను చేయటానికి కథకుడు ఏమీ శ్రమపడలేదు. ప్రభూ, అబ్బీ గుర్రా లెక్కి వచ్చి అలసి ఏ చెట్టుకిందో కునుకుతారు. కలలో ప్రభుకు సుందరి కనిపిస్తుంది నమ్మితే నమ్మండి, నమ్మకపోతే మీ ఖర్మ. ప్రభు అబ్బిలో తనకు తరుచు ఒక సుందరి కలలోకి వస్తుందని నోటి మాటగా చెప్పినా సరిపోయేది. ఆ సుందరిని వెతుక్కుంటూ ప్రభు ప్రయాణమైనట్టు ప్రేక్షకులకు తెలియజేస్తే ఇంకా బాగుండేది. లేదూ, నిత్యమూ సుందరివచ్చి చెలికత్తెలతో విహరించేచోటనే ప్రభు ఆమెను కలలో చూసినా స్థలప్రభావం అండగా ఉండేది. ఇందులో ఏదీ జరగలేదు

ప్రభు సుందరిని తనదాన్ని చేసుకోవటానికి ఎట్టి ప్రయత్నమూ చేయలేదు ఆమె తనకు తానై అతనికి వొలిచిన అరటిపండయింది ఆమె అతన్ని గారడీసహాయంతో తన లోకానికి చేర్చింది. ఇక్కడ ఇంకో విషయంకూడా గమనించాలి. సుందరి ఇంకో లోకానికి చెందినది కావటం కథ కేమీ ఉపకరించదు. ఆమె భూలోకంలో ఉండటంమూలానే మిగిలిన సంఘటనలన్నీ జరిగాయి ఆమె ప్రవాసం కథకు అతుకు.

రాణిదగ్గర్నుంచి ప్రభూ, అబ్బీ తప్పించుకుపోయినవిధానం చాలా అసమర్థనీయంగా ఉంది ప్రభును ఖైదుచేసినచోట తలుపుకు తాళం లేదు. క్రియకు ఈ కారణం చేత నేతప్పించుకుపోవటంసాధ్యమవుతుంది.

అన్నిటినీ మించి హాస్యాస్పదంగా ఉన్నది మాంత్రికుడి మర్మరహస్యం. ఇది పేదరాసి పెద్దమ్మకు తెలుసు, మర్రిచెట్టుమీది శవానికి తెలుసు, మంచంకోళ్లకు తెలుసు. అడగనివాడిది పాపం. అయినా మాంత్రికుడు నివ్వెరపడి, ప్రభు తన ఆవరణలోకి ఎట్లా ప్రవేశించిందీ ఊహించలేదు వాడి కక్కడికే తనరహస్యం తెలీదనుకోవాలి.

సుందరిని ఎప్పుడో చెరపట్టిన మాంత్రికుడు, ప్రభు తన ఇంట్లో ప్రవేశించి పర్దా వెనక దాగి ఉండేదాకా ఆమెను చెరచటానికి ప్రయత్నించడు. మళ్ళీ ఎందుకో, ప్రభును సేవకులు పట్టుకుపోయి తనకు లైన్ క్లియర్ దొరికిన తరవాత సుందరిని చెరిచే ప్రయత్నం వాయిదా వేస్తాడు మాయలపకీరుకు చిక్కిన బాలనాగమ్మ వాణ్ణి దూరంగా ఉంచటానికి, వాడిమీద అనురాగం ఉన్నట్టు నటించి మంచిగా వాడిచేత 12 ఏళ్ల వ్రతం సాగించటానికి అనుమతి పుచ్చుకుంటుంది. కాని "స్వప్న సుందరి" కథకుడికి, సుందరినీ, మాంత్రికుణ్ణీ ఎడంగా ఉంచటానికి ఒక కుంటిసాకైనా సృష్టించే దక్షత చాలకపోయింది!

కర్రఊపి బ్రహ్మని తిమ్మని చెయ్యగల మాంత్రికుడు, ప్రభు లోపలికి ఎట్లావచ్చాడో తెలుసుకోవటానికి గాను చిత్రహింసలు చేయటమూ, సుందరితణ్ణి ప్రేమించిందన్న పగ ఈవిధంగా తీర్చుకోవటమూ హాస్యరసభరితంగా ఉంది మాంత్రికుడు తన కష్టంగా ఉన్న ప్రభును గుప్పెడు బూడిద చేస్తే తనకిక అడ్డేమీ లేదు కాని మాంత్రికుడు ఇటువంటి పనిచెయ్యక చిత్రాన్ని చిత్రనిర్మాతలకు కావలసినట్టు నడవనిచ్చినందుకు నిర్మాతలు మాంత్రికుడికి పట్టీగా ధన్యవాదా లర్పించవలసిఉన్నది.



ప్రతిభావారి 'స్వప్నసుందరి'లో నాయిక భూమికను నేర్పుతో నిర్వహించిన

**అంజలీదేవి**

చిత్రంలోకల్లా చెప్పుకోదగినది ఫొటోగ్రఫీ ముఖ్యంగా రాణీ ప్రభూ మొదటిసారి సంభాషించేటప్పుడు పెద్ద క్లోజప్పులు అత్యద్భుతంగా వినియోగించబడ్డాయి. స్క్రిప్టు-సంభాషణలోని చిత్రప్రవృత్తి సరిగా నడిచి ఉన్నట్టయితే ఈ పెద్ద క్లోజప్పులనుంచి క్రమంగా మిడ్ షాటుకు మార్చుకుంటూ వచ్చి ఆ ఇద్దరి మధ్యాగల విభేదం స్థిరపడినట్టు కెమెరాతో ఖచ్చితంగా రుజువుచేయటానికి అవకాశం ఉండేది. ఏమైనా, చిత్రానికి ప్రాణం పోసేవాడు అచ్చగా కథకుడూ, డైరెక్టరూ, తదితరులూ కాక కెమెరామాన్ కూడా నని ఈ సన్నివేశం చాలా గట్టిగా నిరూపిస్తున్నది.

సెటింగులు ఏమాత్రమూ భావయుక్తంగా లేవు కొంపెసాని ఇల్లు యంత్రాలు ఇంకా అమర్చని ఫాక్టరీలాగా ఉంది. సుందరి విహారించే ఉద్యానవనం గాని, మాంత్రికుడి ఇల్లు గాని ఉండదగినంత ఆకర్షవంతంగానూ, భావస్ఫోరకంగానూ లేవు.

పాటలు చాలావరకు అనుకరణలు. అవి కూడా పూర్తిగా బాగున్న వనటానికి లేదు. నాలుగురోజులపాటు చెవిలో మెదిలేపాట ఒక్కటే లేదు. వరలక్ష్మి పాడిన పాటల్లో ఒక్కటిమాత్రం చాలా నింపుగా పాడింది. అంజలీదేవికి ప్లేబాక్ పాడిన పాటలు మామూలు ధోరణిలోనే ఉన్నాయి బాక్ గ్రౌండ్ సంగీతంలో ప్రత్యేక విశిష్టత లేదు.

నటనలో ముక్కామల చాలా దర్పంగానూ, సమర్థతతోనూ నటించాడు. అంజలీదేవీ, నాగేశ్వరరావూ, వరలక్ష్మి తమ సహజధోరణిలో నటించారు.

శివరావుహాస్యం ఈ చిత్రంలో ఒక విచిత్రమైన ప్రయోజనం సాధించింది. అదేమిటంటే ఎదురుగా కనిపించేది కళాసృష్టి కల్పనా అని విశ్వసించటానికి బాధపడే ప్రేక్షకుడికి, "ఇదంతా కృత్రిమం, నటన," అని శివరావుజ్ఞాపకం చేసి ప్రేక్షకులను అనునయిస్తూ వచ్చాడు శివరావుకుపట్టీగాధన్యవాదాలర్పించవలసిఉన్నది.

అంజలీదేవి చేసిన డాన్సులు కంటికి చాలా మనోజ్ఞంగా ఉన్నాయి. అకుపసరు పిండే ఆవిడ సంఘటనా, ఆ ఆకును అబ్బి వృధాచేసుకునే సంఘటననూ ఎత్తేసి ఇంకా నాలుగు డాన్సులు అంజలీదేవిచేత చెయించుకున్నా ప్రేక్షకులకు కొంత గిట్టుబాటుగా ఉండేది

★★

# శ్రీ నాగయ్యగారితో గోష్ఠి

శ్రీ సూరిశెట్టి సాంబశివరావ్ బాల్జీ

మద్రాసులో వున్న యే ఫిల్ము కంపెనీ ఆఫీసు కెళ్ళినా మనకి నే వక్షోజాల తారల చిత్రాలో — యే సినీమా ప్రేమసన్నివేశాలో యెదురవుతాయి. కాని నాగయ్యగారి రేణుకా పిక్చర్సు ఆఫీసుకెళ్ళి చూసేటప్పటికి నా అంతట నాకే ఆశ్చర్యం కలిగింది. ఒక్క సినీమాతార ఫోటోవాసనకూడా లేదంటే నమ్మండి. శ్రీరామచంద్రమూర్తి, త్యాగయ్య, సాయిబాబా, రమణమహర్షి,- యివే చిత్రాలు; — అప్పుడే నాగయ్య యింకా సత్యకాలంనాటి మనిషేనని నిర్ధారణ చేసుకున్నా. మమ్మల్ని చూసీ చూడగానే ఆయన పాపం యెంతో ముచ్చటపడి గౌరవించారు.

కాసేపు ఖులాసాగా యేవో క్షేమ సమాచారాలన్నీ చెప్పుకున్న మీదట — కాసిని శీతలపానీయాలు కడుపులో కెళ్ళేక నెమ్మదిగా నేనే చాలా సమస్యల్ని లేవదీశాను. ఆయన అన్నిటికీ ఓపిగ్గా — చిరునవ్వుతో సమాధానా లివ్వటం ప్రారంభించారు.

“యేమండీ, త్యాగయ్య తర్వాత మీ రేణుకా పిక్చర్సు చిత్రం ఒక్కటీ రాలేదే. కారణం?” అని మొదలెట్టాను.

అప్పు డాయన యెందుకో కొంచెం మనసు నొచ్చుకుని “అవునండీ, దేశానికి త్యాగయ్యలాంటి చిత్రాలక్కర్లేదు. కుచాలూ తొడలూ ప్రదర్శించే చిత్రాలయితే జనం వారాల తరబడిని యెగబడి చూస్తారు. మేం ఒక స్టాండర్డు యిదివరకే యేర్పాటు చేసుకున్నాం. ఉత్తమచిత్రాలు తీయాలనుకుంటే డిస్ట్రిబ్యూటర్లు రామంటారు. డబ్బు అసలే యివ్వమంటారు. అందుకే త్యాగయ్య తర్వాత యే చిత్రమూ తీయలేదు. తలా తోకా లేకుండా నాలుగు ట్రిక్కులు చూపించే చిత్రాలకే దేశంలో బాగా డబ్బొస్తుంది” అన్నారు.

“అయితే ప్రస్తుతం డజన్లకొద్దీ తయారవుతున్న జానపద చిత్రాలగురించి మీ అభిప్రాయం?” అన్నాను మళ్ళా కదలదీసి.

“యిప్పుడే చెప్పానుగా! — యింతకన్నా యింకేం చెప్పేది? — నే నేదో డబ్బుచేసుకోలేక పోయినా నా సోదరులేనా కాస్త సంపాయించుకుని హాయిగా వున్నందుకు నాకు చాలా సంతోషం. జానపద చిత్రాల్నే ప్రజలు మెచ్చుకుని లక్షలు లక్షలు కురిపిస్తుంటే నా అభిప్రాయం యేం చేస్తుందండీ?” అన్నా రాయన—



‘ఏళై పడుం పాడు’లో కష్టజీవి కందన్ భూమికను ప్రతిభావంతంగా నిర్వహించిన వి. నాగయ్య.

“అయితే యిప్పట్లో యే చిత్రమూ తీయదలచుకోలేదన్నమాట”

“తీయదలచుకున్నా, మంచిరోజులొచ్చేక. అయితే యెలాంటి చిత్రం తీయాలా అనేదే యిప్పట్లో పెద్ద సమస్య. ఈ రోజుల్లో యేవిధంగానైనా డబ్బు సంపాయించగలిగేవాడే బుద్ధిమంతుడు. వాడికే గౌరవం! — కళకీ, విద్యకీ గౌరవం సున్నా. యిన్నాళ్ల స్వానుభవంలో యిదే నేను నేర్చుకున్నాను. కళారాధనకూ కళోపాసకులకూ యెంతెంతో డబ్బు పోశాను. ఇంతవరకూ నాకు డబ్బంటే యేమిటోలా వుండేది. ఇప్పుడు డబ్బు సంపాయించటం యెలాగో నేర్చుకుంటున్నా”

ఆయన మొహంలో ఓరకం విసుగుబాటు గోచరించింది—

“ఇప్పుడు మీరే యేచిత్రాల్లో నటిస్తున్నారు?” అన్నాను మళ్ళా—

“ఒకే ఒక చిత్రం. పక్షిరాజా వారి ‘బీదల పాట్లు’ అరవంలోనూ, తెలుగులోనూ కూడా.”

“మన తెలుగు జానపదచిత్రాల్లో మీ రెక్కడా కనిపించ రేమండీ?”

"జానపద చిత్రాలకి నన్ను పిలిచేవారూ లేరు. నాకు పోర్షన్లు అసలే లేవు"

"మీ రేదో రామకృష్ణ పరమహంసజీవితం హిందీలోనూ – తెలుగులోనూ చిత్రంగా తీసేందుకు బిర్లాతో మంతనాలు జరుపుతున్నట్టు అమధ్య అనుకున్నారు గదా! అది నిజమేనాండీ?"—

"అబ్బె, అదేమీ లేదు. త్యాగయ్య తర్వాత 'రామకృష్ణ పరమహంస' తెలుగులో, హిందీలో తియ్యాలని కొంతమంది మధ్యవర్తులు నన్ను ప్రోత్సహించి అందుకోసం బిర్లాదగ్గిర్నుంచి లక్షలు లక్షలు కావాలంటే తెస్తామని నన్ను ప్రోత్సహించారు. బిర్లా రెండో కొడుకు నాకు చాలా స్నేహితుడు. అయినా యీ సంగతి మాత్రం నేనెవరిదగ్గిరా కదపలేదు. నన్ను ప్రోత్సహించిన మధ్యవర్తులంతా పరమహంస చిత్రంతోటూకు విషయమంతా బాగా పరిశీలించి రామక్రిష్ణదైవ కార్యాలకి నా చేత విరాళాలిప్పించి ఖర్చుపెట్టించి ఆఖరికి తప్పుకున్నారు. ఓహో, యిదేగదా ప్రపంచం అనుకున్నాను. యేమయినా నా టయిం బాగులేనప్పుడు యింకోళ్లంటే యేం లాభం అని వూరుకున్నా. నాకసలు బిర్లాని తెలియనే తెలీదు. మధ్యలో కొందరు చేసిన తతంగం మాత్రమే. నాదగ్గిరకే చాలామంది ప్రొడ్యూసర్లు మంచి మంచి చిత్రాలు తీయమంటూ, అందుకయే పెట్టుబడి పెట్టగలమంటూ వచ్చారు. కాని వాళ్లందర్నీ నిరుత్సాహపరిచి పంపించేశాను"

"అన్నట్టు మీ రీమధ్య 'కుమ్మరి మొల్ల' తీస్తున్నట్టు విన్నాం!"

"అవునండీ. ఇది యేన్నాళ్ల క్రిందటో తీయాల్సి వుండిన చిత్రం. అయితే కొన్ని కారణాలవల్ల ఆగిపోయింది. యం. ఆర్. యే. క్రిష్ణవేణమ్మగారి అధ్వర్యాన తయారవుతూంది. మొన్న విజయదశమినాడే యీ చిత్రానికి ప్రారంభోత్సవం జరిపించాం."

"మీరీ చలనచిత్రరంగంలోకసలు యెలా వచ్చారండీ?"

"అదంతా చాలా పెద్ద గాథవుంది లెండి. నాకు చిన్నతనంనించి సంగీతం అంటే యెంతో ప్రీతి. నేను చదువుకునే యెలిమెంటరీస్కూల్లో రకరకాల నాటకాలలో ఆడేవాణ్ని. సంగీతంలో నాకున్న ఆసక్తిని కనిపెట్టి మానాన్నగారు మంచి గురువుని తీసుకొచ్చారు. స్కూలు నాటకాల్లో నా కర్ణాటక—హిందీ సంగీతాన్ని విని ప్రతివారికీ ఆశ్చర్యం కలిగింది. కాలేజీచదువు పూర్తి చేసుకుని చిత్తూరులో ఉద్యోగం. అప్పుడే రామవిలాస్ సభలో వుంటూ యడవల్లి సూర్యనారాయణ మొదలైన వారందరితో తిరిగి నాటకాలలో ముఖ్య పాత్రలు వేసేవాణ్ని. స్కూలు విద్యార్థులందర్నీ నాటకరంగంలో బాగా తర్ఫీదు చేసేవాణ్ని. యిలా వుంటూండగా కష్టాలు తామరతంపరగా మాయింట్లో తాండవం చేశాయి. ఒకే యేడాదిలో మా నాన్నగారు, భార్య, పసిపిల్ల యీ ప్రపంచం విడిచి వెళ్లిపోయారు. అప్పట్నుంచి నా జీవితంలో దుఃఖం అనేది ప్రవేశించింది. వెంటనే ఉద్యోగానికి రాజీనామా యిచ్చేశాను. తల్లీ, తమ్ముణ్నీ వొదిలిపెట్టి పిచ్చివాడికన్నా అధ్వాన్నంగా తయారై రమణమహర్షులవారి ఆశ్రమంలో పదిహేను రోజులపాటు గడిపాను. మహర్షి నన్ను చూసి జాలిపడి నా కళ్లవేపు తీక్షణంగా చూసి నువ్వు యిక్కడుండటే కాదు. నువ్వు చెయ్యాల్సిన కార్యక్రమాలు చాలా వున్నాయి అంటూ ఆశీర్వదించి పంపించారు. అలా తిన్నగా మద్రాసులో చేరుకున్నాను. కొంతమంది నా స్నేహితులు నా చేత H. M. V. వారి రికార్డుల్లో పాటలవీ ఇప్పించారు. అయినా నేను మతిచలించిపోయి తిరగటం ప్రారంభించాను. అప్పుడు నాగేశ్వరరావు పంతులుగారు నేను కాలేజీలదగ్గిర పిచ్చివాడిలా తిరగటం చూసి నన్నాదరించి ఆశ్రయం కల్పించి మంచి మంచి గుడ్డలవీ యిచ్చారు. రోజూ సినీమాకి పంపించేవారు. నువ్వు మంచి కళారాధకుడివి నాయనా, పూర్వజన్మలో కళాదేవి నిన్ను వరించింది అంటూండేవా రాయన నన్ను చూసి. ఒకనాడు పార్కులో నా జీవితసమస్యల్ని సింహావలోకనం గావించుకుంటూ విచారంగా పడివుండగా అప్పట్లో క్రొత్తగా స్థాపించబడిన రోహిణీఫిల్మ్సులో ఓ భాగస్థుడొచ్చి నన్ను గురించి పలకరించి 'గృహలక్ష్మి' లో గోపీ పాత్ర వేసేందుకు రమ్మన్నారు. నేను 'అలాగే' అన్నాను. తర్వాత బి. యన్. రెడ్డిగారితో పరిచయమయింది. ఆయన కూడా నన్నొక తమ్ముడిలాగా చూసుకుని వాహినీ పిక్చర్సులోకి తీసుకున్నారు. యీనాడు కూడా ఆయనంటే నాకు గౌరవం, నేనంటే ఆయనికి వాత్సల్యం వుంది. తర్వాత నా ఫిల్మ్జీవితం మీ కందరికీ తెలిసిందే!

నా చిన్నతనంలో రకరకాల గండాలన్నీ దాటుకుంటూ వొచ్చానంటే నమ్మండి. నా కెప్పుడూ కష్టాలెలా వుంటాయో చూడాలనిపించే దప్పట్లో. నేను రోజూ అరుగుమీద పడుకునేవాణ్ని. కాని మా నాన్నగారు వొద్దురా, పడిశెం పడుతుంది. పరుపుమీద పడుకోమని దెబ్బలాడినా, సరే చూద్దాం యేం చేస్తుందో అని పట్టుదలకోసం అరుగుమీదనే పడుకునేవాణ్ణి. యిలాంటివే యెన్నెన్నో మొండిపనులు చేసేవాణ్ణి"

"మీ రెంతవరకు చదువుకున్నారండీ?"

"బి. యే. వరకు"

"సినీమాజీవితంలో మీ అనుభవాలు చెప్తారా?"

"నా సినీమాజీవితంలో ఆర్టిస్టుగా, సంగీతదర్శకుడిగా, దర్శకుడిగా, ప్రొడ్యూసరుగా నా కనుభవం వుంది, అవన్నీ రాస్తే ఓ పెద్ద గ్రంథం అవుతుందేమో! యెప్పటికైనా అవన్నీ పుస్తకరూపాన బయటపెట్టి క్రొత్తగా వచ్చేవారందరికీ మార్గదర్శకంగా వుండేట్టు చేస్తాను లెండి."

"ప్రస్తుతం తెలుగు సినీమా క్షేత్రంలో కళోపాసకులైన నటీనటులెవరేనా వున్నారా మీదృష్టిలో?"

"ఇది చాలా క్లిష్టమైన సమస్య. వున్నారు. లేరనటానికి వీల్లేదు. వారి వారి నటనాప్రభావాన్ని చూసి ప్రజలంతా ఆదరిస్తున్నప్పుడు దాంట్లో కళలేకుండాపోదుగా! అయినా కాలాన్నిబట్టి వారి విధానం మార్చుకొన్నారనుకోండి. అందరికీ కళమీద గౌరవం వుంది."

"మీ అభిమాననటీనటు లెవరెవరండీ?"

"అందరూ అభిమానులే. యే చిత్రం చూసినా విజయవంతంగా నటించేవాళ్లందరూ నాకు అభిమాన నటీనటులే."

"ఈరోజుల్లో ప్రజలకి యెలాంటి చిత్రాలవసరమో తెలియజేస్తారా?"

"జానపదచిత్రాలే ప్రజలకి కావాలనీ, అవే తియ్యాలనీ అనుకుంటే అందుకు నేను పూర్తిగా వ్యతిరేకిని. ప్రజలకి విజ్ఞానం కలిగించే చిత్రాలూ, ఉత్తమ చిత్రాలూ తీస్తే డబ్బురాదంటే అది చాలా తెలివితక్కువ. దిన్నే చీప్ టేస్టు అంటారు. మనము పూర్వం యుద్ధపు రోజుల్లో ఒకటో నెంబరు బియ్యం తినేవాళ్లం. ఇప్పుడు మంచి బియ్యం రావటంలేదు. అయితే మంచివి కావని తినటం మానేస్తున్నామా? ఎంత గుర్రాలకేసే బియ్యమైనా తినటంమాత్రం మానలేదు గదా! అదే మోస్తరుగా తిండీ గుడ్డల్తోబాటు వినోదమూ అంతే. అంచేత మనం పుచ్చిపోయిన బియ్యమైనా ఎలా వాటితోనే కడుపు నింపుకుంటున్నామో అలాగే సినీమాలభిరుచి వున్న ప్రతివారూ ఎలాంటి చిత్రమైనా వెళ్లి చూస్తుంటారు. ముసలివాళ్లయితేనేమి - యువకులైతేనేమి

మన సంఘాన్ని సంస్కరించే చిత్రాలు తప్పకుండా చూసి ఆనందిస్తారు.

అలా కాకుండా ప్రజాసామాన్యానికి యీ రకం చిత్రాలే నచ్చుతుందంటూ శాసించిపెట్టడం నిజంగా మోసమే అంటాను. ప్రజలేం చెయ్యగలరు? పాపం చాలా అమాయకులు. విచారంగా వుంటే అయ్యయ్యో అంటారు. కోపంగా వుంటే రౌద్రం చూపిస్తారు. అలాంటి అమాయక ప్రజలకి మంచిపాటలూ, సంగీతమూ, వినిపిస్తే బూతుల్లేని మంచి-చిత్రాలు చూపిస్తే ఎందుకు మెచ్చుకోరంటాను. త్యాగయ్య, చక్రధారి, పోతనలాంటి చిత్రాలకి డబ్బు రాలేదా? అయితే ఆ బూతుల చిత్రాలకే బాగా డబ్బొస్తుందండీ అంటారేమో! నిజమే. తయారయేవి బండబూతుల చిత్రాలైనా వేరే చిత్రాలు లేవు. కాబట్టి ప్రజలు వాటినే వెళ్లి చూడాల్సివస్తోంది. ప్రజలు దేవతలు, అమాయకులు. నేను ప్రజల్ని పూజిస్తాను. అందుకే యే సోదరుడు గాని, యే సోదరిగాని వుత్తరం రాసినా నేను తప్పిపోకుండా జవాబిస్తాను. ప్రజలు మనల్ని పోషిస్తున్నారు. వాళ్లకి తెలిజేస్తే సంతోషిస్తారు. లేదంటే పాడవుతారు. పెళ్లాం, పిల్లలతో బళ్లు కట్టించుకుని అమాయక ప్రజలు గ్రామ గ్రామాలనించి సినీమాలకొచ్చి యేం నేర్చుకుంటారు? ముద్దులూ, గుద్దులూ, గెంతులూ యింతకి తప్పించి యింకొకటి లేదు. అందుకే ప్రభుత్వం దీనిపట్ల శ్రద్ధ తీసుకోవాలి. అలా అయితే ఒక వేపు యెందరెందరికో నిరుద్యోగబాధ తీరినట్టవుతుంది. మరో వేపు పూర్వజన్మసుకృతిమైనవారి తాలూకు యీ శాపజ్ఞానాన్ని పెంపొందించుకుందుకి అవకాశాలు లభిస్తాయి. ఇది గవర్నమెంటు పూనుకోవాల్సిన కార్యం. వ్యాపారం ద్రోహచింతనం అన్నారు. ప్రజలందరికీ కావలసిన చిత్రమే తియ్యాలి. లేదంటే నిషేధించబడ్తుందేమో అనే తలంపు ఫిలిం సంస్థలవారికి కలిగేట్టు ప్రభుత్వం చూడాలి. స్వాతంత్ర్యం వచ్చిందన్నమాటే గాని యేమొచ్చింది? మనదేశాన్ని, మన ప్రజల్ని కాపాడుకోవాలంటే, ఆ జ్ఞానం - ఆ వుద్రేకం - ఆ ధ్యానం కలిగే చిత్రాల్నే కదా యివ్వాలి. ప్రజలదగ్గిర్నుంచి డబ్బు తీసుకుంటున్నా మంచి చిత్రాలు యివ్వటం లేదు. ఇదే యీనాటి సినీమాపరిశ్రమలో విశేషం."

"ప్రభుత్వమే యీ చిత్రపరిశ్రమని జాతీయంచేసి నడిపించటంపట్ల మీ వుద్దేశం ఏమిటి?"

"ఈ పరిశ్రమ జాతీయం చేసినప్పటికీ, వ్యవసాయిక పరికరాల సహకార సంఘాలకీ, చేనేతపనివారి సొసైటీలకీ అడ్వాన్సు లిస్తున్నట్టుగానే ప్రభుత్వం ఆదర్శాలు గలిగిన మంచి ప్రొడ్యూసర్లని కూటమిగా చేర్చి వారిచేత మంచి మంచి కథలు యెంచి తీయించి పెట్టుబడి పెట్టి నిర్మాణం గావించాలి. అప్పుడు వేరే సెన్సారుబోర్డు వుండాల్సిన అవసరం లేనేలేదు. అంతే కాకుండా దానివల్ల ప్రభుత్వానికి లాభాలుకూడా వస్తాయి."

"త్యాగయ్య చిత్రాన్ని అంతర్జాతీయ చిత్ర ప్రదర్శనకి పంపించలేదేమండీ?"

"అవునండీ, మాస్కోలో వున్న మన రాయబారి శ్రీరాధాకృష్ణన్ గారు తీసుకు రమ్మన్నారు. దాన్ని కొంత మళ్లా ఎడిట్ చేసి యీ సారి పంపించుదామనుకుంటున్నా. పాశ్చాత్యులకి మనసంగీతమంటే చాలా యిష్టం. మంచిరోజులొచ్చేక వేమన, పోతనల్ని కూడా పంపించాలనుంది."

"మీరిప్పటికి నటించిన చిత్రాల్లో దేంట్లో మీ నటన సంతృప్తికరంగా వుందండీ?"

"ఇప్పటికెప్పుడే నేను ఓ పాతిక చిత్రాల్లో నటించి వుంటాను. కాని నాకు సంతృప్తి అనేమాట లేనేలేదు. ఇంకా నేను చెయ్యాల్సింది చాలా వుందని నా వుద్దేశం. నాకు లభించినవన్నీ మంచి పాత్రలే అయినందుకెంతో సంతోషిస్తున్నా."

"పిల్లల ఫిల్ములేవేనా తీసేందుకి సంకల్పించుకున్నారా?"

"అవునండీ. నేనూ అందుకే కృషి చేస్తున్నా. పంచతంత్రంలో వుండేలాంటి కథలు తీసి చిన్న చిన్న పిల్లలచేత ముద్దు ముద్దుగా ఆడించి పెద్దవాళ్లకిసైతం బుద్ధి వచ్చేట్టు చెయ్యాలనుంది. అలాంటి పసిపిల్లల లేతమెదళ్లకి బూతుల పురాణాలు చూపిస్తే పాపం వాళ్లు యేం అభివృద్ధి చెందగలరు చెప్పండీ! మన భారతదేశంలో యీనాడు యీ మాత్రమేనా అన్నం తినగలుగుతున్నామంటే మన భారత స్త్రీల నైతిక సంపద అడుగంటిపోలేదు గనక! అలాంటి పవిత్రమైన స్త్రీలని తీసుకెళ్లి బూతుల పురాణాలు చూపిస్తే యిక దేశం బాగుపడే దెట్లా? ఇలాంటి చెడ్డచిత్రాలు చూసి యెంతమంది కాలేజీ అమ్మాయిలూ, సంసారులూ పాడవుతున్నారో మనం కళ్లారా చూస్తున్నాం గదా!"

"మరోక చిన్న సందేహం తెలుగు ప్రజలందర్నీ పీకుతూంటోందండీ. ఇంతటి కళావిశిష్టత గలిగిన మీరు అరవచిత్రాల్లో నటించి మీ కళంతట్నీ వాటికోసం యెందుకు వ్యయం చేస్తున్నారనేది; కోపగించుకోకండీ యిలా సూటిగా అడిగేనని"

"ఎందుకు కోపం, వున్నమాటడిగారు. నేనీనాడు అరవచిత్రాల్లో నటిస్తున్నానూ అంటే అది డబ్బుకోసమే! ఈ వేళ ఆదర్శప్రాయమైన ఒక ఆంధ్రసంస్థ దిట్టమైన పెట్టుబడితో ముందికి రమ్మనండీ. నేను యే చిత్రాలకీ పోయేదిలేదు. యెవరో ఒకర్ని అందుకు పూనుకోమనండి. చిత్రాలకి నష్టంరాకుండా వుండే పూచీ నాది. యింకా నేను పల్లెపల్లెకూపోయి ప్రతీ వూరూ వెళ్లి నిధిని పోగుచేసి, నటనాభిలాషులందర్నీ సమీకరించి మన వాళ్లూ, మన తెలుగు చిత్రపరిశ్రమా బాగుండేట్టు చెయ్యాలనే హృదయావేదన యేనాటినుంచో వుంది. కాని అశక్తుడిగా పడున్నాను."

"మీకు వేదాంతంలో గూడా ప్రవేశం వుందనుకుంటా. ప్రస్తుత ప్రపంచపరిస్థితుల్ని బట్టి యీనాడు సత్యానికీ, ధర్మానికీ తావు లేదు. యెటు చూసినా మాయ, మోసం, కుట్రలూ, కుతంత్రాలేగాని న్యాయంగా వ్యవహరించేవారికి కడుపుకి తిండికి గూడా లేకుండాపోతోంది. యీ అధర్మం యింకా యెన్నాళ్లండీ?"

"నిజమే. ఇవన్నీ కలియుగాంతానికేనండీ. వీటన్నిటివల్లా భూభారం యెక్కువైపోతూంది. ప్రజలు ప్రజల్నే నరుక్కోవటం, అన్యాయం అధర్మం ప్రబలిపోవటం, యుద్ధాలపై యుద్ధాలూ, ఆటంబాంబుల పైని హైడ్రోజన్ బాంబులూ, ఇవన్నీ వినాశనానికే! పెరుగుట విరుగుటకొరకేనని మన పెద్దలు చెప్పారు. ఈ అన్యాయాలు పెచ్చుపెరిగిపోవటం అంతా ప్రపంచనాశనానికేనని చెప్పాలి. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పినట్టు యెవరో అవతరించి ప్రపంచాన్ని సవ్యమార్గాన్ని నడిపిస్తారు. అది యిమ్మాటికీ అసత్యం కాదు. అయినా యీనాటి నవనాగరిక ప్రపంచం దాన్ని అంగీకరించదనుకోండి. యేదెలా వున్నా యీలోకం సర్వనాశనానికి చాలా వేగంగా దారి తీస్తూందనేందుకి అనుమానం లేదు" అన్నారాయన. ★★



# బొమ్మరిల్లు

బాలగేయం:

## రావోయి, చందమామ!

రాజశ్రీ

రావోయి చందమామ!
ఈల
రావోయి చందమామ!
వేగ
రావోయి చందమామ!
పాపాయి నిను చూసి
బహు సంతసించింది.
లే నవ్వు నవ్వింది,
క్రిందికే దిగమంది.
నువ్వు లేకుంటేను
బువ్వ నే తిననంది. "రావోయి"

నీ కాంతి కిరణాల
లోకాలు మెరిశాయి.
చుక్కలే నిను జేరి
చక్కగా కొలిచాయి.
కలువ పూగుంపులే
కిలకిలా నవ్వాయి. "రావోయి"

ఆకాశ సరసిలో
అందాల హంసవో?
చీకట్ల నోడించు
లోకాల రాజువో.?
రావోయి, రావోయి,
రాకాసుధాకరా! రావోయి




# ఏడు గుఱ్ఱాల కథ

పూర్వ మొక ఊళ్లో ఒకబీద వాడుండే వాడు. అతనికి చేతి కంది వచ్చిన కొడుకులు ముగ్గురు వున్నా తిండికి గడవటం కూడా కష్టముగా వుండేది.

ఒకనాడు వారి ముగ్గురిలో పెద్ద వాడు తన పొట్టకు తాను సంపాదించుకుంటానని తలి దండ్రులతో చెప్పి దేశాంతరం బయలుదేరాడు. ఉత్తర దిక్కుగా పగలంతా నడచి నడిచి, చీకటి పడుతూన్న సమయానికల్లా ఒక నగరం చేరుకున్నాడు. నగరంలో కోటముందు వ్రేలగట్టిన రాజశాసన మొకటి అతని కంట బడింది. "ఎవరైతే నా ఏడు గుఱ్ఱములను ఒక రోజంతా కావలి కాసి మేపి, అవి ఏం తిన్నదీ? ఏం త్రాగిందీ? సరిగ్గా చెప్పగలరో వారికి నా కుమార్తె నిచ్చి వివాహం చేసి, అర్ధ రాజ్యమిచ్చి పట్టాభిషేకం చేస్తాను. ఎవరా విషయం చెప్పలేరో వారి వీపుపై చర్మం ఒలిపించి, ఉప్పు కారం పెట్టించి పంపుతాను. ఇందుకు అంగీకరించిన వారు కోటగుమ్మం వద్దనున్న జేగంట కొట్టవచ్చు" నని అక్కడ రాసి వున్నది.

"చిత్రసేన"

అతడా శాసనం చదువుకుని "ఓస్ ఇదేమంత కష్టమైన పని?" అనుకుని కోట గంట మ్రోగించాడు. రాజుగారి యెదుట హాజరై తను శాసనం ప్రకారం చెయ్యగలనని ధీమాగా చెప్పాడు. రాజుగారు అందుకు ఒప్పుకున్నారు. ఆ మర్నాటి ఉదయం రాజుగారి గుఱ్ఱాలశాలనుంచి యీఏడుగుఱ్ఱాలని విడిచిపెట్టారు. అవి కోట గుమ్మం దాటగానే పరుగెత్తటం మొదలు పెట్టినై. ఈ కుఱ్ఱవాడు కూడా వాటి వెనకాల పరుగెత్తటం మొదలుపెట్టాడు. అవి చెట్టనక, పుట్టనక, వాగనక, వరదనక, దౌడుతీస్తున్నాయి. ఈ కుఱ్ఱవాడు కూడా వాటి వెంబడి పరుగెత్తుతూ పోతూ అలసిపోయాడు.



వాడిలా కొంత దూరం పోయేసరికి ఒక చెట్టునీడను నూలు వడుకుతూ కూర్చున్న ఒక అవ్వ కనబడింది. "ఇలా రా నాయనా! అలసిపోయావు. కొంత సేపు కూర్చుని అలసటయినా తీర్చుకునిపోదువుగానని కేక వేసింది. అలసిపోయిన ఆకుర్రవాడు అవ్వవద్దకు పోయి చదికిలబడ్డాడు. అచ్చటనే ఆమె వడిలో చేరబడి అలసటచేత పడుకుండిపోయాడు.

ఇంతలో సాయంత్రమై పోయింది. అతను తిరిగి పోవటానికి ఆరాట పడ్డాడు. రాజుగారి గుఱ్ఱాలు చీకటి పడగానే తిరిగి యిటే వస్తాయి. ఇంతవరకూ అతనెక్కడ వున్నదీ రాజుకేం తెలుస్తుంది? తాను మేపాడనే అనుకుంటారు కదా అని అవి తిరిగి వచ్చేటంతవరకూ అక్కడే ఉన్నాడు. గుఱ్ఱాలు తిరిగి వస్తూ ఉండటం చూడగానే అవ్వ యిచ్చిన తాబేటి కాయలో నీళ్లు, ఇంత పచ్చగడ్డీ తీసుకుని వాటి వెంబడి కోటకు చేరుకున్నాడు.

ఆతను కోటకు చేరుకోగానే, ఆతని రాకకు ఎదురు చూస్తున్న రాజు "నువ్వు రోజంతా వీటికి జాగ్రత్తగా కావలి ఉన్నావా?" "అన్నాడు.

"బహు జాగ్రత్తగా కాసి మేపాను. ఇదిగో యీ నీరు త్రాగి, యీ గడ్డి తిన్నవని అవ్వ తనకిచ్చిన ఆ తాబేటి కాయ, ఆ గుప్పెడు గడ్డి పరకలు రాజుముందు పెట్టాడు.

రాజుగారు అవి చూచి మండిపడ్డాడు. నౌకర్లను పిలచి, "యీతని వీపుపై చర్మం ఒలిచి ఉప్పు, కారం పూసి వచ్చిన త్రోవను పంపండని ఆజ్ఞాపించాడు.

అత నిలా యింటికి చేరుకుని, ఎప్పుడూ దేశాంతరం వెళ్లకూడదని బుద్ధి తెచ్చుకున్నాడు.

## 2

ఆ మర్నాడు బీదవాని రెండవ కుమారుడు కూడా దేశాంతరం బయలుదేరాడు. వద్దు నాయనా! అన్నయ్యవీపు చూచావా? ఎలా అయిపోయిందో" అని తలిదండ్రులు చెప్పినా వారిమాటలు వినక, బయలుదేరాడు.

ఆతని అన్న వలెనే ఉత్తర దిక్కుగా బయలుదేరి సాయంత్రానికల్లా అదే రాజభవనం ముందుకు చేరుకున్నాడు. అతనా శాసనం చూసి, గంట వాయించాడు. వెనకటిమాదిరిగానే ఆ ఏడు గుఱ్ఱాలూ ఒక దోవ, తన్నూ లేకుండా పరుగెత్తడం, అవ్వవద్ద పడి నిద్రపోవడం, రాజుగారికి సరియైన జబాబు చెప్పలేక పోవటం, వీపు చర్మం వొలిపించుకుని యింటికి చేరుకోవడం జరిగింది.

బీదవాని మూడవ కొడుకు తన యిద్దరి అన్నల సంగతిని వినేసరికి ఇందులో ఏదో రహస్యం వుంది; అనేదో తాను ప్రయత్నించి సాధించాలని నిశ్చయించాడు. తల్లిదండ్రులూ, అన్నలూ ఎంత వద్దని చెప్పినా వినక బయలుదేరాడు. పగలంతా నడచి నడచి ప్రొద్దు పోయేసరికల్లా ఆకోట గుమ్మం వద్దకు చేరుకుని గంట వాయించాడు.

వెంటనే రాజభటు డొకడు యితన్ని కోటలోనికి తీసుకుపోయి రాజుగారి ఎదుట హాజరుపరచాడు "నువ్వేనా గంట వాయించింది' అన్నాడు రాజు.

"చిత్తం. నేనే."

శాసనం జాగ్రత్తగా చదువుకున్నావా? ఆ గుఱ్ఱాలు ఏం మేసిందీ? ఏం త్రాగిందీ సరిగ్గా చెప్పలేకపోతే అనుభవించాల్సిన శిక్ష ఏమిటో తెలుసుకున్నావా?" అని రాజు హెచ్చరించాడు.

"అన్ని విషయాలు పూర్తిగా తెలుసుకునే ఇందుకు సిద్ధపడ్డాను." అన్నాడతడు. రాజుగారు చాలా హెచ్చరించినమీదట ఆ కుర్రవాణ్ణి ఆపనికి నియోగించాడు.

ఆ రాత్రంతా ఆలోచనలతో గడిపాడు ఆ కుర్రవాడు. ఇంకా తెలతెలవారుతూ ఉండగానే రాజభటులు ఏడు గుఱ్ఱములను విడచిపెట్టారు. కుర్రవాడు వాటి వెంబడినే పరుగుతీస్తున్నాడు. అవి శరవేగంతో పోతూన్నవి. ఇలా వాటి వెంబడి పోగాపోగా చెట్టునీడను నూలు వడుకుతూ కూర్చున్న ముసలమ్మ మామూలుగా యీ కుర్రవాణ్ణి చూడగానే, "రా నాయనా! రా! అలసట తీర్చుకుని పోవచ్చునని కేక వేసింది. ఈ కేక వినగానే, తన అన్నలు చెప్పిన ముసలమ్మ యీమెయే కామోలు ననుకుని, "నువ్వేరా మామ్మా!" అని తిరిగి కేక పెడుతూ ఒక చిన్న గుఱ్ఱపు తోకను గట్టిగా పట్టుకుని పరుగు తీస్తున్నాడు.

కొంతసేపటికి గుఱ్ఱపుపిల్ల "నా వీపుపై ఎక్కి కూర్చో! మనం ఇంకా

చాలా దూరం పోవాలి" అన్నది. "ఫీటికి మాట లెలా వచ్చినవా" అని తెల్లబోతూ, ఆ గుర్రముపై ఎక్కి స్వారి చేస్తూ పోతూన్నాడు.

అలా చాలా దూరం ప్రయాణం చేసిన తర్వాత, గుర్రాలు ఒక చెట్టుబోదెను సమీపించాయి. అలా చేరుకోగానే, అందులో ఒక పెద్ద గుఱ్ఱం ఆ బోదెను వెనక కాళ్లతో ఒక్క తన్ను తన్నింది. వెంటనే ఒక ద్వారం తెరుచుకుంది. అదొక చిన్న చీకటిగదిలా ఉంది. ఆ గదిలోనికి పోయి చూశాడు ఆ కుర్రవాడు. ఒక మూల గోడపై తుప్పు పట్టిన పెద్దకత్తి ఒకటి, దాని ప్రక్కగా వ్రేలాడుతున్న ఒక తోలుసంచీ కనబడినై.

"నువ్వు ఆ కత్తి త్రిప్పగలవా?" అన్న దొక గుఱ్ఱం.

అతను దానిని తీసి త్రిప్ప ప్రయత్నించాడు. కాని సాధ్యపడలేదు. ఆ సంచిలో ఏమున్నదో అని చూచాడు. దానినిండా చిక్కని ద్రాక్షరసం వుంది. అది ఒక్క గ్రుక్కెడు త్రాగేటప్పటికి జవసత్త్వలు వచ్చి సునాయాసంగా ఆ కత్తిని త్రిప్పగలిగాడు. అది చూసి సంతోషించిన ఆ గుఱ్ఱం అతనితో యీలా చెప్పటం మొదలుపెట్టింది.

"ఆ కత్తిని నీ మొలకు కట్టుకో. ఆ కత్తితోనే నీ వివాహంరోజున మా ఏడు శిరస్సుల్ని ఖండించవలసి ఉంది. అప్పుడు మేము ఎప్పటివలె రాజపుత్రులం కాగలం. నువ్వు పెళ్లి చేసుకోదలచిన రాజకుమార్తె యొక్క అన్నదమ్ములం మేము. ఒక మంత్రప్రయోగంచేత మేము యీ రూపంలో ఉన్నాము. మాకీ సహాయం చెయ్యాల్సిన బాధ్యతంతా నీది సుమా!" అన్నదా గుర్రం.

"అలానే తగు జాగ్రత్తతో నెరవేరుస్తా" నని అతడు వాగ్దానం చేయగానే వారంతా తిరిగి ముందుకు సాగిపోయి కొంతసేపటికి ఒక నదివద్దకు చేరుకున్నారు. ఆ నదిపై చక్కని ఒక వంతెన ఉంది. ఆ వంతెనమీదుగా వారు అవతల ఒడ్డుకు చేరుకుని, ఇంకా చాలా దూరం ప్రయాణం చేసిన తర్వాత ఒక పాడుపడిన కాళికాలయాన్ని చేరుకున్నారు. దేవాలయంలో అడుగు పెట్టగానే గుర్రాలన్నీ మనుష్యులుగా మారిపోయినై. ఆ విలువైన దుస్తులు, ఆ ఠీవి, వారి సౌందర్యం చూసి కుర్రవాడు ఆశ్చర్యపడ్డాడు.

వారలా మానవరూపధారులై దేవాలయంలో కాళికాదేవిని పూజిస్తున్న ఒక యోగివద్దకు పోయి నమస్కరిస్తూ నిలబడ్డారు.

కొంతసేపటికా యోగి కండ్లు తెరచి చూచి, యీ రాజకుమారులకు పాలు, ఫలాలు యిచ్చాడు. వారు ఆ ఫలాల్ని కడుపునిండా తిని, ఆ పాలు త్రాగారు. ఆ ప్రదేశంలో

ఫలవృక్షా లెక్కడా వెదకుదామన్నా లేవు. పశువులు అసలే లేవు. మరి యీపాలు, ఫలములు యోగికి యీ నిర్జనప్రదేశంలో ఎలా వచ్చినవో కుర్రవాడికి తెలియలేదు. ఏదో ఇదంతా మాయగా ఉన్న దాతనికి.

ఏది ఎలా వున్నా తన కర్తవ్యం తాను మరచిపోకుండా వారు త్రాగిన పాలను కొన్నింటిని ఆ తోలు సంచిలో పోసుకున్నాడు కొన్ని ఫలాల్ని మొలకు కట్టుకున్నాడు. ఆ యోగి వారి తలపై నిమురుతూ దీవించి పంపాడు. వారు దేవాలయంబయటికి రాగానే తిరిగి యథాప్రకారం గుఱ్ఱాలై పోయారు. అతడు వాటితోపాటు బయటకు వచ్చి, అన్నింటికన్నా చిన్న గుఱ్ఱంపై ఎక్కి ఎక్కడా ఆగకుండా, శరవేగంతో ఊళ్ళోకి చేరుకున్నారు. రాజుగారు ఎదురుగా వచ్చి, "గుఱ్ఱాలకు జాగ్రత్తగా కావలివుండి మేపుకువచ్చావా?" అని ప్రశ్నించాడు.

"జాగ్రత్తగానే కాసుకు వచ్చాను."


"అయితే నా ఏడు గుఱ్ఱాలు ఏం తిన్నవో, ఏం త్రాగినవో చెప్పగలవా?"

"పండ్లు తిని, పాలు త్రాగినై. ఇందుకు నిదర్శనం ఇవిగో" అంటూ తాను తెచ్చిన పాలసంచీ, పండ్లు రాజువద్ద వుంచాడు. ఈ మాటలు చెవిని బడేసరికి పరమసంతోషంతో అతన్ని కౌగలించుకున్నాడు.

వివాహానికి బ్రహ్మాండంగా యేర్పాటులు జరిగాయి. కుర్రవాని తలిదండ్రులకు, అన్నలకూ ఆహ్వానాలు వెళ్ళాయి. ఒకనాటి తెల్లవారు ఝామున వివాహం మహావైభవంగా జరిగిపోయింది. తరువాత గొప్ప విందు జరిగింది. విందు మధ్యలో హఠాత్తుగా ఏదో గుర్తుకు వచ్చి పెళ్ళికొడుకు గబగబా లేచిపోయాడు. వెంటనే గుఱ్ఱాలశాలకు బయలుదేరాడు. తన కత్తి తీసుకుని, కారణమేమిటో ఎవ్వరికీ తెలియదు. తలా ఒకరకంగా చెప్పుకోసాగారు.

అతడు సరాసరి గుఱ్ఱపు శాలకు పోయి, ఆ గుర్రాలు చెప్పినట్లుగా ఒక్కొక్క దాని తల నరికివేశాడు. ఏడు గుర్రాల శిరస్సులూ ఖండించటం పూర్తి అయేసరికి ఏడు గుఱ్ఱాలకూ మనుష్యరూపం తిరిగివచ్చి రాజకుమారులైపోయారు.

ఆ ఏడుగురు రాజకుమారులతో సహా వివాహవేదికలోనికి వచ్చాడు పెళ్ళికొడుకు. కుమారులను చూసి రాజు పరమానందభరితుడై అందర్నీ కౌగలించుకున్నాడు. ప్రజలూ, సభాసదులూ జరిగినదంతా తెలుసుకుని జయ జయ శబ్దాలు చేశారు. రాజకుమార్తె తన భర్తయొక్క ధైర్యసాహసాలనూ తన అన్నలను చూసి ఎంతో సంతోషపడింది. రాజు తన వాగ్దానప్రకారం అల్లుడికి సగం రాజ్యం యిచ్చాడు. అతడు తల్లిదండ్రులను, అన్నదమ్ములను తనవద్దనే ఉంచుకుని సుఖంగా రాజ్యం అనుభవించాడు.




కొత్తమ్మాయితో పోట్లాడి బయలుదేరిన టాం కాస్సేపు కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తచ్చాడి, స్కూలుకు తిరిగివచ్చే పిల్లలు ఎదురు పడకుండా ఊరి బైటకు వెళ్ళిపోయాడు. ఊరికి కొంచెం దూరముగా ఒక చిన్న కొండ వున్నది. ఆ కొండను కూడా దాటాడు.

చివరకి ఒక దట్టమైన అడవిలో ప్రవేశించాడు. మధ్యాహ్నపు ఎండవేడికి అడవిలో పక్షులన్నీ కొమ్మల నీడల్లోనే కదలకుండా కూచ్చున్నాయి. టాం మనస్సంతా దిగులుగా, బెంగగా వుంది. ఒక పెద్ద చెట్టునీడలో చతికిలపడి ఆలోచించుకున్నాడు. జీవితమనేది కష్టాలతో నిండిన పెద్ద జైలులాగా వుంది. ఈమధ్య చచ్చిపోయిన జిమ్మీ హాడ్జెస్ లాగా తనుకూడా చచ్చిపోతే! శ్మశానంలో భూమిలో పడుకుని అలాగే శాశ్వతంగా నిద్రపోతూ కలలు కంటూవుంటే ఎంత బావుంటుంది ? అయినా తను చేసిన పెద్ద తప్పు మాత్రం ఏముంది. ఆ కొత్తమ్మాయిని తను ఎంత ప్రేమించాడు! తనని కుక్కని తోసేసినట్టు తోసేసింది. కానీలే. ఎప్పటికైనా ఆ అమ్మాయికే తెలిసివస్తుంది. టాంలాంటి మంచి అబ్బాయిని తోసేసినందుకు ఆ అమ్మాయికి ఎప్పటికైనా విచారం కలక్కపోదు.

ఈవిధంగా టాం తన్ను తనే సముదాయించుకున్నాడు. మళ్ళీ ఇంకో ఆలోచన తట్టింది. తను ఇక ఇంటికి పోకుండా పారిపోతే? ఎక్కడికో దూరదేశాలకు పోయి వెనక్కి రాకుండావుంటే ఆ అమ్మాయి కెల్లా వుంటుంది ? ఉహూ. తను మిలిటరీలో చేరి యుద్ధాల్లో పోట్లాడి పెద్ద పేరు సంపాదించుకుని ఇంటికివస్తాడు. ఆ అమ్మాయి భలే పిల్లే. తనలాంటి గొప్పవాణ్ణి సర్కస్‌లో బఫూన్ వేషం వెయ్యమంది. ఛా, బఫూన్ వేషంలో ఏముంది, వెకిలి చేష్టలు తప్ప.

ఉహూ. తను ఏ కోయవాళ్లల్లోనో కలిసిపోయి, విలువిద్య, గుఱ్ఱపుస్వారీ నేర్చుకుంటాడు. చాల ఏళ్ళయింతరవాత గుర్రంమీద స్వారీచేస్తూ వచ్చి, స్కూల్లో తన శత్రువులనందర్నీ చెర్నాకోల్ పెట్టి బాదుతాడు. ఉహూ. ఇంతకంటే మంచి ఉపాయం వుంది. తను సముద్రపు దొంగ అవుతాడు. ఆ, అది! భలే ఉపాయం. ఒక పెద్ద ఓడ సంపాదించాలి. అందులో బోలెడు మంది దొంగల్ని చేర్చి సముద్రం మీద పోయే వర్తకుల ఓడల్ని కొల్లగొట్టాలి. తన పేరు ప్రపంచమంతా మోగిపోతుంది. తన పేరు చెప్పేటప్పటికి ఎంత గొప్పవాడికైనా గుండె తపీమని ఆగిపోవలసిందే. కొన్నేళ్ళ తరవాత మళ్ళీ తనవూరు వచ్చి చర్చికి వెడతాడు. నల్లటి తన దుస్తులు, బండబూట్లు, మొలకి చుట్టుకున్న బెల్టునిండా పిస్తోళ్లు, పొడుగాటి కత్తి—ఇదంతా చూసి అందరూ హడిలిపోయి "వాడే టామ్‌సాయర్, చాలా గొప్ప సముద్రపు దొంగ." అనుకుంటారు.

ఆ. ఇక తన ఉపాయం స్థిరపడినట్లే. ఇవ్వాల్టికి ఇంటికి వెళ్ళి రేపు చీకటితోనే బయల్దేరి పోవాలి. ఈలోగా తనకు కావలసిన సరం

జామా అంతా ఒకచోట దాచుకోవాలి.

టామ్ దగ్గిరలో వున్న ఒక కొయ్యదుంగవద్దకు వెళ్లాడు. దానికి లోపల అంతా డొల్ల. ఒకవేపు నుంచి టామ్ తన చాకుతో ఆ దుంగలో యిరుక్కున్న మట్టిని పెల్లగించాడు. కొంతసేపటికి డొల్ల కనిపించింది. అందులో చెయ్యిపెట్టి

"కొత్తవి రావాలి
పాతవి ఉండాలి."

అని మంత్రంలాగా కాసేపు జపం చేశాడు. చివరికి డొల్లలో చెయ్యిపెట్టి చాలాసేపు కెలికి ఒక గోలీకాయ తీశాడు.

"అరె, ఆశ్చర్యంగా వుందే." అనుకున్నాడు. ఆ గోలీని విసిరేసి, ఆవేశే చూస్తూనుంచున్నాడు.

అసలు సంగతేమిటంటే—ఒక గోలీకాయని ఎవరూ చూడకుండా ఒక చోట పాతిపెట్టాలి. ఊరికే పాతిపెడితే లాభం లేదు. కొన్ని మంత్రాలు చదవాలి. పదిహేను రోజులైన తరవాత మళ్లీ దాన్ని, ఇందాక టాం చదివిన మంత్రం చదివి తవ్విచూస్తే అక్కడ బోలెడు గోలీలుంటాయి. ఇదివరకు ఆటల్లో పారేసిన గోలీలన్నిటిని ఈ పాతిపెట్టిన గోలీకాయ వెళ్ళి లాక్కొస్తుంది. అని పిల్లలందరికీ పెద్ద నమ్మకం. దేనికైనా తిరుగు వుంటుందిగాని ఈ నమ్మకానికి తిరుగు లేదు. చచ్చినట్టు ఆ గోలీలన్నీ అక్కడికి రావలసిందే. కాని తీరా యిప్పుడు చూస్తే అక్కడ టాం పాతిపెట్టిన గోలీతప్ప మరేమీ లేవు. దీనితో టాం నమ్మకమంతా కూలిపోయింది. అసలు తన మంత్రం రైటు కాకుండా ఎవడో వెధవ విరుగుడుమంత్రం వేసివుంటాడు. వాడెవడో కనుక్కోవాలి.

పక్కనే యిసుకలో ఒక బుల్లి గొయ్యిలాంటిది వున్నది. దాని పక్కన చేతితో తట్టుతూ

"అల్లీ బిల్లీ తలుపు తియ్యి,
అల్లీ బిల్లీ నిజం చెప్పు."

అని రెండు సార్లు పాడాడు. కాని పిల్లెమ్మ బయటికి రాలేదు. ఊహూ. పిల్లెమ్మ చెప్పటానికి భయపడుతోంది. లాభం లేదు దాన్ని పిలిచి. పోనీ పారేసిన గోలీనైనా తెచ్చుకుందామనుకున్నాడు. దానికోసం తెగ వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. మళ్ళీ యిందాకటి కొయ్యదుంగవద్దకు వచ్చి తను ఎటువేపు నుంచుని పారేశాడో జ్ఞాపకం తెచ్చుకున్నాడు. ఆవేపుకే సూటిగా నడిచి వెళ్ళి వెదికాడు. ఎంత వెదికినా గోలీ దొరకలేదు. మళ్ళీ వెనక్కి వచ్చాడు. జేబులోనుంచి ఇంకో గోలీ తీసి,

"గోలీ! నువ్వు వెళ్ళి నీ తమ్ముణ్ణి పిలుచుకురా." అని దాన్ని విసిరేశాడు. అది ఎక్కడ పడిందో చూసి, అక్కడికి వెళ్ళాడు. తన్నా గొయ్యి, అదికూడా కనిపించలేదు. మళ్ళీ వెనక్కి వచ్చి ఇంకో గోలీ విసిరేశాడు. ఈ గోలీమాత్రం కనిపించింది. ఇందాకటి గోలీలు కనిపించలేదు. మళ్ళీ ఆ గోలీని విసిరాడు. ఈసారి ఈ గోలీ రెండో గోలీదగ్గిరే వెళ్ళిపడింది. అమ్మయ్య అనుకుని ఆ గోలీలు రెండూ జేబులో వేసుకున్నాడు. కాని మొదటిసారి విసిరేసిన అసలు గోలీమాత్రం కనిపించలేదు.

ఇంతలోకే దూరంనుంచి ఒక కొమ్ము బూరా మోత వినిపించింది. టామ్ గబుక్కున ఎగిరి గంతేసి, కోటు విప్పేసి, బెల్టు బిగించి, చొక్కా చేతులు ముడిచాడు. పక్కనే ఒక పొద వున్నది. ఆ పొద కెలికి ఒక చిన్న విల్లు, బాణం, తీశాడు. ఒక కర్రకత్తి ఒక కొమ్ముబూరా కూడా తీశాడు. ఉషారుగా గంతు లేస్తూ ఒక పెద్ద మర్రిచెట్టుకిందకి వెళ్లి నుంచున్నాడు. ఇందాక వినిపించిన శబ్దానికి సమాధానంగా తనుకూడా బూరా ఊదాడు. బొటనవేళ్ళమీద నుంచుని అన్ని దిక్కులూ జాగ్రత్తగా చూస్తూ దొంగల నాయకుడులాగా పోజుపెట్టాడు. తనచుట్టూ ఎవరో వున్నట్టుగా ఊహించుకుని, "ఒరేయ్, అబ్బాయిలూ, మీరంతా దాక్కోండి. నేను మళ్ళీ బూరా వూదేదాకా రావద్దు" అన్నాడు.

ఇంతలోకే అక్కడ టాం స్నేహితుడు జోహార్పర్ ప్రత్యక్షమయ్యాడు. వాడు టాంలాగానే, నడుముకు బెల్టు బిగించి, మహాయోధుడులాగా ఆయుధాలు ధరించి గంతులేస్తూ వచ్చాడు.

"ఏయ్, ఆగు. ఎవరు నువ్వు? నా ఆజ్ఞ లేకుండా ఈ షెర్‌వుడ్ అరణ్యంలోకి ఎందుకొచ్చావ్?" అన్నాడు టాం.

"నా పేరు గిస్బరన్. నాకు ఒకళ్ళ ఆజ్ఞ అక్కర్లేదు. అసలు.... అసలు..." హార్పర్‌గాడు తరవాత మాటలు మరచి పోయాడు.

" 'అసలు నన్నడగటానికి

నువ్వెవరు' అనాలి." అని టాం మాటలు అందించాడు హోర్సర్‌కి. ఇప్పుడు వాళ్లు ఆడుతున్న నాటకమంతా పుస్తకంలోదేగా.

"అసలు నన్నడగటానికి నువ్వెవరు?" అన్నాడు హోర్సర్.

"నేనా! నేను రాబిన్‌హుడ్‌ని. తెలిసిందా. తెలియకపోతే ఇదుగో కాసుకో." అన్నాడు టాం.

"ఓహో, నువ్వు గజదొంగ రాబిన్‌హుడ్‌వా? అయితే సరే, నిన్ను జయించి ఈ అరణ్య రాజ్యాన్ని సంపాదిస్తాను, దెబ్బ కాసుకో." అన్నాడు హోర్సర్.

ఇద్దరూ కర్రకత్తులు ఒరల్లోంచి లాగారు. విల్లు, బాణాలు, ఇతర వస్తువులు కింద పడేశారు. కత్తియుద్ధం చేస్తున్న వాళ్ళమాదిరిగా అడుగు తరవాత అడుగు వేస్తూ ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు మహా కోపంగా చూస్తూ కత్తులు కలిపారు. రెండుసార్లు కత్తులు పైకెత్తి ఢీ కొట్టడం, రెండుసార్లు కిందకు వంచి ఢీ కొట్టడం—అదీ వాళ్ళ యుద్ధం. ఈ మాదిరిగా కొంతసేపు పోరాటం జరిగింది.

"ఒరేయ్, హోర్సర్, ఇక పడిపోరా నువ్వు." అన్నాడు టాం.

"నేనెందుకు పడిపోవాలి నువ్వే పడు."

"అది కాదురా. నేను పడగూడదు. పుస్తకంలో ఏముందంటే 'ఒక్కవేటుతో గిస్బరన్‌ను రాబిన్‌హుడ్ చంపేశాడు.' అని వుంది. నువ్వు వెనక్కి తిరిగి నీ వీపుమీద నన్ను పొడవనివ్వాలి."

పుస్తకంలో మాటలకి ఎదురు చెప్పటానికి వీలు లేదుగా. అందుకని హోర్సర్ వెనక్కి తిరిగాడు అయిష్టంగా. కత్తి తగలగానే పడిపోయ్యాడు.

వెంటనే మళ్ళీ లేచి "ఒరే, టాం, ఈసారి నిన్ను చంపనియ్యి. అది న్యాయం." అన్నాడు హోర్సర్.

"అదేమిట్రా. పుస్తకంలో అలాగ లేందే." అన్నాడు టాం.

"ఫరవాలేదు. ఈ ఒక్కసారికేగా."

"సరే, అయితే, నువ్వు కాస్సేపు రాబిన్ హుడ్ అయిపో, నేను నీ శత్రువు నవుతాను."

దీనికి వప్పుకున్నాడు జో. టాం ఒకసారి చచ్చిపోయాడు. మళ్ళీ తను రాబిన్‌హుడ్ అయ్యాడు. ఈ విధముగా మొత్తానికి రాబిన్‌హుడ్ కథనంతనీ వాళ్ళు ఆడారు. చివ్వరికి రాబిన్ హుడ్ చచ్చిపోతాడు కథలో. అందుకని టాం దెబ్బతిన్న వాడివలె తూలుతూ, తూలుతూ కిందపడ్డాడు. ఆ పడటంలో ఒక పల్లేరుకాయమీద పడటం వల్ల గుచ్చుకుని, తను చచ్చిపోయిన రాబిన్‌హుడ్ అని కూడా మరిచిపోయి టాం తపీమని లేచాడు.

ఇద్దరూ మళ్ళీ కోట్లు తొడుక్కుని, తమ ఆయుధాలు దాచేసి బయల్దేరారు. ఈ కాలంలో రాబిన్‌హుడ్ లాంటి గొప్పగొప్ప వీరులు లేరు కదా; మళ్ళీ ఆ పూర్వపు రోజులు ఇక ఎప్పటికీ రావుకదా, అని ఇద్దరు విచారించారు. అమెరికా దేశానికి జీవితాంతమూ అధ్యక్షుడుగా ఉండటం కంటే షెర్వుడ్ అడవిలో ఒక ఏడాదిపాటైనా రాబిన్‌హుడ్‌లాగా వుండటమే మంచిదని నిశ్చయించుకొన్నారు.

(ఇంకా వుంది)

తమాషా ప్రశ్నల జవాబులు

(1) మొదటిగూటిలో 7 పావురాలు రెండో గూటిలో 5 పావురాలు.

(2) ఎడు రెట్లు.

బొమ్మరిల్లు:

## ఎవరిని శిక్షించాలి?

★

శ్రీ నరహరిశెట్టి నరసింహారావు

ఆకాశంలో గరుడ పక్షి ఒక త్రాచుపామును తన్నుకొని వెడుతున్నది. ఆమార్గానే ఒక గొల్ల పిల్ల పెరుగుకుండ నెత్తిన పెట్టుకుని ఒక సత్రానికి తీసుకుపోతున్నది. పాము గరుడ పక్షి తన మెడను నొక్కివేస్తున్నందువల్ల బాధ భరింపలేక విషము కక్కింది. ఆవిషం గొల్లపిల్ల కుండలో పడింది.

సత్రంలో మామూలుగా ముందువచ్చిన ఒక అతిథికి ఆ పెరుగుపోయగా అతడు వెంటనే చనిపోయాడు. సత్రంయజమాని మీద ఆ వూళ్లోనే వున్న ఇద్దరు లంచగొండి అధికారులు విషంపెట్టి చంపాడని కేసు బనాయించారు. మీరే న్యాయాధికారి అయితే గరుడపక్షి, పాము మొదలైన వాళ్లల్లో ఎవరికి శిక్షవేస్తారు?

—



# దేవకన్య

రాకుమారునకు 20 ఏళ్లు నిండాయి. దూర దూర దేశాలనుంచి అనేక పెళ్లి సంబంధాలు వచ్చాయి. రాజుగారి రాయబారులు పలు రకాల వార్తలు తెచ్చారు. "గాంధారదేశ రాకుమారివంటి సౌందర్యవతి ముల్లోకాల్లో లేదు." అన్నాడొక రాయబారి.

"బలిపురపు మహారాజుగారి కుమార్తె తెల్ల గులాబుపూవు వలె ఉంటుంది." అని వర్ణించాడు మరో రాయబారి. ఒకడు చెప్పినట్టు మరొకడు చెప్పకుండా రకరకాలుగా వర్ణించారు. కాని రాకుమారుడికి ఏ అమ్మాయీ నచ్చలేదు. రాజుగారికి కుమారుడి ప్రవర్తన ఏమీ అర్థంకాలేదు.

"ఏమిటయింది రాకుమారుడికి? మంత్రికుమారుని రప్పించండి" అన్నాడు రాజు. "నీవు నా కుమారుని స్నేహితుడవు. నిజం చెప్పు. వానికి వివాహమంటే ఎందుకు ఇష్టంలేదు ?" అని అడిగాడు.

"ప్రభూ, యువరాజు దేవలోకపు కథలు విన్నప్పటినుంచి, దేవకన్యను తప్ప మరెవరినీ పెళ్లాడకూడదని నిశ్చయించుకున్నాడు." అన్నాడు మంత్రి కొడుకు.

"ఈ దేవలోకము ఎక్కడ ఉంది ?" అని దర్యాప్తు చేశాడు రాజు. పెద్దపెద్ద పండితులను పిలిపించారు.

అందరు పుస్తకాలన్నీ తిరగవేశారు. కాని దేవలోకము ఎక్కడ ఉన్నదో, దానికి మార్గమేదో చెప్పలేకపోయారు.

**శ్రీ ఆరికిరేవుల రామధర్మారావు**

"మంత్రికొడుకుని పిలిపించండి" అన్నాడు రాజు మళ్లీ. మంత్రికుమారుడు రాగానే రాజు అతనిని ప్రశ్నించాడు. "దేవకన్యలనుగురించి యువరాజునకు చెప్పిన దెవరు?" అని.

"ప్రభూ ! యువరాజు ఒకసారి వేటకి వెళ్లినప్పుడు, పిల్లనగ్రోవి పుచ్చుకుని, అడవులవెంట తిరిగే పిచ్చిపుల్లయ్యను కలుసుకున్నారు. ఆ పుల్లయ్య చెప్పాడు దేవలోకపు ముచ్చట లన్నీ." అని జవాబిచ్చాడు మంత్రికొడుకు.

సరే, చాల బాగుందనుకుని రాజుగారు అడవులన్నీ వెదికించి పుల్లయ్యని పట్టి తెప్పించారు.

పుల్లయ్య రాజుకి నమస్కరించి తను, తెచ్చిన అడవిమల్లెలు రాజు పాదాలదగ్గర కానుకగా ఉంచి ఎదురుగా నిలబడ్డాడు. "దేవలోకము గురించి నీ వెక్కడ విన్నావు ?" అని రాజడిగాడు. "ఏం ! నేను రోజూ అక్కడకి వెళ్లి వస్తుంటానే" అన్నాడు పిచ్చిపుల్లయ్య. "అది ఎక్కడ ఉంది ?" "తమ రాజ్యముచివర చిత్రగిరి లోయలలో." "అక్కడ దేవకన్యలు కంటికి కగుపిస్తారా ?" "కనిపించవచ్చు...కాని వాళ్లని పోల్చుకోలేము ; వాళ్లు మారురూపాలలో ఉంటారు. చివరకి మనని విడిచి పోతున్నప్పుడు, వాళ్లు తమ నిజరూపాన్ని చూపిస్తారు. కాని వాళ్లను అప్పుడు మరి మనం ఆప

లేము." అన్నాడు పుల్లయ్య. "అలాగయితే వాళ్లని నీవెలాగ గుర్తు పట్టగలవు?" "కొన్ని వేళల వారి పాటలనిబట్టి, కొన్ని వేళల వారి కాంతినిబట్టి" అన్నాడు పిచ్చిపుల్లయ్య. "పిచ్చి వెధవ గెంటివేయండి, బయటకు వీడిని." అన్నాడు రాజు కోపంతో.

## 2

పిచ్చిపుల్లయ్యమాటలు రాకుమారుని మనస్సులో నాటుకున్నాయి. అది ఫాల్గుణమాసము. యువరాజు ఒంటరిగ చిత్రగిరికి బయలుదేరాడు. రాజు "ఎక్కడికి వెళుతున్నావు?" అని అడిగాడు. జవాబు చెప్పకుండా వెళ్లిపోయాడు.

ఒక గుహనుండి ప్రవహిస్తున్న జలధార కొండ దిగువనున్న సరస్సులో కలుస్తూంది. గుహకు దగ్గిరలోనే ఒక పాడు దేవాలయమున్నది. రాకుమారుడు అందులో బస ఏర్పరచుకున్నాడు. ఒక నెల గడిచినది. అతనికి దేవకన్యలెవరూ కనిపించలేదు. ఒకనాటి ఉదయాన రాకుమారుడు పిల్లనగ్రోవి స్వరము విన్నాడు. "ఓహో, అది దేవకన్యే గాబోలు." అనుకుని గబగబ గుఱ్ఱము ఎక్కి, కొండదిగి సరస్సు ఒడ్డుకు చేరాడు. ఒక కొండజాతి యువతి అక్కడ ఉంది. చూశాడు. నల్లగా నిగనిగలాడే శరీరము; నల్లగా మాసిన బట్టలు; చెవినందులో ఒక పూవుతోడిమ. ఆమె కుండను సరస్సులో ముంచి నీళ్లు పట్టుకుని ఆ సరస్సుఒడ్డునే కూర్చుంది.

రాకుమారుడు గుఱ్ఱము దిగి "నీ చెవిలో ఉన్న పువ్వు నాకిస్తావా?" అని అడిగాడు. ఆమె వెనుదిరిగి ఒక్కసారి అతని ముఖంలోకి చూసి పూవుని చెవిలోంచి తీసి యువరాజుకిచ్చింది. "నిజం చెప్పు. నువ్వు దేవకన్యవేనా?" అన్నాడు యువరాజు. ఆమె ఈ మాటలు వినగానే ఆశ్చర్యపడి చూసింది. వెంటనే పగలబడి నవ్వసాగింది. రాకుమారుడు అనుకున్నాడు. "ఓహో, యీ నవ్వే కాబోలు పిల్లనగ్రోవి సంగీతంలా వినిపించింది?" గుఱ్ఱాన్నెక్కి, రెండు చేతులూ చాచి, "ఇలా రా" అన్నాడు రాకుమారుడు. ఏ ఆలోచన లేకుండానే ఆమె అతని చేతు లందుకుని గుఱ్ఱాన్నెక్కింది. చెట్ల మధ్యనుండి "కుహూ, కుహూ" మని కోయిలలు కూశాయి. "నీ పేరేమిటి?" అని ఆమె చెవులో మెల్లగ అన్నాడు. "కజారి" అంది ఆమె. ఇద్దరు ఆ పాడుపడిన దేవాలయాన్ని చేరుకున్నారు.

"నీ మారురూపము [illegible]" అన్నాడు రాకుమారుడు. "మేము కొండజాతివాళ్లము, మేము ఏ మారురూపము ఎరుగము." అన్నదామె. "నీ దేవత్వాన్ని నే చూడాలి" అని అతడు నొక్కి చెప్పాడు. "దేవత్వమా?" అని ఆమె తిరిగి నవ్వడము మొదలెట్టింది. "నిజంగా ఈమె దేవకన్యే. లేకపోతే ఆమెనవ్వు సెలయేటి గలగలచప్పుడులా ఎందుకుంటుంది?" అనుకున్నాడు, యువరాజు.



## 3

రాజుగారికి గూఢచారులవల్ల తెలిసినది, రాకుమారుడొక దేవకన్యను పెళ్ళాడినట్లు. రాచనగరు నుంచి వెళ్ళాయి, ఏనుగులు గుర్రములు, పల్లకీలు. "ఇవన్నీ దేనికి?" అని అడిగింది కజారి. "నీవు నాతో కోటకి రావాలి." అన్నాడు రాకుమారుడు. కజారికళ్లు చెమ్మగిల్లాయి. ఇలాగంది ఆమె. "నేను ధాన్యం ఎండబొయ్యాలి. వేటకై వెళ్ళిన నా తండ్రీ, అన్న తిరిగి వచ్చేవేళ అయింది. ఆ చెట్టు క్రింద బట్ట నేస్తూ కూర్చున్న తల్లి నాకై ఎదురుచూస్తుంటుంది. నేను రాను." అని ఆమె గట్టిగ అరచింది. కాని ఆమె మాటలు రాజభేరుల శంఖాల శబ్దాలలో కలిసిపోయాయి. కజారి కోటముందు పల్లకి దిగగానే "హా, భగవంతుడా! ఇదేమి దేవకన్య!" అని రాణి తల మొత్తుకుంది. రాజకుమారుడి చెల్లెలు అంది "ఛీ! మా వదిన యిలాగుంది. ఎంత సిగ్గుచేటు!" "దేవకన్య కీలువంటి బట్టలా?" అని వెక్కిరించింది ఒక్క దాసి కజారి మాసినబట్టలు చూసి. "ఇష్! ఊరుకోండి. దేవకన్య మారురూపములో మనింటికి వచ్చింది." అన్నాడు యువరాజు.

రోజులు గడుస్తున్నాయి. వెన్నెల రాత్రులలో లేచి చూస్తాడు రాజకుమారుడు, కజారిలో కొంచమైనా మార్పుందేమో, అని. అబ్బే! నల్లరాతిబొమ్మ వలె ఉంది ఆమె. రాకుమారునకు ప్రజల ముందు తలవంపు అయింది. ఒకనాటి ఉదయాన కజారి లేవగనే ఆమె చేయి గట్టిగా పట్టుకుని "నిన్ను ఈ దినము విడిచిపెట్టను. నీ నిజరూపం చూపించు." అని గద్దించాడు. ఈ మాటలు విన్నప్పుడు ఆమె యిదివరకులా నవ్వలేదు. ఆమె వెక్కి-వెక్కి- ఏడవటం మొదలెట్టింది. "ఎల్లకాలము నన్నిలాగే మోసపుచ్చుతావా," అని బ్రతిమిలాడాడు రాకుమారుడు. "లేదు, మరెన్నడు అట్లా చేయను." అందామె. "అయితే జ్ఞాపకముంచుకో, పున్నమనాటి రాత్రికి నీ దేవరూపము నందరు చూడాలి." అన్నాడు.

ఆ రోజు పూర్ణిమ. కోట నగారా మ్రోగుతున్నది. యువరాజు పెళ్లికొడుకు దుస్తులుధరించి, పూలమాల బుచ్చుకుని బయలుదేరాడు-అంతఃపురానికి. చివరకి ఈనాటికి తన భార్య దేవకన్యగా అందరికీ సాక్షాత్కరిస్తుంది!!

తన పడకగది ప్రవేశించాడు యువరాజు. చలువ చేసిన తెల్లటి దుప్పటిపై మల్లెపూలు పరచి ఉన్నాయి. కిటికీలనుండి వచ్చే వెన్నెల పరుపుపై పడుతున్నది.

కాని, కజారి ఏదీ? ఎక్కడ ఉంది? కనిపించదేం? అంతఃపురంలోని స్త్రీలు అందరూ దేవకన్యను చూడాలని గదిచుట్టూ మూగారు. ఎంతసేపటికీ దేవకన్య కనిపించలేదు. రాజకుమారుడు కళ్లవెంబడి నీటిబొట్లు రాలుస్తూ "దేవకన్య మనలని విడిచిపోయేముందు తన నిజరూపాన్ని చూపిస్తుంది. కాని ఆమె వెళ్లిపోయేటప్పుడు మనమెవ్వరం దగ్గర్లో లేము. ఆమె మనలను విడిచిపోయిందప్పుడే" అన్నాడు.

(టాగూరు కథ)

# నేటిప్రపంచం

(8-వ పేజీ తరువాయి)

విషయం తేలిస్తే తప్ప కొరియా విషయం ముచ్చటించడానికి పెకింగు ప్రభుత్వం నిరాకరించింది.

కొరియాలో ఇప్పుడు యుద్ధంచేసే విదేశీ బలాలన్నిటికన్నా చైనాబలాలే ఒకందుకు మంచివిగా కనిపిస్తాయి. చైనా బలాలు కొరియాను ఐక్యపరచడానికి గాను మాత్రమే రణరంగంలో దిగినట్లు కనబడవు. కనీసం చైనా ఆత్మరక్షణార్థమైనా ఉత్తరకొరియా ఉత్తర సరిహద్దున కొంత మేరను, ఏ నెపంమీదా ఇతర బలాలు ఆక్రమించుకోకుండా చూడవలసి ఉన్నది.

చైనా కొరియాలో ప్రవేశించినందువల్ల ప్రపంచశాంతికి గొప్ప ప్రమాదం జరుగుతుందని ఆరు రాజ్యాల తీర్మానం భయపెట్టినప్పటికీ, అమెరికా చైనాతో యుద్ధానికి తలపడటానికి సంసిద్ధంగా ఉన్నట్లు కనబడదు. అమెరికా, 6 వ సేనకు నాయకుడుగా ఉన్న లెఫ్టినెంటు జనరలు వేడిమెయరు చైనా అజేయమని అన్నాడు. కోటిమందిఉండే ఉత్తర కొరియనులే 15 బలమైన డివిజనులు సమకూర్చగలిగినప్పుడు 45 కోట్లజనాభాగల చైనా ఎన్ని డివిజనులు సమకూర్చగలదోయని ఆయన సందేహం. అంతబలంగల చైనా కొరియాలో యుద్ధం చేస్తూకూడా ప్రపంచయుద్ధం తెచ్చిపెట్టాలని ప్రయత్నించకపోవటం ప్రశంసనీయం.

చైనా సద్భావానికి కొన్ని దాఖలాలు కనిపిస్తున్నాయి. చైనాసేనలు ఐక్యరాజ్య బలాలను కొంతదూరం వెనక్కు తరిమివేశాక వెంబడించడం మాని స్థావరాలు ఏర్పాటు చేసుకున్నాయి. వారు తమకు చిక్కిన అమెరికన్ యుద్ధఖైదీలను సులభంగా తప్పించుకుపోనిచ్చారు. తప్పించుకు వచ్చిన అమెరికను సైనికులు చైనావారు తమకు మందులూ, ఆహారమూ ఇచ్చి మన్నించినట్లు చెప్పారు. చైనావారికి కావలసినది యాలూనది పైగల తమ ప్రాజెక్టులను రక్షించుకోవటమేగాని కొరియా విమోచనం కాదని స్పష్టమవుతున్నది. కొరియా చైనాలకు సరిహద్దయిన యాలూనదికి ఇవతల కొంత ప్రాంతం చైనా సైనికుల ఆక్రమణకింద ఉంచనిస్తే కొరియా యుద్ధంలో చైనా జోక్యం తొలగిపోతుందని కొందరి భావం. కాని జనరల్ మకార్థర్ దీనికి పూర్తిగా వ్యతిరేకి. ఉత్తరకొరియానుంచి చైనా సైనికులను తరిమి వేయాలని అతడి ఆశయం. నిజానికి డగ్లస్ మకార్థర్ చైనాతో యుద్ధానికి దిగి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఓడించి, అక్కడ చంగ్ కైషేక్ ను పునస్థాపన చెయ్యాలన్నంతటి ఆశయం పెట్టుకున్నాడు. ఈ ఆశయంతో చాలా దేశాలు ఏకీభవించవు.

## చైనా షరతులు

కొరియా యుద్ధంనుంచి తాను విరమించటానికి చైనా ప్రభుత్వం నాలుగు షరతులు సూచించినట్లు తెలుస్తున్నది. ఈషరతులు చైనా సద్భావాన్ని వ్యక్తం చేస్తున్నవి. ఈ షరతులేమంటే: (1) కొరియా, మంచూరియా సరిహద్దుకు దక్షిణాన కొంతప్రాంతం నిర్వివాద ప్రాంతంగా ఉంచి, అక్కడ ఉత్తరకొరియావారి పరిపాలన సాగనివ్వాలి (2) ఫార్మోజా సముద్రంనుండి అమెరికా 7 వ నౌకా దళాన్ని ఉపసంహరించాలి. (3) ఫార్మోజా దీవిలో చాంగ్ కైషేక్ పరిపాలనను పరిగణించడం మానాలి. (4) చాంగ్ కైషేక్ ప్రభుత్వానికి ఎట్టి సహాయము ఇక చెయ్యమని అమెరికా స్పష్టంగా ప్రకటించాలి.

ఈ షరతులన్నీ చైనా యోగక్షేమాలకు నేరుగా సంబంధించినవే. కాని ఈ షరతులకు అమెరికా ఒప్పుకున్నట్టయితే దూర ప్రాచ్యంలో జనరల్ మకార్థర్ ఆశయాలు విఫలం కావడమేకాక, కొరియా యుద్ధసమస్యకూడా తేలిపోతుంది. ఫార్మోజాలో కూడా చంగ్ కైషేక్ కు నిలువ నీడ లేకపోతే ఐక్యరాజ్య సమితిలో కమ్యూనిస్టు చైనా ప్రవేశించడానికి ఎట్టి అవాంతరమూ ఉండదు. అటుపైన కొరియాలో ఉత్తర కొరియనులు యుద్ధం విరమించుకొని అమెరికాకు కావలసిన ప్రభుత్వం కొరియా అంతటా ఏర్పరచినప్పటికీ అది కొరియా ప్రజలకు అవసరంలేని సింగ్మన్ రీ లాటి ప్రభుత్వమైతే క్షణంలో పడిపోతుంది. ఈ లోపుగా ఉత్తరకొరియా ప్రభుత్వానికి మంచూరియా దక్షిణాన నిలవ నీడ లభిస్తుంది. కొరియాప్రజలు ఎప్పటికైనా ఉత్తర కొరియా ప్రభుత్వాన్నే బలపరుస్తారనే విశ్వాసం చైనాకున్నట్టు స్పష్టమవుతోంది. ఆకారణంచేతనే అమెరికావాళ్లు, తమకు మంచూరియాపై దురాశ లేదనీ, దానికి దక్షిణాన 30 మైళ్ల మేర ప్రత్యేకించి అక్కడ ఐక్యరాజ్య పరిపాలన సాగనిస్తామనీ, అంటున్నారు. చైనా పెట్టిన ఇతరషరతుల గురించి వారు మాట్లాడడం లేదు. అయితే పూర్తిగా అమెరికా చేతికీలుబొమ్మగా పనిచేసే ఐక్యరాజ్యసమితి ఏర్పాటుచేసే ప్రభుత్వాన్ని చైనా ఆమోదించడం సాధ్యంకాదు. అందుచేత ఈ సమస్య ఇంతటితో తేలేది కాదనీ, దూర ప్రాచ్యంలో తనకు దురుద్దేశాలు లేవని అమెరికా రుజావు చేసుకోలేదనీ అనుకోవాలి.



# గమనిక

అనివార్యమైన కారణాలవల్ల ఈ వారం డిటెక్టివ్ సీరియల్ "దాగిన ద్వేషం" ప్రచురించబడలేదు. వచ్చేవారం యథాప్రకారం ప్రచురించబడుతుంది.

—సంపాదకుడు

**బాలవిజ్ఞానం:**

# మనుష్యుల నాగరికత

భూమి మీద సంచరించే జంతువు లన్నిటిలోకీ మనిషే గొప్పవాడని తెలుసుకున్నాం. మనిషి జీవితానికీ, జంతువుల జీవితానికీ, తేడా ఎక్కడవున్నదంటే, మనిషికి గొప్పనాగరికత వున్నది. జంతువులకి లేదు. అవికొన్ని వేల ఏళ్ల కిందట ఏవిధంగా బతికేవో ఈ నాటికీ అదే మాదిరిగా బతుకుతున్నాయి. మనిషి అలాకాదు. కొన్ని వేల ఏళ్ల కిందట మనిషి దాదాపు తక్కిన జంతువుల మల్లేనే వుండేవాడు. గాని క్రమంగా నాగరికత సంపాదించి జంతువుల మీదనే కాకుండా. ప్రకృతిమీద కూడా అధికారం సంపాదించాడు.

ఏమిటీ నాగరికత? జంతువులు ప్రకృతిలో తయారుగా వున్న తిండిని ఉపయోగించుకుంటాయి. పెద్దపులులు, సింహాలు చేతికందిన చిన్న జంతువులని చంపితింటాయి. గేదెలు, ఆవులు, గుర్రాలు మొదలైనవి పచ్చికదొరికే చోట్లకివెళ్లి కడుపు నింపుకుంటాయి. ఒకవేళ వాటికి ఎక్కడా పచ్చికగాని, చిన్న జంతువులుగాని దొరకవనుకోండి. ఆకలికి చచ్చిపోతాయి.

మనిషి అలాకాదు. ప్రకృతిలో వున్న కొన్ని పదార్థాల్లోంచి ఆహారాన్ని తయారు చేసుకుంటాడు. మొదట్లో కొద్దిగాదొరికే ఏ ఆహార పదార్థాన్నైనా కొన్ని రెట్లు ఎక్కువ వృద్ధిచేసుకోగలడు.

పూర్వం ఏ నది ఒడ్డునో వరి మొక్కలు మొలవటం చూసివుంటాడు మనిషి. ఆ వరిగింజలు ఆహారంగా పనికి వస్తాయని తెలుసుకుని, వ్యవసాయం మొదలు పెట్టివుంటాడు. ఈ నాడు మనం సైన్సుసహాయంతో మనకి కావలసినంత ఆహారాన్ని తయారు చేసుకోగలుగుతున్నాం. జంతువులమాదిరిగా ఉన్నదాని మీదనే ఆధారపడటంలేదు. ఉన్నదానిలో నించి లేని దానిని కూడా తయారు చేసుకుంటున్నాం. ఇదే మనకీ, జంతువులకీ ముఖ్యమైన తేడా. మనతిండిని మనం సృష్టించుకోగలం. చలికి, వేడికి చచ్చిపోకుండా మనంబట్టలు, ఇళ్లూ మొదలైనవి తయారు చేసుకోగలం అంటే ప్రకృతిని కొంతవరకు జయించామన్నమాట.

మనుషుల నాగరికత వృద్ధికావటంలో చాలా సహాయ పడినది ఒకటున్నది. అది నిప్పుతయారు చేయటం. ఈ రోజున ఈ మాట చాలా వేళాకోళంగా కనిపిస్తుంది. నిప్పుచేయటం ఏమంతకష్టం? అగ్గిపుల్లని అగ్గిపెట్టె మీదగీస్తే కావలసినంత నిప్పు. కాని ఈ అగ్గిపుల్లని తయారు చేసే పద్ధతి కనిపెట్టడానికి ముందు మనిషి ఎంత తంటాలు పడ్డాడో?

మనిషికి నిప్పు అంటే ఏమిటో తెలియక ముందే ప్రపంచంలో నిప్పు వున్నది. అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు పెద్దపెద్ద మంటలు లేచి అడవులకి అడవులు తగలబడేవి. ఒక్కొక్కసారి ఆకాశంలో మెరపులు కిందుగా వచ్చి ఏ చెట్టునో తాకినప్పుడు ఆ చెట్టు మండిపోయేది. ఈవిధంగా మనిషి ఎప్పుడో నిప్పుఅనే దాన్ని చూసి వుంటాడు. ఈ నిప్పు ఆహారం తయారుచేసుకోవటంలోను, చలినుండి రక్షించుకోటానికి, చీకట్లోకూడా వెలుతురు తయారు చేయటానికి పనికి వస్తుందని తెలుసుకుని వుంటాడు.

పూర్వపు మనుషులు తమజీవితానికి అంతటికీ ముఖ్యమైనది అగ్ని అని తెలుసుకున్నారు. మన ఆర్యులు అగ్నిని దేవుళ్లలో ఒకడుగా ఎంచి పూజించేవారు. యజ్ఞాలు చేసేటప్పుడు అగ్నిగుండంలో హోమాలు చేసేవారు. నెయ్యి, సమిధలు మొదలైనవి వేసి దాన్ని ఎక్కువ చేసేవారు. కొందరు ఆర్యులు ఈ అగ్ని ఆరిపోకుండా సంవత్సరాల తరబడి కాపాడేవారు కూడా. వీళ్లనే 'నిత్యాగ్నిహోత్రు'లంటాం. ఎందుకంటే ఆరోజుల్లో నిప్పు ఒకసారి ఆరిపోతే మళ్లీ

తయారు చెయ్యటం చాలాకష్టంగా వుండేది.

మనదేశానికి వాయవ్యంగా పర్షియా అని ఒక దేశంవున్నది. ఆ దేశంలో ఉండే జనులు కూడా అగ్నిని దేవతగా పూజించే వాళ్లు. మనకు విష్ణుమూర్తి ఎంత గొప్ప దేవుడో, ఆ దేశపువాళ్ళకి అగ్ని దేవుడంత గొప్ప. తక్కిన దేవతలంతా ఆయనకి సేవకులే.

యూరపు ఖండంలో గ్రీసు అని ఒక దేశంవున్నది. అక్కడ ఒక తమాషా కథ చెబుతారు. ఒకసారిట, దేవతలకి మనుషుల మీద కోపంవచ్చిందట. అప్పుడు ప్రపంచంలో ఎక్కడా నిప్పు అనేది లేకుండాచేసి, దాన్ని తమ లోకానికి తీసుకు పోయారట. మనుషులు నిప్పులేక నానాబాధలు పడేవాళ్లుట. అప్పుడు 'ప్రొమీథియస్' అనే ఆయన మనుషుల బాధలు చూడలేక దేవతల నుండి అగ్నిని దొంగిలించుకువచ్చి మనుష్యులకిచ్చాడట. అప్పుడు దేవతలకి కోపం వచ్చి 'ప్రొమీథియస్' ని ఒకచోట కట్టేసి రాబందులని వదలిపెట్టారట. ఆ రాబందు లిప్పటికీ అతని గుండెకాయని పీక్కుతింటూ వుంటాయట

ఈవిధంగా వివిధదేశాల్లో అగ్నిని గూర్చి పుక్కిటి పురాణాలు చెప్పుకుంటూవుంటారు. కాని అసలు అగ్ని అనేది ఏమిటో శాస్త్రీయంగా ఆ కాలంలో ఎవరికీ తెలియదు. గడచిన రెండు మూడు వందల ఏళ్ళలో శాస్త్రజ్ఞులు అగ్నిని గూర్చి చాలా విషయాలు కనుక్కున్నారు. అవి తరవాత తెలుసుకుందాం.

మానవుడు తన తిండిని తను తయారు చేసుకోవటంతో ఆగలేదు. కొన్ని సౌఖ్యాలను కూడా తయారు చేసుకున్నాడు. చెట్లుకొట్టి ఆ కలపతోటి, కొండలు బద్దలుకొట్టి ఆ రాళ్లతోటి పెద్దపెద్ద భవనాలు కట్టుకున్నాడు. కలపతో కుర్చీలు, బల్లలు, మంచాలు మొదలైన సామాన్లు తయారుచేశాడు. గనులుతవ్వి ఇనుము తీసి దానితో ఎన్నో పనిముట్లు చేసుకున్నాడు. అంతేకాదు. మహానగరాలు కట్టాడు. నడిచి పోవటం ఆలస్యమౌతుందని గుఱ్ఱాలను, ఎద్దులను మచ్చికచేసుకుని వాహనాలు తయారు చేశాడు. కవిత్వం, చిత్రకళ, సంగీతం మొదలైన కళలు కనిపెట్టాడు. తనపూర్వులు సంపాదించిన విజ్ఞానం తన తరవాత తరాలవారికి కూడా ఉపయోగపడేందుకు అక్షరాలు కనిపెట్టాడు. ఈ అక్షరాల సహాయంతో భాషని వృద్ధిచేసుకుని పుస్తకాలు రాశాడు. ఇదంతా నాగరికతే.

నాగరికత వృద్ధికావటానికి అన్నిటి కంటే ముఖ్యకారణం మరొకటున్నది. మానవుడు సంఘజీవి. అంటే ముఠాలు ముఠాలుగా ఏర్పడి జీవిస్తారు మనుషులు. ఏమనిషికి ఆ మనిషి విడివిడిగా ఆహారం తయారు చేసుకోడు. కొంతమంది కలిసి, ఒకళ్లకొకళ్లు సహాయంచేసుకుంటారు. వ్యవసాయాన్ని ఉదాహరణగా తీసుకుందాం. ఒక్క మనిషి వ్యవసాయానికి సంబంధించిన పనులన్నీ చెయ్యగలడా? కొంతమంది నాగళ్లు తయారుచేయాలి. కొందరు కొడవళ్లుతయారుచేయాలి. కొందరు నాగళ్లకు ఎడ్లను కట్టి భూమిని దున్నాలి. పండిన పంటను కొందరుకోసి, నూర్పాలి. కొందరు వడ్లను దంపాలి. కనుక ఏపనీ కూడా ఒక్క మనిషి వల్ల సాధ్యంకాదు. అందుకనే మానవుడు సంఘజీవి అంటాము. మనుషుల్లో అందరూ ఒకే రకమైన పనిచెయ్యకుండా ఒక్కొక్కడూ ఒక్కొక్కరకమైన పనిచేసి, మిగతావాళ్లకి తోడుపడటం వల్లనే మన నాగరికత పెరిగింది. మనలో కొందరు వైద్యులు, కొందరుచాకళ్లు మంగళ్లు, కమ్మర్లు, కుమ్మర్లు, రైతులు ఉన్నారు. వీళ్లలో ఎవరు లేకపోయినా మనకి జరగదు.

ఇలాగ ఒక్కొక్కరూ ఒక్కొక్క పనిని చెయ్యటంమూలాన ప్రతి పనినీ బాగా చేసే పద్ధతులు కూడా కనిపెట్టాం. మనం ఉదాహరణకి ఒకమనిషి పైనచెప్పిన పనులన్నిటినీ తనే చెయ్యాలనుకుంటాడనుకోండి. వైద్యమూ సరిగ్గా చెయ్యలేడు, వ్యవసాయమూ, కమ్మరిపని, వడ్రంగంపని, ఏదీకూడా, ఈనాడు జరుగుతున్నంత బాగా చెయ్యలేడు. కాని ఒక మనిషికో, లేక కొంతమంది మనుషులకో వైద్యం చేసేపని అప్పగిస్తామనుకోండి. వాళ్లు వైద్యం యొక్క కిటుకులన్నీ కనుక్కోవటానికి తమకి వున్న కాలమంతా వినియోగిస్తారు. ఏయే జబ్బులు ఎందుకు వస్తున్నాయో, వాటిని పోగొట్టడానికి ఏయేమందులు ఉపయోగించాలో, ఆ మందులు ఎల్లా

# మనదేశం

(4-వ పేజీ తరువాయి)


కమిటీల నివేదికలు అధ్యక్షునికి అందవలసి ఉన్నది. ఉత్తరప్రదేశంవారింకా తమ సమావేశాలనుకూడా పూర్తి చేయలేదట. ఎన్నికలు వాయిదాపడ్డ అవకాశం చూసుకుని ఈ కమిటీలు తమ పని పూర్తిచెయ్యడంలో తాత్సారంచేస్తే 1951 ఆఖరుకు కూడా ఎన్నికలు జరగని పరిస్థితి ఏర్పడే భయం లేకపోలేదు.

ఎన్నికలు వాయిదా పడడంచేత వివిధ రాజకీయపక్షాలవారు తమతమ పక్షాలను బలపరచుకోనడానికి మరింత వ్యవధి ఉంటుందనికూడా కొందరంటున్నారు.

## "క్రమమైన ఎన్నికలు"

ఎన్నికలు న్యాయంగానూ, స్వేచ్ఛగానూ జరగడానికి తగిన ఏర్పాట్లన్నిటినీ ప్రభుత్వం చేస్తున్నదనీ, చేస్తుందనీ పండిట్ నెహ్రూ పార్లమెంటులో స్పష్టంగా ప్రకటించాడు అన్ని పక్షాలకూ సమానావకాశా లుంటాయనికూడా ఆయన తెలిపాడు.

ఈవిధంగా ఎన్నికలు 6 మాసాలు వాయిదా పడడంవల్ల ఒకరికి లాభంగాని, మరొకరికి నష్టంగాని కలుగుతుందని అనుకునే ఆస్కారంలేదు. ప్రస్తుతం కాంగ్రెసులో చీలికలు ఉండనే ఉన్నవి. అయితే ఈ కాంగ్రెసులోని చీలికలు కాంగ్రెసువిచ్ఛిత్తికి దారి తీసేటంతవిగా లేవు. కాంగ్రెసు నాయకులకు పోటీలు



ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉంటున్న నేపాలురాజు 13-వ తేదీనాడు అధ్యక్షుడు రాజేంద్రప్రసాదుగారిని కలుసుకొని నేపాలులోని ఇటీవలి పరిణామాలను ఆయన కెరుకపరిచారు. కులాసాగా తేనీరు తాగుతూ వారుభయులూ ఆ సంగతులన్నీ విశేవారిగా ముచ్చటించుకొన్నారు.


ఉన్నప్పటికీ కాంగ్రెసు శ్రేయమార్కును కాలదన్ని బయటికి వెళ్లే ధైర్యసాహసాలు ఎవరికీ లేవు అంగుచేత ఈ వర్గాలు నినాదాలు పలకడానికి మాత్రమే మురాలు కడుతున్నారు కృపలానీవర్గం "న్యాయమైన ఎన్నికలు జరిగేట్టు చూస్తాం" అనటంలో ఆంతర్యం ఇదే.

కాంగ్రెసుబావుటాకింద నిలబడకుండా ఎన్నికలలో పోటీచేసి కాంగ్రెసును పడగొట్టే సత్తాగల పక్షం దేశం అంతటా ఏ ఒక్కటీ ఉన్నట్టు కనబడదు అతివాద పక్షాలకు అక్కడక్కడా స్థానికంగా కొంత బలం ఉన్నా, దేశమంతటా వాళ్లకు ప్రజాబలం లేదు. వామపక్షాలలో చాలా చీలిక లున్నాయి వాటిలో చెప్పుకోదగిన కమ్యూనిస్టు, సోషలిస్టుపక్షాలు ఆంతరంగిక బలంగాని, బహిరంగబలంగాని కలిగి లేవు కమ్యూనిస్టులు తమ వర్గంలో అతివాదులనూ, మితవాదులనూ వేటాడుతుంటూ, సిద్ధాంతాలనూ, కార్యాచరణనూ సమన్వయించుకోలేని స్థితిలో ఉన్నారు. సోషలిస్టునాయకులలో తలా ఒక ధోరణి కనిపిస్తున్నది ఈ రెండుపక్షాలుకూడా ప్రజలను విశేషంగా తమ పక్షానికి త్రిప్పుకుని కాంగ్రెసును ఓడించే స్థితిలో లేవు

అందుచేత 1951 అంతంలో తొలిగా జరిగే ఎన్నికలలో వివిధరాష్ట్రాలలోని కాంగ్రెసు వర్గాలలో గల స్పర్ధలు తీవ్రం కావటం స్పష్టంగా బయటపడుతుంది. కాలం గడిచినకొద్దీ ఈ చీలికలు ఎక్కువవుతాయిగాని తగ్గబోవు ఈబాధ కేంద్రప్రభుత్వానికి అంతగా ఉండకపోవచ్చు. ఎందుచేతనంటే ప్రస్తుతం కేంద్రంలో గల కాంగ్రెసుఅధిష్ఠానవర్గంకన్న ఉత్తమనాయకులను కాంగ్రెసులోని ఏవర్గమూ సృష్టించలేదు వారిపై దేశప్రజలందరికీ ఇంకా పూర్తివిశ్వాసం కూడా ఉన్నది. ★★

---

తయారు చెయ్యాలో కనిపెట్టడానికి వీలుంటుంది. అందుచేత ఒక్కొక్కళ్లు ఒక్కొక్క రకమైన పని చెయ్యటం సంఘానికంతటికీ లాభకరమే. దీన్నే వృత్తుల విభజన అంటాం. ఈ వృత్తులవిభజన ఎప్పుడైతే మనుషులు నేర్చుకున్నారో, అప్పటినుంచీ వారినాగరికత మరింత వృద్ధికావటం మొదలెట్టింది. ★★



విజయవాడలో 14-11-50 వ తేదీన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ శిక్షణ కేంద్రాన్ని
శ్రీ కాకాని వెంకటరత్నంగారు ప్రారంభోత్సవం చేశారు.




హిందీ సౌహార్ద్రసంఘం తెనాలి ఆదర్శ బాలికా పాఠశాలను సందర్శించిన సందర్భంలో తీయబడిన ఛాయాచిత్రం.




Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras